PRAJASAKTI Regd.No. 15795/68

# ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

సిటీ

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 44 సంచిక : 162 | విజయవాడ, సోమవారం 13 జనవరి 2025 | 8 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Monday 13 January 2025 | Rs

### సమాఖ్యవాదానికి దెబ్బే

- దబ్బును ఆదా చేయదు.. జిడిపిని మెరుగుపర్చదు
- ఇదంతా మోడీ నియంతృత్వ పోకడల్లో భాగం
- 'ఒకే దేశం-ఒకే ఎన్నిక'పై రాజకీయ విశ్లేషకులు, మేధావులు

7

### ఐపిఎల్ తేదీలు వచ్చేశాయి!

- మార్చి 21న ప్రారంభం, మే 25న ఫైనల్
- నూతన కార్యదర్శిగా దేవజిత్ సైకియా
- కోశాధికారిగా ప్రభ్‌తేజ్ సింగ్

8




# 'జమిలి' దేశానికి ప్రమాదకరం

## ప్రాంతీయ పార్టీల ఉనికి ప్రశ్నార్థకం

## లేబర్ కోడ్‌ల అమలును అడ్డుకోవాలి : బివి రాఘవులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం ఎన్నికల్లో లబ్ధిపొందేందుకే ఒకే దేశం - ఒకే ఎన్నికల పేరుతో కుట్రకు తెరలేపిందని సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు విమర్శించారు. సిపిఎం తెలంగాణ రాష్ట్ర నాలుగో మహాసభను పురస్కరించుకొని ఆదివారం హైదరాబాద్‌లోని ఎంబి భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు చుక్క రాములుతో కలిసి ఆయన మాట్లాడారు. బొటాబొటి మెజార్టీ ఉన్నా 'ఒకే దేశం - ఒకే ఎన్నిక' బిల్లును అమోదింపజేసేందుకు 189వ రాజ్యాంగ సవరణకు బిజెపి ప్రయత్నాలు మొదలు పెట్టిందని దుయ్యబట్టారు. ఉభయ సభల్లో బిల్లు ఆమోదం పొందదనే ఉద్దేశంతో సెలెక్ట్ కమిటీకి పంపిందని గుర్తు చేశారు. ఇప్పటికే దేశంలోని చిన్నాచితక పార్టీలను బెదిరిస్తూ.. బుజ్జగిస్తూ బిల్లును ఆమోదింపజేసుకునేందుకు కుట్రలు పన్నుతోందన్నారు.




మీడియా సమావేశంలో మాట్లాడుతున్న బివి రాఘవులు, చిత్రంలో తమ్మినేని వీరభద్రం, చుక్క రాములు

దేశంలోని లౌకిక పార్టీలన్నీ ఒకే తాటిపైకి వచ్చి పార్లమెంట్‌లో వన్ నేషన్... వన్ ఎలక్షన్ బిల్లు ఆమోదం పొందకుండా అడ్డుకోవాలని కోరారు. ఈ బిల్లుకు ఆమోదముద్ర పడితే దేశంలోని ప్రాంతీయ పార్టీల ఉనికికే ప్రమాదకరమని హెచ్చరించారు. రాష్ట్రంలోని బిఆర్ఎస్ దీనిపై తన వైఖరి వెల్లడించాలని డిమాండ్ చేశారు. బిజెపి ప్రభుత్వం ఎన్నికల నిర్వహణ నిబంధనల్లో మార్పులు చేయడాన్ని తప్పుపట్టారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించిన సాంకేతిక అంశాలైన సిసిటివి, వెబ్‌కాస్టింగ్ తదితర డిజిటల్ విధానాలు ఎవరూ పొందకుండా మార్పులు చేశారని గుర్తు చేశారు. ఫలితంగా ఎన్నికల నిర్వహణలో జరిగే అవినీతి, అక్రమాలపై ప్రశ్నించే అధికారాన్ని ప్రజలు కోల్పోతారని తెలిపారు. ఇది ప్రజాస్వామ్యానికి పెను ప్రమాదమని హెచ్చరించారు. ఏప్రిల్ నుంచి నాలుగు లేబర్ కోడ్‌ల మార్గదర్శకాలు అమల్లోకి రానున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఫలితంగా కార్మికులు సమ్మె, చర్చల హక్కులను కోల్పోతారని తెలిపారు. ఈ మార్గదర్శకాలు యాజమాన్యాలకు చుట్టాలు కాగా, కార్మికుల మెడపై కత్తుల్లాంటివని సూచించారు. ఇండియా బ్లాక్‌లో భాగస్వామిగా ఉన్న కాంగ్రెస్ పార్టీ లేబర్ కోడ్‌ల మార్గదర్శకాలను వారు అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో అమలు జరగకుండా అడ్డుకోవాలని సూచించారు. తెలంగాణ రాష్ట్రంలో రేవంత్ ప్రభుత్వం అందుకు సానుకూలంగా ఉంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

# పేదరికంలోనే ప్రజలు

## దారిద్ర్య నిర్మూలనకే పి4 విధానం - సలహాలు, సూచనలు, అనుభవాల స్వీకరణ : సిఎం చంద్రబాబు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఉమ్మడి రాష్ట్రంలో 1995లో సంస్కరణలు అమలు చేసినా, రాష్ట్రంలో ఇప్పటికీ లక్షల కుటుంబాలు పేదరికంలోనే ఉన్నాయని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెలిపారు. కేంద్ర ప్రభుత్వ గణాంకాల ప్రకారం నేటికీ రాష్ట్రంలో గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఎంతోమంది కటిక పేదరికంలోనే ఉన్నారని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రజలకు ముఖ్యమంత్రి సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పబ్లిక్- ప్రైవేట్- పీపుల్- పార్టనర్‌షిప్ (పి4)పై ఆదివారం విధాన ప్రకటన విడుదల చేశారు. ఆర్థిక సంస్కరణల్లో భాగంగా గతంలో తీసుకొచ్చిన పి3 (పబ్లిక్ ప్రైవేట్ పార్టనర్‌షిప్) విధానంతో ఉపాధి, సంపద సృష్టి జరిగిందన్నారు. నాటి సంస్కరణ ఫలాలు అన్ని వర్గాలకు చేర్చాల్సిన బాధ్యత ఉందన్న ఆయన విద్య, వైద్యం, పౌష్టికాహారం, తాగునీరు వంటి కనీస అవసరాలు కూడా తీరని పరిస్థితిలో ఉన్నారని వివరించారు. ఇలాంటి పరిస్థితిని మార్చేందుకు, సమాజాన్ని శక్తిమంతంగా చేసేందుకు పి4 విధానాన్ని ప్రతిపాదించి నేడు విధాన పత్రాన్ని ఆవిష్కరిస్తున్నామని చెప్పారు. పది సూత్రాలతో స్వర్ణాంధ్ర-2047 విజన్‌ను ఆవిష్కరించామని గుర్తు చేశారు. ఇందులోని 10 సూత్రాలు ప్రకటించామని, వీటిల్లో ప్రథమ సూత్రమే జీరో పావర్టీ అని వివరించారు. ఈ లక్ష్యాన్ని సాధించేందుకు ఉద్దేశించిందే పి4 విధానమని వెల్లడించారు. తమ శక్తియుక్తులతో, ప్రభుత్వ పాలసీతో సమాజంలో అత్యున్నత స్థానాలకు చేరుకున్న 10 శాతం మంది ప్రజలు అట్టడుగున ఉన్న 20 శాతం మంది ప్రజలకు చేయూతనిచ్చి పైకి తేవాలని కోరారు. పేద వర్గాల చదువులకు, ఉపాధి అవకాశాలకు, నైపుణ్యం పెంచేందుకు ఒక పద్ధతి ప్రకారం చేయూతనిస్తే వారి కుటుంబాలు నిలబడతాయని తెలిపారు. వెనుకబడిన వర్గాలకు అవసరమైన నాలెడ్జ్, సాంకేతికతను అందించి మార్గ నిర్దేశనం చేసి వారి జీవితాల్లో వెలుగులు తేవచ్చన్నారు. ఎవరు ఎక్కడ స్థిరపడినా వారి మాతృభూమిలో ఒక వ్యక్తికో, ఒక కుటుంబానికో, ఒక సమూహానికో, ఒక గ్రామానికో, ఒక ప్రాంతానికో చేయూతను అందించి వారి జీవన ప్రమాణాలు పెంచవచ్చని తెలిపారు.

గతంలో జన్మభూమి స్ఫూర్తితో చేపట్టిన కార్యక్రమాలు గ్రామాల్లో అద్భుత ఫలితాలను ఇచ్చాయని, ఈ పిలుపుతో ఎన్ఆర్ఐలు, పారిశ్రామికవేత్తలు పెద్దయెత్తున ముందుకొచ్చి అనేక గ్రామాల రూపురేఖలు మార్చారని వెల్లడించారు. నేడు అదే స్ఫూర్తితో అట్టడుగున ఉన్న పేదలకు అవకాశాలు కల్పించి వారిని పైకి తెచ్చేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. పేదరికం లేని సమాజం తమ నినాదం, విధానమని తెలిపారు. ప్రభుత్వం చేసే కార్యక్రమాలతోపాటు ప్రజలు కూడా భాగస్వామ్యులైతే ఈ లక్ష్యాన్ని చేరుకోవచ్చని వెల్లడించారు. రాష్ట్ర ప్రజలతోపాటు సంక్రాంతికి సొంత ఊళ్లకు వచ్చిన ప్రతి ఒక్కరూ దీనిపై చర్చించాలని కోరారు. పి4 విధానంపై ప్రతి ఒక్కరి సలహాలు, అనుభవాలు, ఆలోచనలు, సూచనలు తీసుకునేందుకు తాము సిద్ధంగా ఉన్నామని వెల్లడించారు. దీనికోసం ప్రత్యేకంగా ఒక పోర్టల్ తీసుకొచ్చి 30 రోజులపాటు ప్రతి ఒక్కరి ఆలోచనలు స్వీకరిస్తామని ప్రకటించారు. తెలుగుజాతిని నెంబర్ 1 చేసే క్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములై కలిసి రావాలని కోరారు. 'నేను సైతం' అని ప్రతి ఒక్కరూ భాగస్వాములయ్యేలా సంక్రాంతి రోజు సంకల్పం తీసుకోవాలని కోరారు. తద్వారా ఆరోగ్య, ఆనంద, అభివృద్ధి ఆంధ్రప్రదేశ్ సాదిద్దామని వివరించారు.



నారావారిపల్లెలో ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న చంద్రబాబు

2



### కత్తి కట్టిన కోడి

- యథేచ్ఛగా పందేలు
- పోలీసుల ప్రేక్షక పాత్ర

2

### బల్క్‌డ్రగ్ పార్కు రద్దు చేయాలి

- మత్స్యకారులు, ప్రజల నిరసన ప్రదర్శన
- పార్టీలకతీతంగా మద్దతు

3

### గ్రీన్‌కో అక్రమాలు పవన్‌కు కనిపించలేదా..?

- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కె ప్రభాకర్‌రెడ్డి

2

# మోసం గురూ..!

- కేటాయించిన సొమ్ములోనూ భారీ కోత
- 70 వేల కోట్లు మిగుల్చుకున్న కేంద్రం

**న్యూఢిల్లీ :** దేశ ప్రజలను కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం నయవంచనకు గురి చేసింది. వివిధ పథకాలకు భారీగా కేటాయింపులు చేశామని గొప్పలు చెప్పుకున్నా.. మోడీ సర్కార్ ఆ సొమ్మును ఖర్చు చేయకుండా మోసానికి పాల్పడింది. గత బడ్జెట్‌లో వివిధ పథకాలకు కేటాయించిన నిధుల్లో రూ 70 వేల కోట్లను ఇప్పటి వరకూ ఖర్చు చేయలేదు. ప్రస్తుతం బడ్జెట్ కసరత్తు జరుగుతున్న నేపథ్యంలో ఈ మోసం వెలుగులోకి వచ్చింది. 2024 జూలైలో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో వివిధ పథకాలకు కేటాయించిన నిధులను కేంద్ర ప్రభుత్వం ఇంకా ఖర్చు చేయకుండా 70 వేల కోట్లకు పైగా మూలధనం, రెవిన్యూ ఆదాయాన్ని కేంద్ర ప్రభుత్వం మిగిల్చుకుంది. వీటిని ఈ ఏడాది ప్రవేశపెట్టే బడ్జెట్‌లో ప్రకటించే కొత్త పథకాలకు కేటాయించనున్నారు. బడ్జెట్‌లో కేటాయించిన నిధులను ఆయా పథకాలకు మంజూరు చేయకుండా ప్రభుత్వం ఆదా చేసుకోవడంపై సర్వత్రా విమర్శలు వస్తున్నాయి. మోడీ ప్రభుత్వంలో పేరుకే పథకాలు ప్రకటిస్తారని, వాటికి నిధులు ఇచ్చి మిగతా 5లో



# ఛత్తీస్‌గఢ్‌లో మరో ఎన్‌కౌంటర్

- ఐదుగురు మావోయిస్టుల కాల్చివేత

**రాయ్‌పూర్ :** దండకారణ్యంలో ఎదురుకాల్పులు నిత్యకృత్యంగా మారాయి. నెత్తుటి రుచి మరిగిన పులిలా ..తూటాలు గర్జిస్తున్నాయి. ఛత్తీస్‌గఢ్‌లో చోటుచేసుకున్న మరో ఎదురుకాల్పుల ఘటనలో ఐదుగురు మావోయిస్టులు చనిపోయారు. వీరిలో ఇద్దరు మహిళలున్నారు. బీజాపూర్ జిల్లాలో ఇంద్రావతి నేషనల్ పార్క్ ప్రాంతంలోని అడవుల్లో ఆదివారం ఉదయం భద్రతా సిబ్బంది మావోయిస్టుల ఏరివేత కార్యక్రమాన్ని చేపడుతుండగా ఈ ఎదురు కాల్పులు చోటుచేసుకున్నాయని బస్తర్ ఐజీ తెలిపారు. ఈ ఘటనలో ఐదుగురు మావోయిస్టులు చనిపోయారని తెలిపారు. గతేడాది వేర్వేరు ఎన్‌కౌంటర్లలో 219 మంది మావోయిస్టులు చనిపోగా, . ఈ ఏడాది ప్రారంభంలో 12 రోజుల వ్యవధిలో 12 మంది మావోయిస్టులను భద్రతాబలగాలు పొట్టనపెట్టుకున్నాయి. దండకారణ్యంలో భద్రతా దళాలకు, మావోయిస్టులకు మధ్య జరుగుతున్న ఈ వార్ అక్కడి గిరిజనుల్లో తీవ్ర భయాందోళనలు రేకెత్తిస్తున్నాయి.



### రిపబ్లిక్ డే ముఖ్య అతిథిగా సుబియాంటో

**న్యూఢిల్లీ:** ఈ నెల 26న జరిగే గణతంత్ర దినోత్సవ వేడుకలకు ముఖ్య అతిథిగా ఇండోనేషియా అధ్యక్షుడు ప్రబోవో సుబియాంటో హాజరయ్యే అవకాశం ఉన్నట్టు పలు మీడియా వర్గాలు వెల్లడిస్తున్నాయి. 73 ఏళ్ల మాజీ ఆర్మీ జనరల్ సుబియాంటో 2024 అక్టోబర్‌లో ఇండోనేషియా అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించారు. ఈ పర్యటనలో ఆయన ఇరుదేశాల సంబంధాలపై ప్రధాని మోడీతో విస్తృత చర్చలు జరిపే అవకాశం ఉన్నట్టు సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. దీనిపై అధికారిక ప్రకటన ఇంకా రావాల్సి ఉంది. గత ఏడాది ప్రబోవో ప్రధాని మోడీకి ఫోన్‌కాల్ చేసి.. ఇరుదేశాల మధ్య సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని బలోపేతం చేసే మార్గాలపై చర్చించారు. నవంబర్‌లో బ్రెజిల్‌లోని రియో డి జనిరోలో జరిగిన జీ20 శిఖరాగ్ర సదస్సులో ప్రబోవో ప్రధాని మోడీ, విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్ తో వాణిజ్యం, ఆరోగ్యం, భద్రత వంటి రంగాలలో సహకారంపై చర్చించారు.

# రైతు సంఘాలతో చర్చించండి

- దల్లేవాల్ ప్రాణాలను కాపాడాలి
- 26న దేశవ్యాప్తంగా ట్రాక్టర్స్ పరేడ్
- ఎస్‌కెఎం పిలుపు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ప్రజాస్వామ్యాన్ని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ గౌరవించాలని, రైతు సంఘాలతో వెంటనే చర్చలు జరపాలని డిమాండ్ చేస్తూ గణతంత్ర దినోత్సవం (జనవరి 26) నాడు దేశవ్యాప్తంగా రైతు ట్రాక్టర్, వాహన, మోటార్ సైకిల్ పరేడ్ నిర్వహించాలని సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కెఎం) పిలుపునిచ్చింది. ఈ మేరకు ఎస్‌కెఎం ఆదివారం ప్రకటన విడుదల చేసింది. "రైతు నాయకులు జగ్జిత్ సింగ్ దల్లేవాల్ ప్రాణాలను కాపాడాలి. రైతు వ్యతిరేక, సమాఖ్య వ్యతిరేక ఎన్‌పిఎఫ్ఎఎంను ఉపసంహరించుకోవాలి. సి2 ప్లస్ 50తో కూడిన కనీస మద్దతు ధరకు చట్టబద్ధమైన హామీ ఇవ్వాలి. విద్యుత్ ప్రైవేటీకరణ ఆపాలి. రైతులు, వ్యవసాయ కార్మికులకు రుణ విముక్తికై రుణమాఫీ కోసం సమగ్ర పథకం అమలు చేయాలి. స్మార్ట్ మీటర్లు రద్దు చేయాలి. 300 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందించాలి. భూ సేకరణ పరిహారం, పునరావాసం (ఎల్ఎఆర్ఆర్) చట్టం-2013ను అమలు చేయాలి" వంటి డిమాండ్లతో ఆ రోజు రైతు సంకల్ప కవాతు నిర్వహించనున్నట్లు తెలిపింది. అలాగే ఎస్‌కెఎం అన్ని రాష్ట్ర సమన్వయ కమిటీలు వెంటనే సమావేశమై వ్యవసాయ మార్కెటింగ్‌పై జాతీయ విధాన పత్రులను తగలబెట్టడంతో తీవ్ర నిరసన తెలియజేయాలని కోరింది.

రైతు నాయకులు జగ్జిత్ సింగ్ దల్లేవాల్ ప్రాణాలను కాపాడేందుకు సిద్ధపడని, రైతు సంఘాలతో చర్చలకు ఇష్టపడని ప్రధానమంత్రి నిరంకుశ వైఖరిని ఎస్‌కెఎం తీవ్రంగా ఖండించింది. దల్లేవాల్ ఆమరణ నిరాహార దీక్ష 46 రోజులు దాటినప్పటికీ, ఆయన ప్రాణాలను కాపాడటానికి సుప్రీంకోర్టు, రాష్ట్రపతి జోక్యం చేసుకోలేకపోయారని పేర్కొంది. రైతులకు కనీస మద్దతు ధర, కార్మికులకు కనీస వేతనం నిరాకరించడం, యువతకు ఉపాధిని నాశనం చేయడం ద్వారా వ్యవసాయం, పరిశ్రమలు, సేవలపై తమ ఆధిపత్యాన్ని ప్రదర్శించడానికి మోడీ ప్రభుత్వం తీవ్రంగా ప్రయత్నిస్తోందని, కార్పొరేట్ శక్తుల ముందు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ మోకరిల్లడమే దీనికి ప్రధాన కారణమని పేర్కొంది. రాజ్యాంగం ప్రాథమిక సూత్రాలలో ఒకటైన ఫెడరలిజాన్ని కూడా దెబ్బతీస్తున్నారని విమర్శించింది.





సభలో మాట్లాడుతున్న గజల్ శ్రీనివాస్

# పుస్తకాలే నిజమైన సంపద

- గజల్ శ్రీనివాస్
- ముగిసిన పుస్తక ప్రదర్శన

ప్రజాశక్తి- విజయవాడ అర్బన్

ప్రపంచంలో ఎన్ని సంపదలున్నా, మనిషికి నిజమైన విలువ మంచి పుస్తకం వల్లే వస్తుందని, పుస్తకం మనిషికి ఎప్పటికీ దూరం కాదని ప్రముఖ గాయకుడు గజల్ శ్రీనివాస్ అన్నారు. 35వ విజయవాడ పుస్తక మహోత్సవం ఆఖరి రోజు ఆదివారం రామోజీరావు సాహిత్య వేదికపై నిర్వహించిన ముగింపు సభలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. మానవత్వాన్ని, సర్వమానవ సౌభ్రాతృత్వాన్ని పెంపొందించేందుకు సాహిత్యం దోహదం చేస్తుందన్నారు. తెలుగు దేశం నాలెడ్జ్ సెంటర్ ఇన్‌ఛార్జి, పుస్తక ప్రేమికులు జి.మాల్యాద్రి మాట్లాడుతూ వ్యక్తులుగా ప్రపంచ స్థాయిలో రాణిస్తున్న తెలుగువారు, ఒక సమూహంగా దేశంలోనే వెనుకబడి ఉండడం విషాదకరమన్నారు. మనకు ప్రపంచంలోనే అగ్రస్థాయి మేధాశక్తి ఉందని తాజా జన్యుశాస్త్ర పరిశోధనలలో రుజువైందని వివరించారు. కుల, మత, రాజకీయ భేదాలు లేకుండా అందరూ ఐకమత్యంగా రాష్ట్రాభివృద్ధికి కృషి చేయాలని కోరారు. పుస్తక మహోత్సవ సంఘం అధ్యక్షులు కె.లక్ష్మయ్య మాట్లాడుతూ సమాజం అభివృద్ధి చెందాలంటే పాఠశాల స్థాయిలో గ్రంథాలయాలను, విద్యార్థులలో పుస్తకాలు చదివే అలవాటును పెంచాలన్నారు. విశ్రాంత ఐఎఎస్ అధికారి ఎండి ఇంతియాజ్ మాట్లాడుతూ పుస్తకాలు మనుషులకు మంచి స్నేహితులని పేర్కొన్నారు. భావాలను వ్యక్తీకరణకు, మంచి భావాలను మిగతా 7లో



### ట్రంప్ ప్రమాణ స్వీకారోత్సవానికి ఎస్ జైశంకర్

**వాషింగ్టన్:** అమెరికా అధ్యక్షుడిగా ఎన్నికైన డోనాల్డ్ ట్రంప్ ఈ నెల 20న పదవీ స్వీకార ప్రమాణం చేయనున్నారు. ఈ కార్యక్రమానికి భారత్ తరపున కేంద్ర మంత్రి ఎస్ జైశంకర్ హాజరుకానున్నట్టు విదేశాంగ శాఖ వెల్లడించింది. ఈ పర్యటనలో ఆర్థిక మంత్రి జైశంకర్ అమెరికా కొత్త పరిపాలనాధికారులతో పాటు వివిధ దేశాల అధినేతలతో చర్చల్లో పాల్గొనే అవకాశం ఉన్నట్టు పేర్కొంది. నవంబర్‌లో జరిగిన అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో డెమోక్రటిక్ అభ్యర్థి కమలా హారిస్‌ను రిపబ్లికన్ పార్టీ నేత డోనాల్డ్ ట్రంప్ ఓడించి.. ఘన విజయం సాధించారు. జనవరి 20న అమెరికా 47వ నూతన అధ్యక్షుడిగా అమెరికా క్యాపిటల్ భవనంలోని వెస్ట్ ఫ్రంట్ ప్రాంతం వేదికగా ప్రమాణస్వీకారం చేయనున్నారు. ప్రపంచ దేశాల అధినేతలు పెద్ద సంఖ్యలో హాజరుకానున్న ఈ కార్యక్రమానికి ప్రధాని నరేంద్ర మోడీ కాకుండా విదేశాంగ మంత్రి వెళ్తుండటం గమనార్హం.



# ఉత్సాహంగా పడవ పోటీలు

- సెమీస్‌కు ఆరు జట్ల అర్హత

ప్రజాశక్తి- ఆత్రేయపురం

డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయ పురంలోని గోదావరి మధ్య డెల్టా ప్రధాన కాలువలో కేరళ తరహా పడవ పోటీలు ఆదివారం ఉత్సాహంగా జరిగాయి. సంక్రాంతి సంబరాల నేపథ్యంలో 'సర్ ఆర్థర్ కాటన్ ట్రోఫీ' పేరుతో స్థానిక ఎంఎల్ఎ బండా రు సత్యానందరావు, రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఈత, రంగవల్లులు, పడవ పోటీలు నిర్వహిస్తున్నారు. రాష్ట్రంలోని తొమ్మిది జిల్లాలకు చెందిన 11 జట్లు ఈ పోటీల్లో తలపడుతున్నాయి. డ్రాగన్ పడవ పోటీలు, కయాకింగ్, కెనాయింగ్ విభాగాల్లో పోటీలు జరిగాయి. ఆరు జట్లు సెమీ ఫైనల్‌కు అర్హత సాధిం చాయి. సెమీఫైనల్స్ పోటీలు సోమవారం జరగనున్నాయి. ఈ పోటీలను తిలకించేందుకు ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాల నుంచే కాకుండా ఇతర జిల్లాల నుంచీ పెద్ద సంఖ్యలో సందర్శకులు వచ్చారు.

## రూ.14 వేల కోట్లతో సెమీ కండక్టర్స్ పరిశ్రమ

- మంత్రి నారా లోకేష్

**ప్రజాశక్తి-అమరావతి బ్యూరో**

ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన పాలసీలు, మౌలిక సదుపాయాల కల్పనతో కొత్త పరిశ్రమలను ఆకర్షించగలుగుతున్నామని ఐటిశాఖ మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. రూ.14 వేలకోట్ల పెట్టుబడితో మొదటి ప్రైవేట్ సెమీ కండక్టర్స్ తయారీ కేంద్రాన్ని రాష్ట్రంలో స్థాపించేందుకు ఇండిచిప్ సెమీ కండక్టర్స్ లిమిటెడ్... రాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకున్నట్లు ఆదివారం విడుదల చేసిన ప్రకటనలో వెల్లడించారు. ఈ ఒప్పందం రాష్ట్రాన్ని తయారీ రంగంలో అగ్రగామిగా నిలుపుతుందని పేర్కొన్నారు. ఈ పరిశ్రమ వల్ల స్థానికంగా యువతకు వేలాది ఉద్యోగాలు లభించడంతో పాటు నూతన ఆవిష్కరణలకు అవకాశం కలుగుతుందని, అనుబంధ పరిశ్రమల అభివృద్ధికి దోహదం చేస్తుందని చెప్పారు. ప్రభుత్వం కర్నూలులోని ఒర్వకల్లులో ఉన్న మెగా ఇండస్ట్రియ ల్ హబ్‌లో పరిశ్రమ ఏర్పాటుకు అవసరమైన భూమి, మౌలిక సదుపాయాలు కల్పించనుంద న్నారు. ఈ ఒప్పందం ప్రకారం.. కొత్త ప్లాంట్‌లో అత్యాధునిక ఫెసిలిటీ సిలికాన్ కార్బైడ్ (ఎస్ఐసి) చిప్స్ తయారీ చేపట్టనున్నట్లు తెలిపారు. ప్రారంభంలో నెలకు 10 వేల వాఫర్స్ ఉత్పత్తి సామర్థ్యంతో ప్రారంభమై తదుపరి 2 నుంచి 3 ఏళ్లలో 50 వేల వాఫర్స్ ఉత్పత్తి సామర్థ్యానికి పెంచుతారన్నారు. విద్యుత్ వాహనాలు, నూతన ఇంధన పరికరాలు, పునరుత్పాదక శక్తి పరికరాల గ్లోబల్ డిమాండ్ తీర్చనుందని చెప్పారు. పరిశ్రమలశాఖ మంత్రి టిజి భరత్, ఇండిచిప్ మేనేజింగ్ డైరెక్టర్ పీయూష్ బిచ్చోరియా, డైరెక్టర్ సందీప్ గార్గ్ ఇండిచిప్, తదితరులు ఒప్పంద కార్యక్రమంలో పాల్గొన్నారు.

# కత్తి కట్టిన కోడి

- యథేచ్ఛగా పందేలు
- పోలీసుల ప్రేక్షక పాత్ర



పిఠాపురం పట్టణంలో వైఎస్ఆర్ గార్డెన్స్‌లో ఏర్పాటు చేసిన కోడి పందేల బరి



బాపట్ల జిల్లా తూర్పుపాలెంలో నిర్వహిస్తున్న కోడి పందెం

**ప్రజాశక్తి- యంత్రాంగం**

సంక్రాంతి నేపథ్యంలో కోడికి కత్తి కట్టారు. బాపట్ల జిల్లా రేపల్లె నియోజకవర్గం చెరుకుపల్లి మండలం తూర్పుపాలెంలో ఆదివారం యథేచ్ఛగా కోడిపందేలు నిర్వహించారు. పోలీసులు ప్రేక్షక పాత్ర వహించారు. కోడి పందేలను నిర్వహించరాదని హైకోర్టు ఇచ్చిన ఆదేశాలు భేఖాతయ్యాయి. ఇక్కడ ఏర్పాటు చేసిన బరుల్లో జోరుగా పందేలు జరిగాయి. వరుసగా ఐదు పోటీల్లో గెలిచిన పందెం కోడి విజేతకు బైక్‌ను బహుమతిగా ఇచ్చారు. ఈ జిల్లాతోపాటు రాష్ట్రంలోని పలు జిల్లాల్లో సోమవారం నుంచి కోడి పందేల నిర్వహణకు పందెంరాయుళ్లు భారీ ఏర్పాటు చేశారు. పలు ప్రాంతాల్లో ప్రధాన రహదారుల పక్కన, పోలీస్ స్టేషన్లకు సమీపంలో కూడా ఇవి ఉన్నాయి. బాపట్ల నియోజకవర్గం మంతెనవారిపాలెం వద్ద బరులు సిద్ధం చేశారు. ఫ్లడ్ లైట్లు ఏర్పాటు చేసి రాత్రి సమయంలో కూడా పందేలు నిర్వహించడానికి విస్తృత ఏర్పాట్లు చేశారు. జూదరులు ఒప్పందాలు కూడా చేసుకుంటున్నారు. డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లాలో ఐ.పోలవరం, ముమ్మిడివరం, రాజోలు, సఖినేటిపల్లి, అమలాపురం రూరల్, పి.గన్నవరం, కొత్తపేట, రాయవరం, రామచంద్రపురం మండలాల్లో వందకుపైగా బరులను ఏర్పాటు చేశారు. వీటిలో కొన్ని భారీ బరులు ఉన్నాయి. తూర్పుగోదావరి జిల్లా నిడదవోలు, కొవ్వూరు, దేవరపల్లి, గోపాలపురం, నల్లజర్ల, సీతానగరం, రాజానగరం, కడియం మండలాల్లో బరులు సిద్ధమయ్యాయి. కోడి పందేల కోసం ఏలూరు జిల్లాలో దెందులూరు, కైకలూరు, ఉంగుటూరు తదితర నియోజకవర్గాల్లోని పలు ప్రాంతాల్లో భూమి చదును చేసి టెంట్లు ఏర్పాటు చేశారు. బహిరంగంగా ఏర్పాట్లు జరుగుతున్నా పోలీసులు ఇటువైపు కన్నెత్తి చూడకపోవడం విమర్శలకు తావిస్తోంది. పశ్చిమగోదావరి జిల్లాలో టిడిపి కూటమి పార్టీలలోని కొందరు కోడి పందేల బరుల కోసం పోటీ పడుతున్నారు. ఈ బరుల వల్ల భారీ ఆదాయం రానుండడంతో నాయకులను ప్రసన్నం చేసుకోవడానికి ప్రయత్నిస్తున్నట్లు సమాచారం. ముదినేపల్లి మండలంలోని పెదపాలపర్రు హైస్కూలు ఎదురుగా టిడిపి కూటమిలోని మూడు పార్టీల రంగులతో బరిని తీర్చిదిద్దారు. పామర్రు-దిగమర్రు ప్రధాన రహదారిలో బరిని ఏర్పాటు చేశారు. పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లు శివార్లలో పూలపల్లి బైపాస్‌లో పోలీస్ స్టేషన్‌కు కూతవేటు దూరంలో ఓ ప్రముఖ విద్యా సంస్థ పక్కన పందెంరాయుళు భారీ బరులు సిద్ధం చేశారు. ఆచంట నియోజకవర్గంలో నాలుగు మండలాల్లో సుమారు 20 చోట్ల కోడిపందేలను ఏర్పాటు చేశారు. ఉండి, భీమవరం, తణుకు, నరసాపురం ప్రాంతాల్లో పెద్ద ఎత్తున కోడి పందాలకు సిద్ధం చేశారు.

**డిప్యూటీ సిఎం నియోజకవర్గంలోనూ ఏర్పాట్లు**

డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ ప్రాతినిథ్యం వహిస్తున్న కాకినాడ జిల్లా పిఠాపురం నియోజకవర్గంలో 35 వరకు బరులను సిద్ధం చేశారు. వీటిలో 16 బరులు పిఠాపురం పట్టణ పరిధిలో ఉన్నాయి. పిఠాపురంలోని వైఎస్ఆర్ గార్డెన్స్‌లో వేదికపై మట్టిని వేసి బరిని ఏర్పాటు చేశారు.



కెవిపిఎస్ డైరీని ఆవిష్కరిస్తున్న వి. శ్రీనివాసరావు తదితరులు

## దళిత క్రైస్తవులు ఎస్‌సిలే..

- డిఎస్ఎంఎం జాతీయ నాయకులు వి శ్రీనివాసరావు

**ప్రజాశక్తి-అమరావతి బ్యూరో**

దళితుల్లో ఉప కులాలను గుర్తించేందుకు సచివాలయాల్లో ప్రదర్శించిన జాబితాలు తప్పులతడకగా ఉన్నాయని దళిత శోషణ్ ముక్తి మంచ్ (డిఎస్ఎంఎం) జాతీయ నాయకులు వి.శ్రీనివాసరావు పేర్కొన్నారు. క్రైస్తవుల పేరుతో దళితులను బిసిల్లో చేర్చడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు చెప్పారు. దళిత క్రైస్తవులను ఎస్‌సిలుగానే పరిగణించాలన్నారు. కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కెవిపిఎస్) 2025 డైరీని విజయవాడలోని బాలోత్సవ భవన్‌లో ఆ సంఘం ప్రధాన కార్యదర్శి అంద్ర మాల్యాద్రి, తదితరులతో కలిసి ఆయన ఆదివారం ఆవిష్కరించారు. అనంతరం శ్రీనివాసరావు మాట్లాడుతూ.. దళితుల సంఖ్యను తగ్గించాలనే ఆలోచనతోనే ప్రభుత్వం దళితులను బిసిలుగా చూపుతోందని అన్నారు. దీనివల్ల ఇప్పుడున్న రిజర్వేషన్లు కూడా దళితులకు అందకుండాపోయే ప్రమాదం ఉందన్నారు. అణగారిన కులాలను, మహిళలను అణచివేయడానికి మనుధర్మం, సనాతన ధర్మాలను పాలకులు తెరపైకి తెస్తున్నారని చెప్పారు. దేశంలో హిందూ మతోన్మాదం.. మైనార్టీలను, హిందువులను పట్టి పీడిస్తోందని విమర్శించారు. సనాతన ధర్మం పేరుతో అంటరానితనం, కులవివక్ష, అత్యాచారాలను పెంచి పోషించేందుకు కొన్ని శక్తులు ప్రయత్నిస్తున్నట్లు చెప్పారు. ఈ శక్తులే 'గడప లోపలే కులం.. గడపదాటితే హిందువులం' అంటూ హిందూ మత దురహంకారాన్ని రెచ్చగొట్టేందుకు ప్రయత్నిస్తున్నాయని విమర్శించారు. అంతేకాకుండా కులగణనను, రిజర్వేషన్లను వ్యతిరేకిస్తున్నారని, ప్రైవేటు రంగంలో రిజర్వేషన్లకు అడ్డుపడుతున్నారని చెప్పారు. కుల వ్యవస్థ నిర్మూలన అంటే సమధర్మం అని అంబేద్కర్, ఫూలే చెప్పిన విషయాన్ని కెవిపిఎస్ ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారు. ఒకవైపు సామాజిక న్యాయం కోసం పోరాడుతూనే, మరోవైపు సమధర్మంపై అవగాహన కల్పించాలని సూచించారు. అంద్ర మాల్యాద్రి మాట్లాడుతూ.. కుల వ్యవస్థను వ్యతిరేకించిన అంబేద్కర్ ఆశయాలకు విరుద్ధంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కుల వివక్షను పెంచి పోషించేందుకు ప్రయత్నం చేస్తున్నాయని తెలిపారు. దేశం, రాష్ట్రంలో దళితులపై దాడులు, అత్యాచారాలు కొనసాగుతున్నాయని చెప్పారు. వీటిని అరికట్టేందుకు పాలకులు చర్యలు తీసుకోవడం లేదన్నారు. ముద్దాయిలను కాపాడే ప్రయత్నాలే తప్ప, బాధితులకు రక్షణ కల్పించేందుకు పాలకులు చర్యలు తీసుకోవడం లేదన్నారు. అంబేద్కర్‌పై అవమానకర వ్యాఖ్యలు చేసిన కేంద్ర మంత్రి అమిత్ షాను మంత్రిమండలి నుంచి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ రాష్ట్ర నాయకులు జి నటరాజ్, జి క్రాంతికుమార్, చింతల శ్రీనివాస్, జి అరుణమ్మ, నగర నాయకులు శ్యామ్, కిరణ్, దళిత ఉద్యోగుల సంఘం రాష్ట్ర కోశాధికారి అధికారి, సామాజిక కార్యకర్త చౌకిడి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## నామినేటెడ్ పోస్టుల వర్గీకరణ

- రెండు కేటగిరీలుగా విభజన
- మూడో లిస్ట్ కోసం ఎదురుచూపులు

**ప్రజాశక్తి - అమరావతి బ్యూరో**

రాష్ట్రప్రభుత్వం కార్పొరేషన్ ఛైర్మన్లు, కార్పొరేషన్ డైరెక్టర్లు/ బోర్డులను రెండు కేటగిరీలుగా వర్గీకరించింది. కేటగిరీలుగా వర్గీకరణ చేయడం పట్ల పదవులు పొందిన నేతలు పెదవి విరుస్తున్నారు. యాదవ, పద్మశాలీ కార్పొరేషన్లను, రాజమండ్రి, అన్నమయ్య అర్బన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్లను ఎ కేటగిరిలో చేర్చారు. మిగిలిన కుల కార్పొరేషన్లు, అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీలను బి కేటగిరిలో చేర్చడం పట్ల పలు విమర్శలు వినవస్తున్నాయి. ఆర్‌టిసి జోన్ ఛైర్మన్లను కూడా ఎ కేటగిరి కింద ప్రభుత్వం చేర్చింది. ఈ మేరకు ప్రభుత్వం జిఓ ఎంఎస్ నెంబరు 8ని విడుదల చేసింది. కేటగిరి నామినేటెడ్ ఛైర్మన్‌కు నెలకు రూ.1.25 లక్షలుగా వేతనం నిర్ణయించారు. అలవెన్స్‌లు, సహాయ సిబ్బంది నియామకం, వారి జీతభత్యాలు మొత్తమ్మీద నెలకు రూ.2,77,500 డ్రా చేసుకునే అవకాశం ప్రభుత్వం కల్పించింది. 'బి' కేటగిరి ఛైర్మన్లు, బోర్డు ఛైర్మన్‌లకు నెలకు వేతనంగా రూ.60 వేలుగా నిర్ణయించారు. అలవెన్స్‌లు, సిబ్బంది జీత భత్యాలతో కలిపి మొత్తమ్మీద రూ.1,93,500 నెలకు డ్రా చేసే అవకాశం ఉంది. ఎ కేటగిరిగా పేర్కొన్న విభాగాల్లో డైరెక్టర్‌గా నియమించిన వారికి నెలకు రూ.20 వేలు వేతనంగా పేర్కొంది. బి కేటగిరి డైరెక్టర్లుగా ఎంత వేతనమనే విషయంపై ప్రభుత్వం స్పష్టతనివ్వాల్సి ఉంది. మూడో జాబితా ఎప్పుడు వెల్లడవుతుందా అనే ఆశతో నేతలు, తటస్తులు, మేధావులు ఎదురుచూస్తున్నారు. ఈ జాబితాలో కుల సంఘాలతో పాటు కీలకమైన ఆర్‌టిఐ ఛైర్మన్లు, ఎపిపిఎస్‌సి డైరెక్టర్లు, ప్రెస్ అకాడమీ, ఎస్‌విబిసి ఛానెల్ ఛైర్మన్, డిజిటల్ కార్పొరేషన్‌తోపాటు పలు కీలక విభాగాలకు సంబంధించిన ఛైర్మన్లకు చోటు దక్కవచ్చనే ప్రచారం జరుగుతోంది.

**ఎ కేటగిరి జాబితా కార్పొరేషన్/ బోర్డు**

20 సూత్రాల ఆర్థిక పథకం, ఎపిఎస్ఎంఇ, ఎపిఐఐసి, సివిల్ సప్లై కార్పొరేషన్, ఎపి మార్క్‌ఫెడ్, పద్మశాలీ వెల్ఫేర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, ఎపిస్టేట్ సీడ్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, ఎపి టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్, ఎపి అర్బన్ ఫైనాన్స్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, లెదర్ ఇండస్ట్రీస్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, సీడ్ ఎపి, శాప్, వక్ఫ్‌బోర్డు, ఎపి ట్రైకార్, ఎపిఎస్ఆర్‌టిసి, ఎపి మారిటైమ్ బోర్డు, ఎపి టిడ్కో, ఎపి హౌసింగ్ బోర్డు, ఎపి యాదవ వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, ఎపి కో-ఆపరేటివ్ ఆయిల్ సీడ్స్ గ్రోయర్స్ ఫెడరేషన్ లిమిటెడ్, ఎపి ఫారెస్ట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్, ఎపిఐడిసిఎల్, ఎపిఆర్‌డిసి, ఎపి స్టేట్ వేర్ హౌసింగ్ కార్పొరేషన్, ఎన్‌టిఆర్ వైద్యసేవ, స్వచ్ఛాంధ్ర ప్రదేశ్ మిషన్, అన్నమయ్య, రాజమండ్రి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీలు, తిరుమల తిరుపతి దేవస్థానం (టిటిడి), ఎపిఎస్ఆర్‌టిసి విజయనగరం, విజయవాడ, నెల్లూరు, కడప జోన్ రీజిన్ బోర్డు ఛైర్మన్లను ఎ కేటగిరిలో ప్రకటించారు.

**'బి' కేటగిరి జాబితా**

ఎపిటిపిసి, ఎపి శెట్టి బలిజ వెల్ఫేర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, ఎపి గవర వెల్ఫేర్ కార్పొరేషన్, ఎపి కళింగ వెల్ఫేర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, ఎపి కురుభ/కురుమ, వన్యకుల క్షత్రియ, ఎపి గౌడ వెల్ఫేర్ కార్పొరేషన్, ఎపి స్టేట్ బయో డైవర్సీ బోర్డు, ఎపి స్టేట్ ఫైబర్‌నెట్ లిమిటెడ్ (ఎపిఎస్ఎఫ్ఎల్), ఎపిటిఎస్ఎల్, ఎపి ఎన్విరాన్‌మెంట్ మేనేజ్‌మెంట్ కార్పొరేషన్, ఎపి ఖాదీ, ఇలేజ్ ఇండస్ట్రీస్ బోర్డు, ఎపి అగ్రికల్చరల్ మిషన్, ఆక్వాకల్చర్ డెవలప్‌మెంట్ అథారిటీ, ఎపి స్టేట్ బిల్డింగ్ అండ్ అదర్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ అడ్వైజరీ కమిటీ, ఎపిస్టేట్ ఆర్గానిక్ ప్రొడక్ట్స్ సర్టిఫికేషన్ అథారిటీ, ఎపి ఉమెన్ కో-ఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్, హ్యాండ్లూమ్ వీవర్స్ కో ఆపరేటివ్ సొసైటీ, అమలాపురం, బొబ్బిలి, బాపట్ల, చిత్తూరు, కర్నూలు, నెల్లూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీలు, ఎపి ఆర్యవైశ్య వెల్ఫేర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, ఎపి మాదిగ వెల్ఫేర్ కార్పొరేషన్, ఫైనాన్స్ కార్పొరేషన్ లిమిటెడ్, ఎపి గిరిజన కో ఆపరేటివ్ కార్పొరేషన్ లిమిటెడ్‌లు బి కేటగిరి జాబితాలో ప్రభుత్వం పేర్కొంది.


## ఇంటింటికీ పైప్‌లైన్ ద్వారా గ్యాస్

- ప్రారంభించిన సిఎం చంద్రబాబు నాయుడు

**ప్రజాశక్తి- తిరుపతి బ్యూరో, తిరుపతి సిటీ**

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదివారం తిరుపతిలో పర్యటించారు. తిరుచానూరులో ఇంటింటికీ పైప్‌లైన్ ద్వారా గ్యాస్ సరఫరా పథకాన్ని ప్రారంభించారు. అనంతరం ఓ వినియోగదారుడి ఇంట్లో గ్యాస్ స్టవ్ వెలగించి టీ పెట్టారు. అధికారులతో కలిసి ఆ ఇంట్లోనే టీ సేవించారు. అనంతరం వినియోగదారుడితో ముచ్చటించారు. ఈ సందర్భంగా పైప్‌లైన్ గ్యాస్, సిలిండర్ గ్యాస్ మధ్య తేడా గురించి వినియోగదారుడిని అడిగి తెలుసుకున్నారు. సిఎం వెంట జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్లు, చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని, జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు ఉన్నారు. తిరుపతిలో పలు కార్యక్రమాల్లో పాల్గొన్న అనంతరం చంద్రబాబునాయుడు తన స్వగ్రామమైన నారావారిపల్లెకు చేరుకున్నారు. కుటుంబ సభ్యులతో కలిసి అక్కడే సంక్రాంతి వేడుకల్లో పాల్గొంటారు. ఈ సందర్భంగా నారా వారిపల్లెలో ప్రజల నుంచి సిఎం అర్జీలు స్వీకరించారు. తొలుత తిరుపతి పర్యటన నిమిత్తం రేణిగుంట విమానాశ్రయానికి చేరుకున్న ముఖ్యమంత్రి చంద్రబాబుకు మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికారులు స్వాగతం పలికారు. అనంతరం ముఖ్యమంత్రి రేణిగుంట విమానాశ్రయం నుండి తిరుపతికి రోడ్డు మార్గాన చేరుకున్నారు.

## కీసర వద్ద కొనసాగిన వాహనాల రద్దీ





**ప్రజాశక్తి-డెస్క్ (విజయవాడ)**

సంక్రాంతికి సొంతూళ్లకు వెళ్లే ప్రయాణికులతో హైదరాబాద్-విజయవాడ 65వ జాతీయ రహదారిపై వాహనాల రద్దీ కొనసాగుతోంది. ఎన్‌టిఆర్ జిల్లా కంచికచర్ల మండలం కీసర టోల్ ప్లాజా వద్ద వాహనాలు క్యూ కట్టాయి. హైదరాబాద్ వైపు నుంచి వచ్చే వాహనాలతో టోల్‌గేట్ కిటకిటలాడుతోంది. వరుస సెలవుల నేపథ్యంలో వాహనాల తాకిడి ఆదివారమూ కొనసాగింది. ఫాస్టాగ్‌తో రెండు సెకన్లకో వాహనం చొప్పున క్లియర్ చేస్తున్నప్పటికీ రద్దీ తగ్గలేదు. నందిగామ వై జంక్షన్ వద్ద అండర్ పాస్ బ్రిడ్జి, సర్వీసు రోడ్డు నిర్మాణ దశలో ఉండడంతో ట్రాఫిక్ రద్దీ కీసర టోల్‌గేట్‌పై పడుతోంది. హైదరాబాద్ నుంచి సాధారణ రోజుల్లో 4 గంటల్లో చేరాల్సిన గమ్యం 5 నుంచి 6 గంటలు పడుతోందని వాహన చోదకులు చెబుతున్నారు. జగ్గయ్యపేట చిల్లకల్లు వద్ద రద్దీ కొనసాగుతోంది.

## గ్రీన్‌కో అక్రమాలు పవన్‌కు కనిపించలేదా..?

- రైతులను, గుమ్మితం తండా గిరిజనులను మోసం చేసిన కంపెనీ
- అక్రమాలపై ఆరా తీయాలి : కె.ప్రభాకర్ రెడ్డి





సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కె ప్రభాకర్ రెడ్డి

**ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్**

రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పర్యటన కేవలం గ్రీన్ కో కంపెనీ బాగోగులు చూడడానికే వచ్చినట్లుగా ఉందని, భూములు కోల్పోయిన రైతుల సమస్యలు పట్టించుకోవడానికి వచ్చినట్లుగా లేదని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె ప్రభాకర్ రెడ్డి విమర్శించారు. పిన్నాపురం రైతులకు, గుమ్మితం తండా గిరిజనులకు గ్రీన్‌కో కంపెనీ చేసిన మోసం, అక్రమాలు కనిపించలేదా? అని ప్రశ్నించారు. నంద్యాలలోని ఎన్‌జిఓ కాలనీలో ఉన్న టి.నర సింహయ్య భవన్‌లో సిపిఎం జిల్లా కమిటీ సమావేశం ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.నాగేశ్వరావు అధ్యక్షతన ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. ఉప ముఖ్యమంత్రి పర్యటన ఆద్యంతం గ్రీన్ కో కంపెనీ కోసమే అన్నట్లుగా సాగిందని, గ్రీన్ కో కంపెనీ నిర్మిస్తున్న విద్యుత్ ప్రాజెక్టులో భూములు కోల్పోయిన పిన్నాపురం రైతులు, గుమ్మితం తండా గిరిజనుల సమస్యలను గుర్తించకపోవడం బాధాకర మన్నారు. పవన్ కల్యాణ్ పర్యటన గ్రీన్ కో కంపెనీ కోసమా..? భూములు కోల్పోయిన రైతుల కోసమా..? అనేది ప్రశ్నగా మిగిలిందన్నారు. గ్రీన్ కో కంపెనీ 2.50 లక్షల కోట్లు పెట్టుబడి పెడుతోందని, ఇప్పటికే 12 వేల మందికి ఉద్యోగాలు ఇచ్చారని, మరో 50 వేల మందికి పరోక్షంగా ఉపాధి దొరుకుతుందని పవన్ కల్యాణ్ ప్రకటించారని, గ్రీన్ కో కంపెనీ ఉద్యోగాలు ఎవరికీ ఇచ్చిందో చెప్పాలని ప్రశ్నించారు. పిన్నాపురంలో 1,500 మంది జనాభా ఉంటే పట్టుమని 150 మందికి కూడా ఉద్యోగాలు ఇవ్వలేదన్నారు. గుమ్మితం తండాలో 500 జనాభా ఉంటే 70 మందికి కూడా ఉపాధి చూపలేదని తెలిపారు. కానీ పిన్నాపురం, గుమ్మితం తండా రైతులకు జీవనోపాధిగా ఉన్న దాదాపు మొత్తం భూములన్నింటినీ గ్రీన్ కో కంపెనీ విద్యుత్ ప్రాజెక్టు నిర్మాణానికి తీసుకున్నారని తెలిపారు. రైతులకు 2013 భూసేకరణ చట్టం ప్రకారం న్యాయంగా ఇవ్వాల్సిన పరిహారం, భూమి లేని పేదలకు పునరావాసం అమలు చేయలేదన్నారు. 2013 భూసేకరణ చట్టం అమలవుతుందా? లేదా? అని పరిశీలించే బాధ్యత పవన్ కల్యాణ్‌కు లేదా అని ప్రశ్నించారు. పవన్ కల్యాణ్ పర్యటనలో పిన్నాపురం, గుమ్మితం తండా ప్రజల సమస్యలను విస్మరించారని విమర్శించారు.

## హామీల అమలుకు 17న ధర్నా

- ఎపి రైతు సంఘం

**ప్రజాశక్తి-అమరావతి బ్యూరో**

రాష్ట్ర ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరుతూ ఈ నెల 17న విజయవాడలోని ధర్నా చౌక్‌లో ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఎపి రైతు సంఘం రాష్ట్ర కమిటీ పేర్కొంది. ఈ మేరకు సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు వి కృష్ణయ్య, కె ప్రభాకర్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. గతేడాది ఎన్నికల సందర్భంగా రైతులకు పెట్టుబడి సాయం రూ.20 వేలు ఇస్తామన్న హామీ ఏడాది గడుస్తున్నా హామీగానే మిగిలిపోయిందన్నారు. అందరికీ సంక్రాంతి వరాలు ఇస్తున్నామని, ఎన్నికల హామీలు అమలు చేస్తున్నామని సిఎం గొప్పగా చెబుతున్నారని, రైతులను ఇచ్చిన పెట్టుబడి సాయం హామీ ఆయనకు గుర్తులేదా? అని ప్రశ్నించారు. గుర్తున్నా రైతులకు ఇవ్వడం ఇష్టం లేక అమలు చేయడం లేదా? అనే విషయాన్ని స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. ఖరీఫ్ సీజన్‌లో కృష్ణా, గోదావరి డెల్టా ప్రాంతాల్లో తుపానులు, వరదలతో 6 లక్షల ఎకరాల్లో, రాయలసీమ ప్రాంతంలో కరువుతో 2 లక్షల ఎకరాల్లో పంటలు దెబ్బతిని రైతులు తీవ్రంగా నష్టపోయారని తెలిపారు. తుపాను, వరద ప్రాంతాల్లో రైతులకు పరిమితంగానైనా కొంత ఆర్థిక సాయం అందించారని, కరువుతో నష్టపోయిన రైతులకు ఇప్పటి వరకూ ఎలాంటి సాయం అందలేదని పేర్కొన్నారు. 2023-24లో ఖరీఫ్, రబీ సీజన్‌లో కరువుతో పంటలు దెబ్బతిన్న రైతులకు సాయం అందించలేదన్నారు. 2024 ఖరీఫ్ సీజన్‌లో తుపాను, వరదలు, కరువుతో నష్టపోయిన రైతాంగం మళ్ళీ, మళ్ళీ పెట్టుబడులు పెట్టి పండించిన వరి, పత్తి, ఉల్లి, టమోటా, మిర్చి వంటి పంటలకు మార్కెట్‌లో సరైన ధర లేక తీవ్ర ఆవేదన చెందుతున్నారని పేర్కొన్నారు.

## సాంకేతిక లోపంతోనే 4 వర్సిటీలకు వేతనాలు పెండింగ్

- ఉన్నత విద్యామండలి కార్యదర్శి టివిఎస్ కృష్ణమూర్తి

**ప్రజాశక్తి-అమరావతి బ్యూరో**

సాంకేతికపరమైన అంశాలు వల్ల నాలుగు యూనివర్సిటీల సిబ్బందికి వేతనాలు అందలేదని, మిగిలిన వాటికి అందాయని ఉన్నత విద్యామండలి కార్యదర్శి టివిఎస్ కృష్ణమూర్తి తెలిపారు. ఒకట్రెండు రోజుల్లోనే మిగిలిన యూవర్సిటీలకు వేతనాలు చెల్లిస్తామని ఆదివారం ఒక ప్రకటనలో వెల్లడించారు. జెఎన్‌టియు అనంతపురం, బిఆర్ అంబేద్కర్ ఓపెన్, బిఆర్ అంబేద్కర్ ఎయు యూనివర్సిటీలకు మాత్రమే సాంకేతిక పరమైన అంశాలు తలెత్తాయని పేర్కొన్నారు. యోగి వేమన, జెఎన్‌టియు కాకినాడ, నాగార్జున, ద్రవిడియన్ యూనివర్సిటీలకు శనివారమే చెల్లించామని తెలిపారు. నాణ్యమైన విద్యను అందించటం, నిధుల కొరత లేకుండా చూడటం, ఖాళీ పోస్టులను భర్తీ చేసే దిశగా ఉన్నత విద్యామండలి చర్యలు చేపడుతుందని వెల్లడించారు. విదేశీ విద్యార్థులను సైతం రాష్ట్రంలో ఉన్న యూనివర్సిటీలకు వచ్చేలా చూసి అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన విద్యను వారికి అందించటానికి తగిన కసరత్తు జరుగుతుందని తెలిపారు.

# 'సీమ'పై చిన్నచూపు తగదు

- ఎపిజిబి తరలింపు నిర్ణయం రాజకీయ దుర్మార్గం
- 'అన్నీ అమరావతికేనా?' సదస్సులో వక్తలు





మాట్లాడుతున్న పిసిసి మాజీ అధ్యక్షులు సాకే శైలజానాథ్

**ప్రజాశక్తి- కడప అర్బన్ (వైఎస్ఆర్ జిల్లా)**

రాయలసీమకు రావాల్సిన పరిశ్రమలు, సంస్థలు, ప్రాజెక్టులు ఇవ్వకుండా, ఇక్కడున్న సంస్థలను తరలించడం ఇక్కడి ప్రజలకు ప్రభుత్వం ద్రోహం చేస్తోందని, దీనిని సీమవాసులు సహించబోరని వక్తలు హెచ్చరించారు. 'అన్నీ అమరావతికేనా?' అనే అంశంపై రాయలసీమ అభివృద్ధి వేదిక ఆధ్వర్యంలో కడపలోని ఐఎంఎ హాలులో ఆదివారం సదస్సు జరిగింది. ఈ సదస్సుకు ముఖ్యఅతిథిగా హాజరైన పిసిసి మాజీ అధ్యక్షులు సాకే శైలజనాథ్, అధ్యక్షత వహించిన రాయలసీమ అభివృద్ధి వేదిక కన్వీనర్ డాక్టర్ సి ఓబుల్‌రెడ్డి మాట్లాడుతూ మంచి వ్యాపారం, సాంకేతిక సేవలు, లాభాలు, శాఖలు, కరెన్సీ చెస్ట్ సౌకర్యం వంటి వాటితోపాటు ఎపిజిబి ప్రధాన కార్యాలయాన్ని కడప నుంచి అమరావతికి తరలించాలనుకోవడం రాజకీయ దుర్మార్గమని పేర్కొన్నారు. దీనిపై మాజీ, ప్రస్తుత ప్రజాప్రతినిధులు అంతా ఎవరి స్థాయిలో వారు ప్రతిఘటించాలని కోరారు. లేకపోతే చరిత్రలో దోషులుగా మిగిలిపోతామని తెలిపారు. పాలకులకు వెనకబడిన ప్రాంతాల పట్ల వారి బాధ్యతలను గుర్తుచేసే ప్రయత్నం చేస్తున్న రాయలసీమ పౌర సమాజాన్ని అభినందించారు. ఎపిజిబి ప్రధాన కార్యాలయం అమరావతికి తరలించిన పక్షంలో ప్రజల్లో ఉన్న ఈ అభిప్రాయం మరింత బలపడుతుందన్న విషయాన్ని రాష్ట్ర ప్రభుత్వం, జిల్లాలోని ప్రజాప్రతినిధులు గుర్తించాలన్నారు. సంప్రదాయ రీత్యా చూసిన, కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం చూసిన ప్రస్తుత రాష్ట్రంలోని నాలుగు గ్రామీణ బ్యాంకుల విలీనం తరువాత నూతన రాష్ట్ర స్థాయిలో బ్యాంకు కడపలోనే ఉంచడం రాష్ట్ర ప్రభుత్వ బాధ్యతని వివరించారు. ఇప్పటికే ఎపిజిబికి విశాలమైన అధునాతన వసతులతో కూడిన సొంత భవనం ఉందన్నారు. టర్నోవర్‌లో, రిజర్వులలో, లాభాలలో శాఖల సంఖ్యలలో ఎపిజిబి మిగతా మూడు బ్యాంకుల కంటే చాలా మిన్నగా ఉందని తెలిపారు. జిల్లా ప్రజా ప్రతినిధులు చొరవ తీసుకొని రాష్ట్ర ప్రభుత్వంతో మాట్లాడి కడపలోనే ఎపిజిబి కొనసాగేలా చూడాలని కోరారు. ఎపి ఎస్‌సి, ఎస్‌టి లాయర్స్ ఫర్ సోషల్ జస్టిస్ రాష్ట్ర కన్వీనర్ వై జయరాజు మాట్లాడుతూ హైకోర్టు బదులు కర్నూలులో బెంచ్ పెడతామంటూ అదేదో ఉద్ధరిస్తున్నట్లు మాట్లాడుతున్నారని విమర్శించారు. సిపిఎం, సిపిఐ జిల్లా కార్యదర్శులు జి చంద్రశేఖర్, గాలి చంద్ర మాట్లాడుతూ ఎపిజిబి తరలింపుపై జరుగుతున్న అన్ని కార్యక్రమాలకు జిల్లా వ్యాప్తంగా తమ సంఘీభావం ఉంటుందన్నారు. సదస్సులో సేవ్ పబ్లిక్ సెక్టార్ కమిటీ కన్వీనర్ రఘునాథరెడ్డి, సిటిజన్స్ ఫోరం కన్వీనర్ లక్ష్మీ రాజా, ప్రైవేట్ కరస్పాండెంట్ అసోసియేషన్ నేత జోగిరామిరెడ్డి, టిఎంసి రామాంజనేయులు, మల్లెల భాస్కర్, వివిధ కార్మిక, రైతు, వ్యవసాయ కార్మిక, ఉపాధ్యాయ సంఘాల నాయకులు, న్యాయవాదులు, సామాజిక కార్యకర్తలు ప్రసంగించారు.

## ప్రభుత్వంలో ఉంటూనే విమర్శలా?

- గతంలో హోంమంత్రి, ఇప్పుడు టిటిడి ఛైర్మన్
- పవన్ తీరుపై టిడిపి నేతల ఆగ్రహం

**ప్రజాశక్తి-అమరావతి బ్యూరో**

ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్‌కల్యాణ్ తీరుపై టిడిపి నేతలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వంలో ఉండి మంత్రులు, ప్రభుత్వ అధికారులపై చేస్తున్న వ్యాఖ్యలు, ఇతర పార్టీల నుంచి వచ్చే వారి చేరికలపై టిడిపి నేతలు గుర్రుగా ఉన్నారు. పవన్‌కల్యాణ్ తీరు ఇలానే కొనసాగితే ప్రభుత్వానికి, పార్టీకి తీవ్ర నష్టం వస్తుందనే ఆందోళన టిడిపి నేతల్లో నెలకొంది. రాష్ట్రంలో శాంతి భద్రతల పరిరక్షణ సరిగ్గా లేదని, అవసరమైతే తానే హోంమంత్రి పదవిని చేపడతానని రెండు నెలల క్రితం చేసిన వ్యాఖ్యలు అప్పట్లో తీవ్ర చర్చనీయాంశంగా మారిన విషయం తెలిసిందే. పార్టీలో కష్టపడి పైకి వచ్చిన తనపై పవన్‌కల్యాణ్ చేసిన వ్యాఖ్యలు బాధగా అనిపించాయని హోంమంత్రి వంగలపూడి అనిత సహచర మంత్రులు, పార్టీ సీనియర్ నేతల వద్ద ఆవేదన వ్యక్తం చేసినట్లు తెలిసింది. దీంతో సర్దుబాటు చర్యలకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఉపక్రమించాల్సి వచ్చింది. తాజాగా తిరుమల తిరుపతి దేవస్థానం (టిటిడి)లో జరిగిన తొక్కిసలాట ఘటనకు టిటిడి ఛైర్మన్, ఇఒ, బోర్డు సభ్యులు క్షమాపణలు చెప్పాల్సిందేనని పవన్‌కల్యాణ్ చేసిన వ్యాఖ్యలపై టిడిపి నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రతిసారీ ప్రభుత్వాన్ని ఇబ్బందులు పెట్టే వ్యాఖ్యలు చేయడం ఏమిటని అంటున్నారు.

**చేరికలపై ఆగ్రహం**

గత ప్రభుత్వ హయాంలో టిడిపికి, జనసేనకు నష్టం చేసిన నేతలను జనసేన అధినేత చేర్చుకుంటున్నారనే అభిప్రాయం టిడిపి నేతల్లో ఉంది. టిడిపిలోకి చేరేందుకు అవకాశం లేని ఇతర పార్టీల నేతలను కూటమి పార్టీల్లో చేర్చుకునే ముందు సంప్రదించాలని నిర్ణయం తీసుకున్నారు. మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి, మాజీ ఎమ్మెల్యే సామినేని ఉదయభాను, మాజీ ఎమ్మెల్సీ జయమంగళం వెంకటరమణ వంటి వారిని పార్టీలోకి చేర్చుకున్నప్పుడు పవన్‌కల్యాణ్ ఎవరితోనూ చర్చించలేదనే అభిప్రాయం టిడిపిలో ఉంది. టిడిపి ముఖ్యనేత, మంత్రి నారా లోకేష్ ప్రాతినిధ్యం వహిస్తున్న మంగళగిరి నియోజకవర్గానికి చెందిన వైసిపి నేత గంజి చిరంజీవిని పవన్ తన పార్టీలో చేర్చుకున్నారు. 2014లో టిడిపి తరపున ఆ నియోజకవర్గం నుంచి పోటీ చేసిన గంజికి 2019లో టికెట్ ఇవ్వకుండా లోకేష్ పోటీ చేశారు. ఆ తరువాత గంజి వైసిపి గూటికి చేరి లోకేష్‌పైనే విమర్శలు చేశారు. లోకేష్‌పై విమర్శలు చేసిన వ్యక్తిని జనసేనలో ఎలా చేర్చుకుంటుందని టిడిపి నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తమ సహకారంతోనే ఎన్నికల్లో జనసేన 100 శాతం విజయం సాధించిందని, ఇప్పుడు ప్రభుత్వాన్ని అడ్డుపెట్టుకొని తమను దెబ్బతీసి, జనసేనను బలోపేతం చేసుకునే దిశగా పవన్‌కల్యాణ్ అడుగులు వేస్తున్నారనే ఆందోళన తెలుగు తమ్ముళ్లలో ఉంది.

## ఉక్కుపై కుట్రలను ఐక్య పోరాటాలతో తిప్పికొడతాం

- స్టీల్‌ప్లాంట్ ఎస్‌సి, ఎస్‌టి ఎంప్లాయీస్ అసోసియేషన్

**ప్రజాశక్తి - ఉక్కునగరం (విశాఖపట్నం)**

వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌పై కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ కుట్రలను ఐక్య పోరాటాలతో తిప్పికొడతామని స్టీల్‌ప్లాంట్ ఎస్‌సి, ఎస్‌టి ఎంప్లాయీస్ అసోసియేషన్ నాయకులు అన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యాన జరుగుతున్న రిలే నిరాహార దీక్షలు ఆదివారానికి 1431వ రోజుకు చేరాయి. ఈ దీక్షల్లో ఎస్‌సి, ఎస్‌టి ఎంప్లాయీస్ అసోసియేషన్ కార్యకర్తలు, ఉక్కు కార్మికులు కూర్చున్నారు. వారినుద్దేశించి నాయకులు బొండా తౌడన్న, బి.మల్లయ్య, ఎస్.సత్యనారాయణ మాట్లాడుతూ ఉక్కు కర్మాగారాన్ని నిర్వీర్యం చేసి కార్పొరేట్లకు కట్టబెట్టే కుట్రలు సాగుతున్నాయన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రజల సంపదని, దాన్ని అమ్మే హక్కు ఎవ్వరికీ లేదని తెలిపారు. ఆ విషయాన్ని గుర్తెరిగి ఇప్పటికైనా ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించి, తగిన ఆర్థిక వనరులు సమకూర్చాలని డిమాండ్ చేశారు. రాజ్యాంగ హక్కులను కాలరాయాలని చూస్తోన్న కేంద్ర ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు.




శ్రీవారి ఆలయ హుండీలో చోరీకి పాల్పడ్డ నిందితుడు పెంచలయ్య, బంగారు బిస్కెట్

## శ్రీవారి హుండీలో చోరీకి యత్నం

- నిందితుడు అరెస్టు

**ప్రజాశక్తి- తిరుమల:**

శ్రీవారి ఆలయ పరకామణిలో చోరీ జరిగింది. ఈ విషయం బయటపడిన గంటలోపే విజిలెన్స్ అధికారులు నిందితుడుని గుర్తించారు. ఇందుకు సంబంధించి టిటిడి అదనపు ఇఒ వెంకయ్య చౌదరి తెలిపిన వివరాల ప్రకారం.. పెంచలయ్య అనే బ్యాంకు కాంట్రాక్టు ఉద్యోగి పరకామణి మండపంలోని వంద గ్రాముల బంగారు బిస్కెట్‌ను దొంగిలించి వ్యర్థాలు బయటకు తీసుకెళ్లే ట్రాలీలో ఉంచారు. బయటకు వచ్చిన ట్రాలీలను టిటిడి విజిలెన్స్ అధికారులు తనిఖీలు చేశారు. ట్రాలీలను కిందకు వంచినప్పుడు బంగారు బిస్కెట్ బయటపడింది. సిసి కెమెరాలను విజిలెన్స్ అధికారులు పరిశీలించారు. ఈ బంగారు బిస్కెట్‌ను పెంచలయ్యా చోరీ చేసినట్లు గుర్తించారు. ఘటన జరిగిన గంట లోపల నిందితుడిని గుర్తించామని, నిరంతరం పరకామణి విజిలెన్స్ అధికారుల నిఘా నీడలో ఉంటుందని ఇఒ తెలిపారు. అనంతరం నిందితుడిని అరెస్టు చేసి బంగారు బిస్కెట్‌ను స్వాధీనం చేసుకున్నారు.

## దేశాభివృద్ధిలో యువతదే కీలక పాత్ర

- ఎమ్మెల్సీ అశోక్‌బాబు

**ప్రజాశక్తి - అమరావతి బ్యూరో**

దేశాభివృద్ధిలో యువత కీలకపాత్ర పోషించాలని టిడిపి ఎమ్మెల్సీ అశోక్‌బాబు పేర్కొన్నారు. రాష్ట్ర యువజన సర్వీసుల శాఖ ఆధ్వర్యాన విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఆదివారం నేషనల్ యూత్ డే కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా అశోక్‌బాబు మాట్లాడుతూ.. దేశంలో ఎంతో మంది ప్రముఖులు జన్మించారని, అందులో స్వామి వివేకానంద ఒకరని అన్నారు. అమెరికాలోని చికాగోలో స్వామి వివేకానంద చెప్పిన మాటలు ఎంతో మందికి ఆదర్శమన్నారు. రాష్ట్రంలో యువతకు ప్రభుత్వం ఎన్నో అవకాశాలు కల్పిస్తోందన్నారు. యువజన సర్వీసులశాఖ కమిషనరు కె శారదాదేవి మాట్లాడుతూ.. కోల్‌కతా నగరం స్వామి వివేకానందసహా ఎంతోమంది ప్రముఖులకు జన్మస్థలమని అన్నారు. ఈ కార్యక్రమంలో యువజన సర్వీసులశాఖ డిప్యూటీ డైరెక్టర్ ఎస్‌విడిఎస్ రామకృష్ణ, కృష్ణ, ఎన్‌టిఆర్ జిల్లాల సిఇఒ యు శ్రీనివాస్, ఏలూరు సిఇఒ ప్రభాకరరావు, వివిధ కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

# బల్క్ డ్రగ్ పార్కు రద్దు చేయాలి

- మత్స్యకారులు, ప్రజల నిరసన ప్రదర్శన
- పార్టీలకతీతంగా మద్దతు

**ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి, నక్కపల్లి విలేకరి**

అనకాపల్లి జిల్లా నక్కపల్లి మండలం రాజయ్యపేటలో బల్క్‌డ్రగ్ పార్క్‌ను వ్యతిరేకిస్తూ మత్స్యకారులు, ప్రజలు ఆదివారం ప్రదర్శన నిర్వహించారు. ఫ్లకార్డులు ప్రదర్శిస్తూ నిరసన తెలిపారు. బల్క్‌డ్రగ్ పార్క్‌ను ఏర్పాటు చేయొద్దని, ప్రభుత్వం మత్స్యకారులకు వెంటనే న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు మైలపల్లి మహేష్ అధ్యక్షతన జరిగిన సభలో ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం మాట్లాడుతూ.. బల్క్ డ్రగ్‌పార్క్‌ను రద్దు చేసే వరకూ పార్టీలకు అతీతంగా ఐక్యంగా పోరాడాలని కోరారు. కాలుష్యంతో సముద్రంలో చేపల వేటపై ఆధారపడి బతుకుతున్న సంప్రదాయ మత్స్యకారుల జీవనోపాధి దెబ్బతింటుందని ఆందోళన వ్యక్తం చేశారు. తన నియోజకవర్గంలో ఏ పరిశ్రమ వస్తుందో తనకు తెలియదని హోం శాఖ మంత్రి అనిత చెప్పడం బాధాకరమన్నారు. భూములిచ్చిన రైతులకు పరిహారం పూర్తిగా చెల్లించలేదని తెలిపారు. భూములు తీసుకోవడంతో ఉపాధి కోల్పోతున్న ప్రభావిత గ్రామాల కుటుంబాలకు రూ.25 లక్షలు చొప్పున ప్యాకేజీ ఇవ్వాలని డిమాండ్ చేశారు.



బల్క్ డ్రగ్‌పార్క్‌ను వ్యతిరేకిస్తూ రాజయ్యపేటలో ఫ్లకార్డులతో నిరసన ప్రదర్శన చేపట్టిన గ్రామస్తులు, నాయకులు

సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం.అప్పలరాజు మాట్లాడుతూ ప్రజలు ఐక్యంగా పోరాడితే బల్క్ డ్రగ్‌పార్క్‌ను అడ్డుకోవచ్చని తెలిపారు. రాజయ్యపేటలో ఫిషింగ్ జట్టి నిర్మాణ పనులు చేపట్టాలని కోరారు. జడ్‌పిటిసి సభ్యులు గోసల కాసులమ్మ, వైసిపి మండల అధ్యక్షులు శీరం నర్సింహమూర్తి మాట్లాడుతూ.. బల్క్‌డ్రగ్ పార్క్ వ్యతిరేక పోరాటంలో పాల్గొంటామని తెలిపారు. టిడిపి నాయకులు పిక్కి గంగరాజు, పిక్కి కోదండరావు, పిక్కి రాంబాబు, జనసేన నాయకులు పిక్కి స్వామి మాట్లాడుతూ.. టిడిపి కూటమి ప్రభుత్వ పార్టీల కంటే ప్రజలే తమకు ముఖ్యమని తెలిపారు. బల్క్‌డ్రగ్ పార్క్ వ్యతిరేక పోరాటంలో గ్రామ ప్రజలతో కలిసి పాల్గొంటామని చెప్పారు. కార్యక్రమంలో ఐద్వా జిల్లా కార్యదర్శి వరలక్ష్మి, సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఆర్.శంకరరావు, నక్కపల్లి మండల కార్యదర్శి రాజేష్, స్థానిక మత్స్యకారులు చొక్క కాశీ, జి స్వామి, పిక్కి పైడితల్లమ్మ తదితరులు పాల్గొన్నారు.




3కె రన్‌లో పాల్గొన్న యువత, డివైఎఫ్‌ఐ నాయకులు

## డ్రగ్స్‌ను నివారించాలి

- డివైఎఫ్‌ఐ ఆధ్వర్యాన 3కె రన్

**ప్రజాశక్తి-విజయనగరం టౌన్**

డ్రగ్స్ నిర్మూలించాలని, క్రీడా రంగాన్ని ప్రోత్సహించాలని కోరుతూ జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా డివైఎఫ్‌ఐ ఆధ్వర్యంలో ఆదివారం విజయనగరం జిల్లా కేంద్రంలో 3కె రన్ నిర్వహించారు. నగరంలోని రాజీవ్ స్టేడియం నుంచి ప్రారంభమైన రన్ గంట స్తంభం వరకు సాగింది. ఈ రన్‌ను వన్‌టౌన్ సిఐ శ్రీనివాసరావు ప్రారంభించి మాట్లాడుతూ.. ప్రస్తుతం సమాజాన్ని పట్టిపీడిస్తున్న అతిపెద్ద సమస్య డ్రగ్స్ అని అన్నారు. మత్తు పదార్థాలకు బానిసైన యువత, విద్యార్థులు తమ భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారని తెలిపారు. మాదక ద్రవ్యాల కట్టడికి, యువత చెడు మార్గం వైపు వెళ్లకుండా పోలీసులు తమవంతు ప్రయత్నం చేస్తున్నారని వెల్లడించారు. ఇందులో భాగంగా కళాశాలల్లో యాంటీ డ్రగ్ కమిటీలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. మత్తు పదార్థాల వాడకం వల్ల ఎదురయ్యే అనర్థాల గురించి సదస్సులు, సెమినార్ల ద్వారా అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. డివైఎఫ్‌ఐ జిల్లా కన్వీనర్ సిహెచ్ హరీష్ మాట్లాడుతూ కొందరు నిరుద్యోగులు ఉపాధి అవకాశాలు లేకుండా ఖాళీగా ఉండడం వల్ల మద్యానికి, గంజాయికి అలవాటు పడుతున్నార న్నారు. మద్యం మత్తుకు బానిసై దొంగతనాలు, దోపిడీలు, అత్యాచారాలు చేస్తున్నారని ఆందోళన వ్యక్తంచేశారు. డ్రగ్స్‌ను నిర్మూలించి, క్రీడలకు ప్రభుత్వం ప్రోత్సాహం ఇవ్వాలని, నిరుద్యోగులకు ఉపాధి కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ, డివైఎఫ్‌ఐ, సిఐటియు, జెవివి, యుటిఎఫ్ నాయకులు, న్యాయవాదులు పాల్గొన్నారు.



బాధితులకు చెక్కులను అందజేస్తున్న టిటిడి చైర్మన్ బిఆర్.నాయుడు

## బాధితులకు చెక్కులు అందజేత

- కోలుకున్న 28 మందికి శ్రీవారి దర్శనం

**ప్రజాశక్తి- తిరుమల:**

తిరుపతి వైకుంఠ ద్వార దర్శనాల కేంద్రాల వద్ద తొక్కిసలాట ఘటనలో గాయపడి కోలుకున్న మరో 28 మందికి టిటిడి అధికారులు వైకుంఠ ద్వార దర్శనం చేయించారు. శనివారం రాత్రి క్షతగాత్రులను టిటిడి చైర్మన్ బిఆర్ నాయుడు పరామర్శించి పరిహారం చెక్కులు అందజేశారు. ఆయన ఆదేశాల మేరకు అధికారులు గాయపడ్డ వారిని ఆదివారం ప్రోటోకాల్ బ్రేక్ దర్శనానికి అనుమతించారు. ప్రభుత్వం, టిటిడి బోర్డు, అధికారులు తమని చాలా జాగ్రత్తగా చూసుకున్నారని బాధిత యాత్రికులు తెలిపారు. మెరుగైన వైద్యం అందించి త్వరగా కోలుకునేలా చేసి వైకుంఠ ద్వార దర్శనాన్ని ప్రత్యేకంగా చేయించారని, పరిహారం అందించి, తిరిగి గమ్యస్థానాలకు చేరుకునే ఏర్పాట్లు చేసిన సిఎం, టిటిడి బోర్డు, అధికారులకు వారు ధన్యవాదాలు తెలిపారు.

# రామాయపట్నంలో భారీ భూబ్యాంక్..!

- ఇప్పటికే 9 వేల ఎకరాల భూసేకరణ
- మరో 10 వేల ఎకరాల సేకరణకు సిఎం ఆదేశాలు
- రూ.95 వేల కోట్లతో బిపిసిఎల్ ప్రాజెక్టు



శరవేగంగా నిర్మాణ పనులు జరుగుతున్న రామాయపట్నం పోర్టు

**ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి**

నెల్లూరు జిల్లా రామాయపట్నం పోర్టు సమీపంలో భారీగా భూ సేకరణకు ప్రభుత్వం ఆదేశాలిచ్చింది. ఇప్పటికే 9 వేల ఎకరాలు భూసేకరణ పూర్తి చేశారు. ఇటీవల సుమారు రూ.95 వేల కోట్ల పెట్టుబడితో 5 వేల ఎకరాల్లో బిపిసిఎల్ రిఫైనరీ అండ్ పెట్రో కెమికల్ కాంప్లెక్స్ ఏర్పాటుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అంగీకరించాయి. రామాయపట్నం పోర్టు పరిసర ప్రాంతాల్లో భారీ ప్రాజెక్టులు వస్తాయని ప్రభుత్వం భావిస్తోంది. సోలార్ ప్యానల్ ఫ్యాక్టరీకి ఐదు నుంచి ఆరు వేల ఎకరాలు వినియోగించనున్నారు. భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టుకొని మరో 10 వేల ఎకరాలు భూ సేకరణ చేయాలని అధికారులను సిఎం చంద్రబాబు నాయుడు ఆదేశాలు ఇచ్చినట్లు తెలిసింది. ఇప్పటికే భూమి సేకరించిన భూములకు పరిహారం ఇవ్వకపోవడం వల్ల రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సిఎం తాజా ఆదేశాలతో రామాయపట్నం పోర్టు పరిసర ప్రాంతాల రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

కృష్ణపట్నం పోర్టు, థర్మల్ ప్రాజెక్టులు, సెజ్‌ల పేరుతో నెల్లూరు జిల్లాలో భారీగా భూమిని సేకరించిన ప్రభుత్వం దానిని పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకోలేదు. ఇంకా అనేక చోట్ల భూమి బీడుగానే ఉంది. కృష్ణపట్నంలో ఎలాంటి అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టలేదు. ఎప్పటి నుంచో కావలి–ఒంగోలు మధ్య రామాయపట్నం వద్ద పోర్టు నిర్మాణం కోసం ప్రతిపాదనలు ఉన్నాయి. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో దీనికి శంకుస్థాపన చేశారు. 2020లో ఇక్కడ ఇండో సోలార్ కంపెనీ ఏర్పాటు కోసం 1800 ఎకరాలకు నోటిఫికేషన్ ఇచ్చి సుమారు 5 వేల ఎకరాలను రైతుల నుంచి బలవంతంగా లాకున్నారనే విమర్శలు ఉన్నాయి. రామాయపట్నం పోర్టుకు 850 ఎకరాలు, ఇండో సోలార్‌కు 5 వేల ఎకరాలు, బిపిసిఎల్‌కు 6 వేలు కావాల్సి ఉంది. ఇవి కాకుండా మరో 10 వేల ఎకరాలు స్వీకరించాలనే ఆలోచనలో ప్రభుత్వం ఉంది. ఇటీవల 6 వేల ఎకరాలకు నోటిఫికేషన్ విడుదల చేసింది.

రామాయపట్నానికి అందుబాటులో రైల్వే లైన్, దగదర్తి విమానాశ్రయం, 16వ నెంబర్ జాతీయ రహదారి ఉన్నాయి. వీటిని దృష్టిలో పెట్టుకొని చేవూరు, రావూరు, సాలిపేట, చెన్నాయపాళెం, రుద్రకోట, ఆవుల వారిపాళెం, మొండివారి పాళెం, కర్లపాళెం గ్రామాల్లో భూసేకరణ చేస్తున్నారు. మరో 10 వేల ఎకరాలు భూసేకరణ చేసి, సిద్ధంగా ఉంచుకోవాలని ఆదేశాలు జారీ చేసినట్లు సమాచారం. రామాయపట్నం, చాకచర్ల, తెట్టు గ్రామాల్లోనూ సేకరణ జరిగే అవకాశాలున్నట్లు తెలుస్తోంది. సుమారు 20 వేల ఎకరాలు ఈ ప్రాంతంలో భూమి సేకరిస్తారని తెలుస్తోంది.

**బిపిసిఎల్‌కు 6 వేల ఎకరాలు..!**

రామాయపట్నం పోర్టు వద్ద భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (బిపిసిఎల్) రిఫైనరీ అండ్ పెట్రో కెమికల్ కాంప్లెక్స్‌ను ఏర్పాటు చేయడానికి సిద్ధమైంది. పోర్టు సమీపంలో సుమారు 6 వేల ఎకరాల్లో రూ.95 వేల కోట్లతో దీనిని నిర్మాణం చేయనున్నారు. భూసేకరణ, ఇతర ఖర్చుల కోసం రూ.6100 కోట్లు ఇప్పటికే ఆ కంపెనీ కేటాయించినట్లు సమాచారం. దుబాయి, ఖత్తర్, ఇరాక్, ఇరాన్ దేశాల నుంచి రామాయపట్నం పోర్టుకు ఓడల ద్వారా క్రూడాయిల్ ఇక్కడకు తీసుకొస్తారు. దానిని శుద్ధి చేసే కేంద్రాన్ని ఇక్కడ ఏర్పాటు చేస్తున్నారు. ఇక్కడ నుంచి పైప్‌లైన్ ద్వారా ఇతర ప్రాంతాలకు తీసుకెళ్తారు. పెట్రోకెమికల్ ప్లాంట్, లూబ్రికెంట్ మ్యానుఫ్యాక్చరింగ్ ప్లాంట్, ఫ్యూయల్ అడిటివ్స్, వ్యాక్స్ ప్రొడక్షన్, ఆఫాల్ట్ ప్రొడక్షన్, సల్ఫర్ రికవరీ ప్లాంట్, కెటలిస్ట్ మానుఫ్యాక్చరింగ్, రిఫైనరీ మెయింటెనెన్స్ సర్వీస్, ఇన్‌స్ట్రుమెంటేషన్ అండ్ కంట్రోల్ సిస్టమ్స్, ఎన్విరాన్‌మెంటల్ సర్వీస్, ట్యాంక్ మానుఫ్యాక్చరింగ్, పైప్ మానుఫ్యాక్చరింగ్, వాల్వ్ మానుఫ్యాక్చరింగ్, ఇన్సులేషన్ అండ్ రిఫ్రాక్టరీ సర్వీస్, లాజిస్టిక్ అండ్ ట్రాన్స్‌పోర్టేషన్ వంటి 15 అనుబంధ పరిశ్రమలు ఏర్పడి లక్షలాది మందికి ఉపాధి వస్తుందని ప్రభుత్వం చెబుతోంది.

## 20 నుంచి సిఎం దావోస్ పర్యటన

**ప్రజాశక్తి - అమరావతి బ్యూరో**



స్విట్జర్లాండ్‌లోని దావోస్‌లో జరగనున్న ప్రపంచ వాణిజ్య సదస్సులో పాల్గొనేందుకు సిఎం చంద్రబాబు నాయుడు పర్యటన ఖరారైంది. ఈ నెల 20 నుంచి 24 వరకు సిఎం బృందం దావోస్‌లో పర్యటించనుంది. ఈ మేరకు ఆదివారం జిఓఆర్‌టి నెంబరు 70ను ప్రభుత్వం విడుదల చేసింది. సిఎం నేతృత్వంలోని రాష్ట్రప్రభుత్వ బృందంలో ఐటిశాఖ మంత్రి నారా లోకేష్, పరిశ్రమలశాఖ మంత్రి టిజి భరత్, ముఖ్యమంత్రి సెక్రటరీ కార్తికేయ మిశ్రా, చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ శ్రీనాథ్ బండారు, ఆర్థికశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ పీయూష్‌కుమార్, ఐఅండ్‌సి డిపార్టుమెంట్ సెక్రటరీ యువరాజ్, ఎపిఇడిబి సిఇఒ సిఎం సాయికాంత్ వర్మ, కాకినాడ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ డైరెక్టర్ వికాస్ ముర్మట్ ఉన్నారు.

## సిఎం చొరవతో పెట్టుబడులు

- డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్

**ప్రజాశక్తి - అమరావతి బ్యూరో**

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చొరవతో రాష్ట్రానికి కోట్లాది రూపాయల పెట్టుబడులు వస్తున్నాయని డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్ పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన ఆరు నెలల కాలంలోనే అభివృద్ధి చేసి చూపిస్తున్నామని తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆయన 'ఎక్స్'లో పోస్టు చేశారు. ఇప్పటికే రాజధాని అమరావతి, పోలవరం, పారిశ్రామిక వాడలు సహా అనేక ప్రాజెక్టులకు కేంద్ర ప్రభుత్వం పచ్చ జెండా ఊపిందన్నారు. వైసిపి ప్రభుత్వం ఐదేళ్ల పాలనలో చేసిన దాని కంటే ఎక్కువ అభివృద్ధి ఆరు నెలల పాలనలోనే చేసి చూపించామని అన్నారు. వైసిపి పాలనలో 1,800 కిలోమీటర్ల సిసి రోడ్లు నిర్మిస్తే, తాము ఆరు నెలల్లోనే 3,750 కిలోమీటర్లు సిసి రోడ్లు వేశామన్నారు. వైసిపి హయాంలో మినీ గోకులాలు 268 ఏర్పాటు చేస్తే, ఆరు నెలల్లోనే 22,500 నిర్మించినట్లు వెల్లడించారు. పివిటిజి ఆవాసాల కోసం వైసిపి రూ.91 కోట్లు ఖర్చు చేస్తే, తాము రూ.750 కోట్లు ఖర్చు చేసినట్లు పేర్కొన్నారు.



పులి సంచరించిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న అటవీ అధికారులు (ఇన్‌సెట్‌లో) రహదారిపై సంచరిస్తున్న పులి

## సప్పర్ల ఘాట్ రోడ్డులో పులి సంచారం

**ప్రజాశక్తి - సీలేరు (అల్లూరి జిల్లా)**

సప్పర్ల ఘాట్ రోడ్డు దిగువ ప్రాంతంలో బస్సు ప్రయాణికులకు పులి ఆదివారం ఉదయం కనిపించింది. దీంతో వారు ఒకింత భీతిల్లారు. ఎపిఎస్ ఆర్‌టిసి బస్సు దిగువ సీలేరు డొంక రాయిలో ఆదివారం తెల్లవారుజామున 4 గంటలకు బయలుదేరి సీలేరు మీదుగా పాడేరు వెళ్తోంది. మార్గమధ్యంలో సప్పర్ల ఘాట్ రోడ్డు దిగువ ప్రాంతంలో డ్రైవర్‌కు పులి కనిపించింది. అప్రమత్తమై బస్సు డ్రైవర్ నెమ్మదిగా నడుపుతూ హారన్ కొట్టారు. ఆ శబ్దం విన్న పులి ప్రధాన రహదారి సమీపం నుంచి కొండపైకి వెళ్లిపోయింది. దీంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. ఈ పులి ఎఒబి సరిహద్దు నుంచి వచ్చిందా? లేక తూర్పు గోదావరి – అల్లూరి జిల్లా సరిహద్దుల నుంచి వచ్చిందా? అనే విషయం తెలియాల్సి ఉంది. పులి సంచారం వీడియో వాట్సాప్‌లో వైరల్ కావడంతో సప్పర్ల, గాలికొండ, గుమ్మరేవులు పంచాయతీల పరిధిలోని మారుమూల గ్రామ గిరిజనులు భయాందోళనకు గురవుతున్నారు.

**అప్రమత్తంగా ఉండండి : ఫారెస్ట్ రేంజ్ అధికారి**

పులి సంచారం పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సీలేరు ఫారెస్ట్ రేంజ్ అధికారి ఎస్.వెంకట్రావు, డిఆర్‌ఒ సింహాచలం పడాల్ తెలిపారు. స్థానిక విలేకరులతో ఆదివారం వారు మాట్లాడుతూ పులి సంచార విషయం తెలియగానే ఆ ప్రాంతానికి వెళ్లి పరిశీలన జరిపామన్నారు. తూర్పుగోదావరి జిల్లా సరిహద్దు నుంచి పులి వచ్చినట్లు ప్రాథమికంగా అంచనాకు వచ్చామన్నారు. సప్పర్ల, గాలికొండ పరిసర గ్రామాల ప్రజలను అప్రమత్తం చేశామని తెలిపారు. ధారకొండ వారపు సంతలో విస్తృత ప్రచారం చేపట్టామన్నారు.

## నాన్ రెసిడెంట్స్ లెక్కల కోసం కసరత్తు


- 8 ప్రశ్నలతో సర్వే

**ప్రజాశక్తి - అమరావతి బ్యూరో**

స్థానికంగా లేని రాష్ట్రానికి చెందిన వ్యక్తుల వివరాలు సేకరించడానికి రాష్ట్రప్రభుత్వం కసరత్తు ప్రారంభించింది. ఇందులో భాగంగా రాష్ట్రం నుంచి విదేశాలకు వెళ్లిన వారితో పాటు, ఇతర రాష్ట్రాలకు వెళ్లిన వారి వివరాలు సేకరించే పనిని గ్రామ, వార్డు సచివాలయాల శాఖకు ప్రభుత్వం అప్పజెప్పింది. సర్వే ఎప్పటిలోగా పూర్తి చేయాలనే అంశంపై నిర్దిష్ట గడువు ప్రత్యేకంగా పేర్కొనకపోయినప్పటికీ వీలైనంత వేగంగా లెక్కలు తేల్చాలని ప్రభుత్వం తాజాగా ఆదేశించింది. సర్వే నమోదుకు సంబంధించి ఆ శాఖ ఉద్యోగులు జిఎస్‌డబ్ల్యుఎస్ ఎంప్లాయిస్ మొబైల్‌యాప్‌లో నమోదు చేస్తారు. సర్వే సందర్భంగా హౌస్ హోల్డ్ మ్యాపింగ్ బయోమెట్రిక్, లొకేషన్ ఈ సర్వేలో అవసరం లేదని ప్రభుత్వం స్పష్టం చేసింది. వారి మొబైల్ నెంబరు తప్పనిసరిగా సేకరించాల్సి ఉంటుంది. ఎన్‌ఆర్‌ఐ అయితే ఏ దేశంలో ఉన్నారు? ఆధార్ నెంబరు? పురుషుడా లేక స్త్రీయా? పాస్‌పోర్టు నెంబరు? మొబైల్ నెంబర్ (లోకల్), ఇ మెయిల్ ఐడి, వర్కింగ్ ఎక్స్‌పీరియన్స్ (సంవత్సరాలు). ఎటువంటి పనులు (నేచర్ ఆఫ్ వర్క్), ఏ దేశానికి వలస వెళ్లారు? ఫ్యామిలీ పర్సన్ మొబైల్ నెంబరు తప్పనిసరిగా నమోదు చేయాల్సి ఉంటుంది. ఇటీవల గ్రామ వార్డు సచివాలయాలశాఖ చేపట్టిన హౌస్ హోల్డ్ మ్యాపింగ్, జియో ట్యాగింగ్ సర్వే నేపథ్యంలో లక్షలాది మంది వివరాలు మిస్ అయ్యాయి, ఈ నేపథ్యంలో వారంతా ఇతర రాష్ట్రాలకు వలస వెళ్లారా? లేక ఇతర దేశాల్లో ఎన్‌ఆర్‌ఐగా ఉన్నారా? అన్న విషయాలు తేల్చేందుకు ఈ వివరాలు సేకరిస్తున్నట్లు చెబుతున్నారు.

# 24 నుండి స్ప్రింగ్ ఫెస్ట్

**కోల్‌కతా :** భారతీయ సాంకేతిక సంస్థ ఖరగ్‌పూర్ వారి వార్షిక సాంస్కృతిక, సామాజిక ఉత్సవం స్ప్రింగ్ ఫెస్ట్ ఈ నెల 24 నుంచి 26 వరకూ నిర్వహించేందుకు చురుగ్గా ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఆన్‌లైన్‌లో 20 లక్షలకుపైగా సభ్యుల చేరికతో ఈ స్ప్రింగ్ ఫెస్ట్ ఆసియాలో అత్యంత భారీ సాంస్కృతిక ఉత్సవాలలో ఒకటిగా విద్యార్థులతో నిర్వహించబడుతోందని కోర్ ఆర్గనైజింగ్ టీమ్ సభ్యులు ఆర్యన్ శ్రీవాస్తవ తెలిపారు. దేశంలోని 800కు పైగా ప్రధాన కాలేజీల నుండి ఉత్సాహవంతులైన విద్యార్థులు ఈ మూడురోజుల కార్యక్రమం కోసం ఖరగ్‌పూర్‌కు తరలివస్తారు. స్ప్రింగ్ ఫెస్ట్ 66వ ఎడిషన్ ఇప్పటికే 'హిచ్ హైక్' అనే దేశవ్యాప్త ప్రిలిమినరీ రౌండ్‌ను విజయవంతంగా నిర్వహించింది. ఇది నృత్యం, నాటకం, సంగీతం, ఫ్యాషన్ మొదలైన అనేక కళాత్మక కార్యక్రమాలను కలిగి ఉంది. ఈ ఉత్సాహభరిత ఈవెంట్ దేశంలోని 10 ప్రముఖ నగరాలు ఢిల్లీ, ముంబై, పూణె, బెంగళూరు, హైదరాబాద్, అహ్మదాబాద్, విశాఖపట్నం, లక్నో, జైపూర్, చండీగఢ్‌లో జరిగింది. ఈ ప్రిలిమ్స్‌కు తమ సమయాన్ని కేటాయించిన న్యాయమూర్తులకు స్ప్రింగ్ ఫెస్ట్ కతజ్ఞతలు తెలియజేసింది. ప్రిలిమ్స్ అనంతరం నృత్యం, నాటకం, సంగీతం, ఫ్యాషన్, సాహిత్య



పోటీలు తదితర అంశాలకు కోల్‌కతా, భువనేశ్వర్, పట్నా, రాంచీ, గౌహతి, రాయ్‌పూర్ నగరాల్లో ఎలిమినేషన్ రౌండ్లు నిర్వహించబడతాయి. ఈ పోటీల్లో పాల్గొనాలనే ఆసక్తి కలిగిన విద్యార్థులు లేదా సాంస్కృతిక అకాడమీలు eliminations.springfest.in వెబ్‌సైట్‌ను సందర్శించి, ముందుగానే ఇష్టమైన ఈవెంట్లకు నమోదు చేసుకోవచ్చునని శ్రీవాస్తవ పేర్కొన్నారు. ఇందులో ప్రత్యేకంగా, దేశవ్యాప్త రాక్ బ్యాండ్ పోటీ 'బ్యాటిల్ ఆఫ్ బ్యాండ్స్- వైల్డ్‌ఫైర్' గురించి తెలియజేశారు. ఇది ముంబయి, బెంగళూరు, ఢిల్లీ, కోల్‌కతా, షిల్లాంగ్ నగరాల్లో జరగనుంది. విజేతలకు రూ.1.5 లక్షలు బహుమతి ఇవ్వనుంది. తమ ప్రతిభను ప్రదర్శించి, స్ప్రింగ్ ఫెస్ట్ చరిత్రలో గుర్తింపు పొందాలనుకునే బ్యాండ్లు wildfire.springfest.in ద్వారా నమోదు చేసుకోవచ్చు. స్ప్రింగ్ ఫెస్ట్‌లో మొత్తం 13 విభాగాలకు చెందిన 130కిపైగా పోటీలు జరుగుతాయి. ఇందులో దేశంలోని అత్యుత్తమ ప్రతిభావంతులు పాల్గొంటారు. ఈ పోటీల మొత్తం బహుమతి విలువ రూ.35 లక్షలు.

## కాంట్రాక్ట్ లెక్చరర్స్ అసోసియేషన్ ఎన్నిక

**ప్రజాశక్తి-అమరావతి బ్యూరో**

ప్రభుత్వ జూనియర్ కళాశాలల కాంట్రాక్ట్ లెక్చరర్ల అసోసియేషన్ (475) రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా కుమ్మరికుంట సురేష్, గోర్ల మాణిక్యం ఎన్నికయ్యారు. ఉన్నత విద్య పరిరక్షణ సమితి అధ్యక్షులు రాజగోపాల్ బాబు, విద్యారంగ పరిరక్షణ సమితి రాష్ట్ర నాయకులు వి కృష్ణయ్య, రాష్ట్ర ప్రభుత్వ కాంట్రాక్ట్ అండ్ అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల జెఎసి చైర్మన్ ఎవి నాగేశ్వరరావు పర్యవేక్షణలో విజయవాడలోని యుటిఎఫ్ భవన్‌లో ఆదివారం ఈ ఎన్నిక జరిగింది. కాంట్రాక్ట్ లెక్చరర్స్ అసోసియేషన్ జాతీయ అధ్యక్షులు కొప్పిశెట్టి సురేష్ హాజరైన ఈ సమావేశంలో కోశాధికారిగా కె రత్నకుమారి, సభ్యులుగా పి ముద్దుబాబు (శ్రీకాకుళం), శ్యామ్‌కిరణ్ (పశ్చిమ గోదావరి), నాగేశ్వరరావు, శేషగిరి, రవిశంకర్ (కృష్ణా జిల్లా), బాలయ్య, సుధీర్, రాబర్ట్, రమేష్‌బాబు (గుంటూరు), జాన్‌బాబు, ఖాదర్‌వలీ (ప్రకాశం), కల్లూరు శ్రీనివాస్, కాశిరత్నం (నెల్లూరు), లత, ఓబయ్య, కృష్ణమూర్తి (చిత్తూరు), ఉమాదేవి (అనంతపురం) ఎన్నికయ్యారు. సంఘం నిర్మాణ, రెగ్యులరైజేషన్ తదితర అంశాలను చర్చించారు.

# పిపిపితోనే పథకాలన్నీ..

- అన్ని శాఖలకూ ప్రభుత్వం దిశా నిర్దేశం

**ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి**

అభివృద్ధి పథకాలన్నీ పిపిపి (పబ్లిక్ ప్రైవేటు భాగస్వామ్యం) విధానంలోనే అమలు చేసేందుకు రాష్ట్రప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. దీనికోసం అన్ని శాఖలకూ దిశా నిర్దేశం చేస్తోంది. గతంలోనూ పిపిపి విధానం అమలులో ఉన్నప్పటికీ ఇప్పుడు మాత్రం ఎక్కువగా ఈ విధానంతోనే ముందుకెళ్లాలని నిర్ణయించింది. గతంలో పరిశ్రమల ఏర్పాటులో మాత్రమే కనిపించిన పిపిపి విధానం ఇప్పుడు విద్య, వైద్యం, తాగునీరు వంటి అత్యవసర రంగాలకు కూడా విస్తరించాలని యోచిస్తోంది. వచ్చే ఆర్థిక సంవత్సరం నుంచి పిపిపి విధానాన్ని విస్తృతం చేసేందుకు ప్రభుత్వం కసరత్తు ప్రారంభించింది. ఏప్రిల్ 1 నుంచి ప్రారంభమయ్యే కొత్త ఆర్థిక సంవత్సరంలో ఈ విధానానికి శ్రీకారం చుట్టాలని నిర్ణయించినట్లు తెలిసింది. అన్ని శాఖలు తమ పరిధిలోని అభివృద్ధి కార్యక్రమాలు, పనులపై ప్రతిపాదనలు కూడా సిద్ధం చేయాలని దిశానిర్దేశం చేసినట్లు తెలిసింది. సాధారణంగా పరిశ్రమలు ఏర్పాటు చేసేందుకు ముందుకు వచ్చే వారికి ప్రభుత్వం తరపున భూమి ఇవ్వడం, అవసరమైన నీరు, రోడ్ల అనుసంధానం వంటి చర్యలు తీసుకుంటోంది. ఆ తరువాత ఆయా సంస్థలు పరిశ్రమల స్థాపనకు చర్యలు తీసుకుంటాయి. దీనినే పిపిపి విధానంగా చెబుతుంటారు. కొన్ని పరిశ్రమల్లో ప్రభుత్వం కూడా తన వాటా నిధులను పెడుతుంది. తద్వారా వీటిని కూడా పిపిపి విధానంగానే పరిగణిస్తారు. కొత్తగా మాత్రం అత్యంత కీలక రంగాల్లో కూడా ఇదే విధానాన్ని అమలు చేయాలని నిర్ణయించడంతో ఆయా రంగాలు పూర్తిగా ప్రైవేటు చేతుల్లోకి వెళ్లిపోయే పరిస్థితి ఉంటుందన్న విమర్శలు వస్తున్నాయి. తాజాగా చేస్తున్న ఆలోచనలో విద్య, వైద్యం, తాగునీరు, గృహ నిర్మాణం, రవాణా అనుసంధానం వంటివి కూడా పిపిపి విధానంలోకి తీసుకురానున్నారు. ఆయా రంగాలకు చేసే ఆర్థికసాయం విషయంలో పిపిపి విధానానికి ప్రాధాన్యత ఇచ్చేలా ఉండాలని అన్ని శాఖలకూ ప్రభుత్వం స్పష్టం చేస్తోంది. కాగా, బడ్జెట్ ప్రతిపాదనల్లో రాష్ట్ర అభివృద్ధి ప్రాజెక్టులు, ఎక్స్‌టర్నల్లీ ఎయిడెడ్ ప్రాజెక్టులు, హడ్కో, నాబార్డ్ ఆర్థికసాయంతో అమలుచేసే పథకాలపైనా సూచనలు చేస్తూ అవకాశం ఉన్నంత వరకు పిపిపి విధానాన్ని అమలు చేయాలని నిర్దేశించడం గమనార్హం.

అక్షరం
ప్రజాశక్తి
www.prajasakti.com
facebook/prajasakti, twitter/prajasakti
4 | విజయవాడ
సోమవారం 13 జనవరి 2025



పాత ప్రపంచం మృత్యువాత
పడుతోంది. నూత్న ప్రపంచోదయం
పురిటి నొప్పులు పడుతోంది. రక్కసి
మూకల అదను ఇది.
– ఆంటోనియో గ్రాంసీ



## ఎర్ర కలువలు

**మేం** మనుషులం
భిన్న మత భావోద్వేగాల
సరోవరంలో మొలిచిన
నమ్మకాల తామరాకుల మీది
నీటి బిందువులం!
వినోదాల్లో విషాదాల్లో మతాలకతీతంగా
వండింది పంచుకొని, కలిగింది ఇచ్చుకొని
పుచ్చపువ్వుల్లాంటి నవ్వులమై
అలాయ్ బలాయ్ ఆడుకునే
ఆత్మ బంధువులం!

బతుకు పోరాటపు చెమట చిత్తడిలో
నిత్యం తలంటు పోసుకొని
ఒకరి తుండుగుడ్డతో
ఇంకొకరం తుడుచుకునే శ్రామికులం!

వానొస్తే వరదొస్తే
కొంపా గూడూ దుంపనాశనమైతే
ఒకరినొకరం ఓదార్చుకొని
వండిన కలో గెంజో కలిసి పంచుకుని
ఒడ్డున పడే వారంటీ లేని ఓటి పడవలం!

నువ్వు మాలో మాకు పుల్లలు పెట్టి
మా కళ్లను మా వేళ్ళతోనే పొడిపిస్తుంటే
అభద్రతతో అల్లాడే అత్తిపత్తులమౌతున్నాం!
నువ్వు ధరలు పెంచి పన్నులు గుంజి
దేశ సంపదనంతా నీ దోస్తుల ఖాతాలో వేస్తోంటే
వేటకుక్కలు కసిగా పీక్కుతిన్న
పసికందుల మౌతున్నాం!
కలిసి పోరాడలేని, నిలిచి ప్రశ్నించలేని
పిరికి పందలమౌతున్నాం!

కానీ, కాలం ఎప్పటికీ
నీ గులామ్ గానే వుంటుందనుకోకు!
అది నీ వొక్కడికే ఎల్లవేళలా
సలామ్ కొడుతుందని వూహించకు!
చూడు..
నూటయాభై కోట్ల బిందువులతో నిండిన
ఈ సుందర సరోవరంలో
ఎలుగెత్తే చైతన్యం వెల్లువలా లేస్తుంది
ఎర్రని కలువలు పూసే మంచి కాలం
తప్పక నీ అంతు తేలుస్తుంది!

– పతివాడ నాస్తిక్
94417 24167

## మౌఢ్యం

**అ**క్షరాలు దిద్దించిన చేతులను
కాళ్ళు మొక్కమంది విద్యార్థి పైత్యం
అబద్ధం చక్కర్లు కొట్టింది
సోషల్ మీడియా వెర్రి తలలేసి
ఉపాధ్యాయుడిని దోషిని చేసింది!
సనాతనం మూర్ఖత్వమై ఉరిమింది
అక్షరాలను నేర్పిన గురువునే మోకరిల్లమంది!

ఉపాధ్యాయుడంటే
రెండు చేతులు జోడించమని చెప్పడు
ప్రశ్నను ఆశిస్తాడు జవాబు చెబుతాడు
అదే సమాజాన్ని ప్రశ్నించమంటాడు
జవాబులో హేతువును చూడమంటాడు!

ఆధునికత ఏమాత్రమూ ఎరుగని సంత
ఎగేసుకుని తిరుగుతోంది
ఆంబోతులల్లే రంకెలేస్తోంది
ఛాందసుల ఏలుబడిలో సర్వం ఉన్మాదం
జ్ఞానం మేల్కొనేదాకా చీకటిదే విహారం!

– గిరి ప్రసాద్ చెలమల్లు
94933 88201


## మరణ మృదంగాలు

**ది**వా రాత్రాలు కరిగిపోతున్నాయి
చావు మోతల మధ్య
ఎవరూ ఎవర్నీ పట్టించుకోరు
చివరికి తమని తాము కూడా
మనిషి ఒకప్పుడు చైతన్య దీపం
ఇప్పుడొక ఏకాంత ద్వీపం
యుద్ధం కళాత్మక శవాల దిబ్బలు రూపొందిస్తుంది
విమానాలు కూలి పర్యాటకుల్ని
అగ్నిస్నానం చేయిస్తున్నాయి
ప్రపంచ యవ్వనాల్ని మోసుకెళ్తున్న
రహదారులు రక్తసిక్త మౌతున్నాయి
దారితప్పిన క్రమశిక్షణ రాహిత్యం
తొక్కిసలాటల్లో మరణ శిక్ష వేస్తుంది
అమ్మగోరు ముద్దలు నోచుకోని
హాస్టల్ పిల్లలు కలుషిత ఆహారంతో
లేత బతుకులకు చరమగీతం పాడుతారు
ఆయుధంగా పోరాటం చేయాల్సినవాడు
అకాల మృత్యువాత పడుతున్నాడు
క్షణం క్రితం చలనమున్న హృదయ కవాటాలు
భళ్లున మూసుకుపోతున్నాయి
నిర్భయంగా నడవాల్సిన స్త్రీలు
అత్యాచార హత్యలుగా మిగుల్తారు
ప్రతి వేకువ వార్తాపత్రికల్లో
దినవారి మరణాల సంఖ్య ప్రకటిస్తుంది
అంతటా దుఃఖం నింపుకున్న ముఖాలే

అయినా శాంతికోసం ఒకడు
పాడుతూనే వుంటాడు
సామూహిక మారణకాండకు
మరొకడు కొత్త ఉన్మాదం రేపుతాడు
ప్రపంచమంతా మానవ కంకాళాల
నిర్జీవ నిర్మాణాలే వాడి లక్ష్యం
మతం పేర మరో ఉన్మాద మారణహోమమూ
ఉగ్రపూరిత జీవన దహనమూ
ఏ దేశమేగినా ఏముందిలే
రక్తం కడిగిన వాసనలే
ఏ ఖండం ప్రణాళికయినా
నెత్తుటేరులు పారించడమే
దోసిళ్లతో తోడిపోసే గర్భస్రావాలు
దహనమై పోతున్న స్వప్న చారికలు
బతుకు కిటికీ నుంచి చూస్తే
ప్రపంచమొక పద్మవ్యూహం
విశ్వవ్యాప్తిగా మోగుతున్న మరణ మృదంగం
పచ్చటి చెట్టు నుంచి తుంచి
సముద్రం మీద పూలు చల్లడమెందుకు?
మనుషులు ప్రేమతో వాటిని పంచుకున్నప్పుడే కదా
గాయలేపనమై
స్నేహ దౌత్యాలు వెల్లి విరిసేది
విశ్వ సౌభ్రాతృత్వం పెల్లుబికేది!

– డాక్టర్ పెరుగు రామకృష్ణ

# ఎరుకల వెతలపై తొలి కథాసంపుటి




పుస్తకం

**శ**తాబ్ద కాలం దాటినా తెలుగు కథా సాహిత్యంలో చాలా వెలితులు కనిపిస్తూనే ఉన్నాయి. తెలుగు నేల మీద జీవనం సాగిస్తున్న 34 ఆదివాసీ తెగలను ప్రభుత్వం అధికారికంగా గుర్తించింది. ఇవి రోజురోజుకు తమ ఉనికిని కోల్పోతున్నాయి. గిరిజనులను అడవుల నుంచి గెంటివేసి ఆ నేల కింద ఉన్న విలువైన ఖనిజ సంపదలను బహుళ జాతి కంపెనీలు ఆక్రమించుకుంటున్నాయి. ఇదంతా 'అభివృద్ధి' ముసుగులో జరుగుతున్న అరాచకం. ఇలాంటి పరిస్థితిలో నలిగిపోతున్న ఆదివాసుల జీవితాలను కథలుగా మలచిన రచయితలు లేకపోలేదు. అయితే, అవి చాలా తక్కువ. కొన్ని వృత్తి జీవితాలైతే కథాసాహిత్యంలోకి రాలేదు. ఆ వెలితిని పూడుస్తూ, ఎరుకుల జీవితాలపై పలమనేరు బాలాజీ ఒక కథాసంపుటిని తీసుకొచ్చారు.

నిరంతర అభద్రతా భావంతో జీవనం చేస్తున్న సంచార తెగల్లో ఎరుకల ఒకటి. వారు శాశ్వత నివాసం, ఆధార్, ఓటరు కార్డులు, జనన మరణ ధవీకరణ పత్రాలు, ఉపాధి కార్డులు పొందటమే పెద్ద సమస్యగా మారిపోతోంది. వాటి కోసం వారు నిరంతరం పాలకవర్గాలతో ఘర్షణ పడుతూనే ఉన్నారు. అలాంటి ఎరుకల తెగ నుంచి వచ్చిన రచయిత బాలాజీ. ఊరుపేరును ఇంటి పేరుగా చేసుకొని పలమనేరు బాలాజీ పేరుతో తన సాహిత్య ప్రస్థానం సాగిస్తున్నారు. చిన్నప్పటి నుంచి చూసిన జీవితాలనూ, అనుభవించిన దుఃఖాలనూ, బాధలనూ, ఆకాంక్షలనూ, ఆరాటాలనూ, పోరాటాలనూ కథలుగా మలిచారు. తెలుగు సాహిత్యంలోనే తొలి ఎరుకల కథా సంపుటి 'ఏకలవ్య కాలనీ ఎరుకల జీవన గాథలు'ను వెలువరించారు. ఈ సంపుటిలోని 18 కథల్లో భిన్న పార్శ్వాలు కనిపిస్తాయి. ఆత్మగౌరవం కోసం, అస్తిత్వం కోసం పోరాడే పాత్రలు కనిపిస్తాయి.

ఎన్నో మలుపులు, ఎన్నో చిత్రవిచిత్రాలు, మరెన్నో విషాదాలూ.. ఈ కథల నిండా కనిపిస్తాయి. "పదకొండు నెలల జీతగాడి కథ"లో రచయిత తండ్రి అటవీశాఖలో గార్డు. "అటవీశాఖ ఉద్యోగి కుటుంబమే అయినా, మేం సిగ్గుపడకుండా కట్టెలు కొనేవాళ్ళం. మేము కట్టెలు కొనటాన్ని డిపార్టుమెంటులో మా నాయన ముందే చాలామంది ఎగతాళి చేసేవారు". ఇది ఎరుకల తెగలో ఉన్న నిజాయితీకి గుర్తుగా కనిపిస్తుంది. తన తండ్రి కట్టిన పాత పెంకుటిల్లు స్థానంలో కొత్త ఇల్లు కట్టేటప్పుడు, ఆ పాత ఇంటి తలుపులు, కిటికీలు, పెంకులు అమ్మిన డబ్బుతోనే కొత్త ఇంటికి పునాది నిర్మించారు. "ఇంటికి పునాదులు పైకి ఎప్పుడూ ఎవరికీ కనబడవు కానీ అవి చాలా బలంగా ఉంటాయి. అవి బలంగా ఉంటాయి కాబట్టే మనం ఎదుగుతాం" అని రచయిత తన తల్లిదండ్రుల పట్ల చూపించిన ప్రేమ, ఆప్యాయత ఈ కథలో కనిపిస్తుంది. "బలవంతంగా నా చేత యాపిల్ తినిపించిన నాన్నా... నువ్వెప్పుడైనా ఒక్క పండైనా తిన్నావా తండ్రీ" అన్న చివరి వాక్యం కథకు మరింత పుష్టిని చేకూర్చింది. 'ఎరికిలోల్లకి వూరి మధ్యలో, అదీ గవర్నమెంట్ కాలేజీకి వెళ్ళే రోడ్డులో స్థలం కేటాయించడమే గొప్ప అని, ముందు ముందు ఆ స్థలానికి విలువ పెరుగుతుందని' ఆ స్థలంలో ఇళ్లు నిర్మించుకోవడానికి పడిన కష్టం, ఆ తరువాత ఏకలవ్య కాలనీగా ఎలా పరిణామం చెందిందో ఈ కథల్లో చూడవచ్చు. ఎక్కడెక్కడో విసిరేసినట్లు వుండే వాళ్ళు, రకరకాల పనులు చేసే వాళ్ళు, అడవిలో కట్టెలు తెచ్చి అమ్ముకునే వాళ్ళు, తేనె, మూలికలు, ఆకుపసర్లు అమ్ముకునే వాళ్ళు, పందులు, బాతులు మేపే వాళ్ళు, వెదురుపని చేసే వాళ్ళు, యెర్రమన్ను, ముగ్గుపిండి అమ్మేవాళ్ళు ... ఇట్లా రకరకాలుగా జీవనం సాగించే మనుషులంతా ఒక చోట చేరి నిర్మించుకున్నదే ఏకలవ్య కాలనీ.

ఒకప్పటి ఉమ్మడి గుంటూరు జిల్లాను, ప్రకాశం జిల్లాను వేరే చేసే ఊరు స్టువర్టుపురం. ఎక్కడ దొంగతనాలు జరిగినా ముందు ఎరుకల వాడినే అనుమానించి పోలీసులు లాక్కెళ్లేవారు. వారిపైన తప్పుడు కేసులు మోపి బాగా కొట్టేవారు. ఆ స్టువర్టుపురం అనే ఊరు మీ కోసమే పుట్టిందంట అని అవమానించేవారు. "అయ్యా ఎప్పుడో ఎక్కడో ఏదో జరిగిందని మొత్తం కులాన్ని తప్పు పడితే యెట్లా. గతాన్ని సాకుగా చూపి మొత్తం మా కులాన్నే తక్కువ చేసి మాట్లాడటం మంచిది కాదు." అంటూ ఆవేదన చెందిన దయనీయ స్థితిని 'మా తప్పు ఏంది సామి?' కథలో చూపించారు రచయిత. "నమ్మినోల్లకి ప్రాణం అయినా ఇస్తారు కానీ, ఎరికిలోల్లు ఎవురికీ నమ్మకద్రోహం చెయ్యరు. ఏరికిలోల్ల ఇండ్లల్లో పుట్టుక పుట్టినాక ఒక తెగింపు ఉండల్ల బతికేదానికి" అనే ధైర్యం కలిగిన పాత్ర కాంతమ్మది. "అమాయకపు మనుషుల్ని కాపాడితేనే, దేవుడు మిమ్మల్ని సల్లగా చూస్తాడు. ఈ లోకంలో అమ్మా, నాయన లేనోళ్లకి చుట్టూరా ఎంతమంది జనం వున్నా అనాథలకిందే" అని ఆమె చాటిన మానవత్వాన్ని 'అమరజీవి మా కాంతమ్మత్త!' కథలో దర్శించవొచ్చు. "ఏదైనా సాధించాలి అనుకుంటే ముందు భయాన్ని నరికేయ్యల్ల. నువ్వు ఏదైనా కలగంటే ముందు నువ్వు దేనికీ భయపడొద్దు". అని మునిరత్నం నోట 'దేనికీ భయపడొద్దు' అనే కథలో వివరించారు.

ఎరుకల కపాలి మంచి వంట మాస్టర్‌గా పేరు తెచ్చుకున్నాడు. అతడి చేతి వంట కోసం జనం క్యూ కట్టేవాళ్ళు. అలాంటి మనిషి తాగుడు బానిసై వృత్తిని కోల్పోతాడు. కానీ ఆత్మగౌరవాన్ని విడిచిపెట్టడు. "ఎరికిలోడనే చెప్తా. చెప్తే ఏమి పోతాది అన్నా. నిజమే చెప్తాను. ఇస్తే పని ఇస్తాడు, లేదంటే లేదు. సారాయి మానేస్తే మా కులంలో కూడా రత్నాల్లాంటోల్లు దండిగా వుండారులే అన్నా. అయినా కులం వల్ల ఎవురూ ఎప్పుడూ సెడిపోలేదు" అని తమ ఆత్మగౌరవాన్ని, అస్తిత్వాన్ని ప్రకటించాడు 'కబాబ్ కపాలి'. క్రిష్ణప్ప పందులు వ్యాపారం చేస్తుండేవాడు. అమ్మడం, కొనడంలో మంచి నేర్పరి. భార్య రాధమ్మ పిల్లల్ని కాన్వెంట్‌లో చదివించాలని పట్టు పడ్డడంతో ఎరుకల కాలనీ విడిచి పట్నం వెళ్ళాడు. అక్కడ పందుల వ్యాపారం చేస్తుంటే భార్య ... "మీ నాయినేం చేస్తాడని పిలకాయల్ని ఎవరైనా అడిగితే వాళ్ళేం చెప్పుకోవాల్నో చెప్పు. నువ్వీ పని చేస్తావుంటే మన పిలకాయల్ని ఎవరైనా దగ్గరకు చేరస్తారా? నలుగుర్లో మనకైనా వాళ్ళకైనా ఏం మర్యాదుంటుంది" అని అనేసరికి క్రిష్ణప్ప బిడ్డల కోసం ఆ వృత్తిని మానుకుంటాడు. భార్యాభర్తలు ఇద్దరూ కష్టపడి మగపిల్లలిద్దరినీ ప్రయోజకులను చేస్తారు. ఆరోగ్యం క్షీణించి రాధమ్మ కొడుకుల ఇంటికి వెళ్తే 'మనం ఎరుకలోల్లం అని ఈ పక్క ఎవరికీ తెలియదు. నువ్వొచ్చి మమ్మల్ని అగుడు చెయ్యొద్దు' అని తల్లిని అవమానిస్తారు. "ఆ ఇద్దరు మొగపిల్లల్ని సాకే బదులు గమ్మునా నలుగు పందుల్ని పెంచింటే బావుండేది" అని క్రిష్ణప్ప నోట రచయిత పలికించిన మాటలు తమ కులం గురించి చెప్పుకోవడానికి సంకోచించే ప్రతి వారికీ సూదిమొనల్లా గుచ్చుతాయి. పెత్తందారీ బానిస సంకెళ్ళ నుంచి బయటపడి తమ కాళ్ళ మీద తాము బతకాలని పోరాడిన నీలమ్మను 'వెదుర్లు' కథలో, మంజులను 'గురి' కథలో చూడవచ్చు. సాటి కులపోల్ల కోసం జైలుకు వెళ్లి ప్రభుత్వ టీచర్ ఉద్యోగాన్ని పోగొట్టుకున్న ఒక గిరిజన ఉపాధ్యాయుడి కథ 'ఉడుకోడు'. ఎరుకల నరసింహం ఆధిపత్య కులాల వారికీ ఎదురొడ్డి పోరాడి తమ జాతి ఉన్నతికి కృషి చేసినవాడు. "ఎరికిలోడు సేద్యం ఒక్కటే నేర్చుకుంటే సాలదు మామా, పోరాటం చెయ్యడం నేర్చుకోవల్ల, బతకాలంటే కరువుతోనే కాదు, మొండి మేఘాలతోనే కాదు, మొండి మనుషులతో, పెద్ద కులమోళ్ళతో పోరాటం చెయ్యడం నేర్చుకోవల్ల." అని కుండబద్దలు కొట్టినట్లు తెగేసి చెప్పినవాడు ఉడుకోడు. ఇలా తమ మూలాల్లోకి వెళ్లి బాధ్యతలను, వెతలను కథలుగా మలిచిన పలమనేరు బాలాజీ అభినందనీయులు.

– సాలిపల్లి నాగరాజు
80083 70326

## మార్కెట్ వీధుల్లో ...

**స**న్నని సుకుమారమైన దేహం
ఎల్లప్పుడూ ఆలోచించి ఆరగించే నేను
లావెక్కిపోతాననే భయంతో
అమ్మ చేసే ఒత్తిడి
ఏమీ తిననివ్వని అమ్మ యాంగ్జైటీ
మనసును మెలిపెట్టే బాధ
అలవాటయిన కారు మేఘాలు!

తినే కోరిక చచ్చిపోయిన నేను
సుకుమారం కోల్పోయిన దేహం
అల్లంలా అటూ ఇటూ పెరిగిందనీ
గజ ఏనుగు నడిచినట్టు ఉందనీ
ముఖం దుంపలా ఉంటుందనీ
ఏ దుస్తులూ తనకి అతకవనీ
అంతా తనే తినేస్తుందనీ
అత్తమ్మ ఒకటే సనుగుడు ...
అన్నీ మనసును నొప్పించేవే

క్యాట్ వాక్ ప్రపంచీకరణ నేడు
బ్యూటీ క్వీన్‌లనే కాదు
అత్తమ్మ గదిని కూడా తాకుతోంది!
మార్కెట్ వీధుల్లో సరుకైపోయిన
స్త్రీల దేహాల డెలివరీ పార్శిల్స్
అసహజత్వంలోంచి సహజత్వంలోకి
తీసుకొచ్చిన పాపాయి బోసి నవ్వు !


– సర్వమంగళ, కోల్కతా,
89616 26848

## సంక్రాంతి

**అ**రిసెల వంటల ఘుమఘుమలు
గరిసెల ధాన్యపు గలగలలు
విరిసిన బంతుల కళకళలు
కలిసిన నేస్తపు గుసగుసలు
వాడలు చేరిన వలస పక్షులు
వీడని, పసివాడని పాత
గురుతులు
గోరంతలయ్యే చిరుబురులు
కొండంత నవ్వుల పెళపెళలు
గంగిరెద్దు మెడ గంటల
గణగణలు
ఊరి గుడిలో మంత్ర ధ్వనులు
వీధివీధినా రంగుల ముగ్గులు
రేపగలూ పిల్లల గంతులు
తెలుగు వారి సంబరాల సంక్రాంతి
అందమైన అనుబంధాలను
మరవనివ్వని వెలుగు జ్యోతి!

– డా.డి.వి.జి. శంకరరావు,
మాజీ ఎంపీ
94408 36931

# జీవాలతో నడిపిన వర్తమాన కథ




పరిచయం

**అం**దరికీ రాయాలని ఉంటుంది. కానీ కొందరే రాస్తారు. ఆ కొందరిలో ఆర్.సి.కృష్ణస్వామి రాజు ఒకరు. తను పెరిగిన వాతావరణంపై మమకారమెక్కువ. తన భాష మీద అభిమానమూ ఎక్కువే. తనతో పాటు పెరిగిన రకరకాల మనస్తత్వాల మనుషులతో సహవాసమూ ఎక్కువే. అందుకే కథ రాసినా, నవల తీసుకొచ్చినా సమీకృత ఆహారంలా ఉంటుంది. మనసుకు ఆహ్లాదం, మమతకు ఆదరమేకాక నిండు పున్నమి వెన్నెల్లా హాయిని ఇతని రచనలు అందిస్తాయి. కథలు ఒక ఎత్తైతే నవలది ఎత్తుకు పై ఎత్తు. చదివేవారు ఎక్కడా పెదవి విరచకూడదు. చప్పగా సాగకూడదు. ఇన్ని లక్షణాలు ఉంటేనే నవల అందరికీ ఆస్వాదయోగ్యం. లేదంటే శ్రమ వృథా.

కృష్ణస్వామి రాజు రచించిన 'మేకల బండ' నవల కలల పంట. తాము కన్న కలల్ని నిజం చేసుకోవాలన్న తపన జీవాలకే కాదు మనుషులకు ఉండడం గమనార్హం. సుంకర గోపాల్ గారు అన్నట్టు– ఇవి పంచతంత్రం నాటి జీవాలు కావు. ప్రపంచీకరణ నేపథ్యపు జీవాలు. అన్నీ ఒంటబట్టించుకున్న జీవాలు. ఎలా బతకాలో, ఎలా ఉండాలో ఏమి సాధించాలో తెలిసిన జీవాలు. ఏ విధంగా సమాజంలో ఉండకూడదో తెలిసి మసలుకునే జీవాలు. నల్ల గొర్రె, కుంటిమేక, మేకపోతు, పొట్టేలు జీవాలే. కానీ ఇవి సజీవ మానవ మూర్తులు. రచయిత ఉద్దేశం వాటి ద్వారా సమాజ గమనాన్ని చెప్పడం.. అంతే!

జీవాలను మేపే సుందరం, వడివేలు, పెంచల్ రాజు, తిరుపాలు... వీరందరిదీ ఒకలాంటి మనస్తత్వమే. గుర్తింపు కోసం పాకులాడే గుణం. సమాజంలో మేము కూడా సాధించగలము అని నమ్మిన వాళ్లు. కానీ సమాజానికి వీరి మీద నమ్మకం లేదు. నవల ప్రారంభంలోనే రచయిత సమాజాన్ని చిత్రిక పట్టారు. ఈనిన గొర్రె దగ్గర నుంచి ఇంకో గొర్రెపిల్లకి పాలు పట్టడం. ఇది పరోపకారం అనుకోవాలా? ఆదమరిస్తే ఇంతే సంగతి అనుకోవాలా? అనేది కొంచెం తార్కికంగా ఆలోచిస్తే తెలుస్తుంది. ప్రతివాడు సమాజంలో ఇంకొకరిని వాడుకోవడానికి ప్రయత్నించే వాడే. జీవాలు కనిపించలేదని స్టేషన్‌కి వెళ్తే అక్కడి పోలీసు ప్రవర్తన పై విషయానికి దృశ్యమానమౌతుంది.

ఎద్దుకళ్ళోడు కుక్కలను కొట్టడం కొంచెం ఆలోచింపచేస్తుంది. "పని లేక కుక్కల్ని కొడుతున్నాను. వాటిని కొట్టినా అవేమీ అనవు" అని అతను చెప్పడం నిజమనిపిస్తుంది. ఒకసారి సమాజాన్ని గమనిస్తే పని లేనోడే పనికిరాని పనులు చేస్తుంటాడు. ఇంకో చేతగాని వాడిని హింసిస్తుంటాడు. ఇలాంటి సంఘటనలన్నీ రచయిత జీవితంలో తారసపడిన ఘట్టాలే అయి ఉంటాయి. ఇందులోని కథానాయకులందరూ ఒక ఈడు వారు కాదు. 60 ఏళ్ల నుంచి 30 ఏళ్ల దాకా ఉన్నవారు. అనుభవ లేమి నుంచి అపారానుభవం గడించినవారు. అయినా ఎవరి తిప్పలు వారివి. కానీ అందరి సమస్య ఒకటే... తమను ఎవరూ గుర్తించకపోవడం, చేతగాని వారిలాగా చూడడం. ఇంట్లో వాళ్లు కూడా వాడుకునే వాళ్ళే.

ఇంకో పార్శ్వంలో జీవాలు అలాంటి ఆలోచనలు చేసేవే. వాటికి స్వేచ్ఛా జీవితం గడపాలన్న ఇచ్ఛ. ఎప్పుడు తప్పించుకుందామా అని చూస్తున్న వాటికి సరైన సమయం దొరకడంతో అడవిలోకి పారిపోతాయి. అసలు కథంతా అడవిలోనే నడుస్తుంది జీవాలు చెప్పుకునే మాటల్లో ప్రజల ఇష్టాలు అఇష్టాలు వాటి జీవితాలు కనిపిస్తాయి. సుందరం సెల్ఫోన్ వాడకంతో తనను పట్టించుకోలేదని మేకపోతు వాపోతుంది. సెల్ఫోన్ వాడటాన్ని చెడ్డ వ్యసనంతో పోలుస్తుంది. నల్లగొర్రె తన యజమాని అల్లుడికి గొర్రె కూర అంటే చాలా ఇష్టం కానీ గొర్రెలు అంటే మాత్రం అసహ్యం అని చెప్తుంది. పుల్లలతో అల్లుడి బొమ్మ చేసి కాలుస్తుంది. మాటలు లేని జీవికి కూడా ఎంత క్రౌర్యం ఉంటుందో దీని ద్వారా మనకు అర్థమవుతుంది.

తెల్ల పొట్టేలు యజమాని భార్యకి సీరియల్ పిచ్చి. తనకు తాను సినిమా నటిలాగా ఊహించుకుంటుంది. రిమోట్ కింద పెట్టకుండా ఎప్పుడూ టీవీ కాలక్షేపమే. భర్తని కూడా పట్టించుకోదు. ఎవరూ లేకుంటే డాన్స్ చేస్తుంది. ఇంక మమ్మల్నేమి పట్టించుకుంటుంది– అని తన బాధను చెప్పుకుంటుంది. పెద్దపెద్ద చెవుల వల్ల వచ్చే శబ్దం వల్ల ఇబ్బందని మా యజమానురాలు నా చెవులు కత్తిరించిందని కుంటిమేక తన గోడను చెప్తుంది.

ఈ జీవాల భాషణం అంతా ప్రస్తుత కాలంలో జరుగుతుండేదే. రచయిత సమాజంలో జరుగుతున్న రుగ్మతలను ఏకరు పెట్టారు. ఎక్కడెక్కడ మనిషి తన ప్రవర్తనను వదిలేస్తున్నాడో వాటిని గుర్తు చేశారు. ఇందులో ఇంకో అద్భుతం... వీటికి మనిషిలాగ మాటలు రావడం, అవి మాట్లాడుకోవడం, మనుషుల మనస్తత్వాలను చీదరించుకోవడం. తాము కన్న కల చివరకు ఇబ్బందిగా పరిణమించడం ఇంకో ట్విస్ట్. జీవాలుగా ఉన్నంతవరకు వాటి మనసుల్లో ఎలాంటి కల్మషం ఉండదు. ఎప్పుడైతే మనుషులుగా మారతాయో వాటిలో స్వార్థం, ఈర్ష్య, అసూయ, ద్వేషం అన్నీ పుట్టుకొస్తాయి. నేనంటే నేను గొప్ప అనే భావాలు కలుగుతాయి.

మాటలు ఇచ్చిన యోగి వాటి మనసులోని క్రౌర్యాన్ని బయటపెడతాడు. నల్ల మేకకు తాను గొప్ప జాతిదాన్ని మిగతావి తక్కువ జాతివని అహంభావం. నల్లగొర్రెకు మాంసాహారం తినాలన్న ఆశ. అదీను తనొక్కటే తినేయాలన్న దురాశ. తెల్ల పొట్టేలుకు డబ్బు సంపాదించాలన్న పేరాశ. కుంటి మేకకు తన కుంటితనం వల్ల మేకపోతు పట్టించుకోవడం లేదన్న బాధ. అదీ కాక తను ప్రేమించిన మేకపోతు ఇంకో దాన్ని చూడడం తట్టుకోలేక పోతుంది. దానికోసం ఎంతకైనా తెగించాలని ఆలోచిస్తుంది. ఇలాంటి తత్వాలు, మనస్తత్వాలు మనుషులకు మాత్రమే సంభవం. తమ ప్రాభవాన్ని చాటుకోవడం కోసం ఇంకో జీవిని చంపడానికి కూడా వెనకాడవు. ఇది జంతువులకు మనిషి జ్ఞానం అలవడితే వచ్చిన పరిస్థితి!

జీవాలు తప్పిపోయాయని, అవి దొరికే దాకా రామని శపథం పెట్టి చెట్టూ పుట్టా, కొండా కోనా, దేవుళ్ళు, స్టేషన్లు అన్నీ తిరుగుతారు ఆ నలుగురు. చివరికి 'ఎక్కడ పడేసుకున్నామో అక్కడే వెతుక్కోవాలి' అని 'గోవింద పాదం' దగ్గరికి వస్తారు. అన్ని దిక్కులు వెతికాం కానీ మేకల బండ వైపు వెతకలేదని అటువైపు వెళ్తారు. యోగి ద్వారా నిజాన్ని తెలుసుకున్న జీవాలు 'గోవింద పాదం' వైపు అడుగు లేస్తాయి. కథ సుఖాంతమవుతుంది.

ఈ నవలలో 'గోవింద పాదం' ఐతిహ్యం. అడవిలో అన్నలు, యోగి కథ, సుదూర ప్రాంతాల నుంచి వలస వచ్చే పక్షులు, ఎర్రచందనం దొంగలు, రకరకాల మనస్తత్వాల మనుషులు అందరూ కనిపిస్తారు. మనల్ని పలకరిస్తారు. ప్రపంచీకరణ నేపథ్యంలో మనిషి జీవిత గమనాన్ని రచయిత చూపారు. కలలు ఏ విధంగా మనిషిని పెడదారి పట్టిస్తాయో తద్వారా కలిగే బాధలను చవిచూపిస్తారు. చుట్టూ ఉన్న వాతావరణాన్ని కాల్పనిక నేపథ్యంతో అద్భుతంగా కథనో, నవలనో అల్లడం నేర్చిన గొప్ప నేతగాడు ఆర్.సి.కృష్ణ స్వామి రాజు. వీరు మరిన్ని నవలలు రాయాలని, సమాజంలోని దౌర్బల్యాన్ని ఎత్తి చూపాలని, తద్వారా కొంతమందైనా మారాలని ఆశిద్దాం. ఈ నవల ప్రతులకు : 93936 62821

– డాక్టర్ బ్రహ్మానంద రెడ్డి



ఆచార్య తంగిరాల వెంకట సుబ్బారావుకు 2025 ప్రతిభా మూర్తి జీవితకాల సాధన పురస్కార ప్రదాన దృశ్యం

# సాహిత్య మూర్తులకు విశిష్ట పురస్కారాలు

నివేదిక

**ఈ** నెల 2 – 5 తేదీల్లో విజయవాడలోని మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రంలో అజో విభో కందాళం ఫౌండేషన్, జాషువా సాంస్కృతిక వేదిక వారి సంయుక్త నిర్వహణలో సాహితీ సాంస్కృతిక సదస్సులు, కథానాటికల పోటీలు ఘనంగా జరిగాయి. 3వ తేదీ ఉదయం జరిగిన మొదటి సాహితీ సదస్సులో 'సరిలేరు నీకెవ్వరు– విశిష్ట సాహిత్య పురస్కారం' అందుకున్న 'కోయి కోటేశ్వరరావు కషి సమాలోచనపై సదస్సు జరిగింది. 4వ తేదీన విశిష్ట సాహితీ మూర్తి జీవితకాల సాధనా పురస్కారం పెనుగొండ లక్ష్మీనారాయణకు, 5వ తేదీన ప్రతిభా మూర్తి జీవితకాల సాధనా పురస్కారం ఆచార్య తంగిరాల వెంకట సుబ్బారావుకు అందజేశారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని ఈ ముగ్గురిపై సన్మానోత్సవ విశేష సంచికలను ఫౌండేషన్ ప్రచురించింది.

కోయి కోటేశ్వరరావు కృషి – సమాలోచన సదస్సుకు గుమ్మా సాంబశివరావు అధ్యక్షత వహించగా, మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్ విశిష్ట అతిథిగా విచ్చేశారు. కోయి కోటేశ్వరరావు (కో.కో) సాహిత్య కృషిపై వేసిన విశేష సంచికకు బీరం సుందం రావు, శిఖా–ఆకాష్ సంపాదకులుగా వ్యవహరించారు. ఈ సంచికలో 12 వ్యాసాలు ఉన్నాయి. వీటిని సుద్దాల అశోక్ తేజ, శిఖామణి, కలేకూరి ప్రసాద్, గుమ్మా, బీరం, మందరపు హైమవతి, చందా అప్పారావు తదితరులు రాశారు. చివర్లో శిఖా–ఆకాష్ జరిపిన ముఖాముఖి ఉంది. కవిగా, విమర్శకునిగా, వక్తగా, అధ్యాపకునిగా బహుముఖీన మైన కోటేశ్వరరావు కృషిని ఆవిష్కరించే వ్యాసాలతో పాటు ఆయన రాసిన కొన్ని కవితలను కూడా ఈ సంచికలో పొందుపరిచారు. పుటలకొద్దీ చెప్పే వ్యాస సారాంశాన్ని సంక్షిప్త సుందరంగా చెప్పడం కో.కో కలానికి తెలిసిన రసవిద్య అన్నారు బీరం. శిఖా ఆకాష్ జరిపిన ముఖాముఖిలో 'కుసుమ ధర్మన్న దగ్గర నుంచి కత్తి పద్మారావు వరకు ఉన్న మూడు తరాల కవుల కవిత్వాన్ని విశ్లేషిస్తూ వందకు పైగా వ్యాసాలు రాశాను, తెలుగు సాహిత్యంపై అంబేద్కర్ ప్రభావం గురించి పరిశోధన చేస్తున్నాను' అంటూ వివరించారు కో.కో.

4వ తేదీ ఉదయం విశిష్ట సాహితీ మూర్తి జీవితకాల సాధన పురస్కార గ్రహీత పెనుగొండ లక్ష్మీనారాయణపై జరిగిన సదస్సుకు ఆచార్య రాచపాళెం చంద్రశేఖర్ రెడ్డి అధ్యక్షత వహించారు. పెనుగొండ విమర్శపై పాపినేని శివశంకర్, 'అనేక' వ్యాస సంపుటి గురించి సిహెచ్ సుశీలమ్మ, గుంటూరు సీమ సాహిత్య చరిత్రపై ఆచార్య ఎన్ ఈశ్వర్ రెడ్డి, పెనుగొండ 'విదిత' 'దీపిక'– వ్యాస సంపుటాలపై జిఎస్ చలం ప్రసంగించారు. సాయంత్రం జరిగిన విశిష్ట సాహితీ మూర్తి జీవితకాల సాధన పురస్కార సభకు వల్లూరు శివప్రసాద్ అధ్యక్షత వహించారు. సాహితీ వైజయంతి పేరిట ప్రచురించిన సన్మానోత్సవ సంచికకు వల్లూరు శివప్రసాద్ సంపాదకత్వం వహించారు. ఇందులో డాక్టర్ ఎన్.గోపి, డాక్టర్ పాపినేని శివశంకర్, ఆచార్య రాచపాళెం, ఆచార్య ఎస్ వి సత్యనారాయణ, శరత్ చంద్ర జ్యోతిశ్రీ, అట్టాడ అప్పలనాయుడు, గంటేడ గౌరు నాయుడు, చెరుకూరి సత్యనారాయణ, నల్లూరు రుక్మిణి, కోసూరి రవికుమార్, డాక్టర్ ఎల్లాప్రగడ మల్లికార్జునరావు, పెనుమాక నాగేశ్వరరావు, టేకుమళ్ళ వెంకటప్పయ్య, ఏటుకూరి ప్రసాద్, నండూరి రాజగోపాల్, విహారి, చందు సుబ్బారావు, అంపశయ్య నవీన్ తదితరులు రాసిన 30కి పైగా వ్యాసాలు ఉన్నాయి. చివరగా పెనుగొండతో రాచపాళెం ముఖాముఖి ఉంది. సాహిత్య సాంస్కృతిక, సామాజిక రంగాలను పెనుగొండ మూడు దశాబ్దాల క్రితమే ఎంచుకుని వామపక్ష భావజాలమే తనకు చుక్కాని లాంటిదని నిర్దిష్టంగా చెప్పుకున్నాడని సంచిక సంపాదకీయంలో వల్లూరు పేర్కొన్నారు. రాచపాళెం జరిపిన ముఖాముఖిలో 'సమాజ మార్పుకు లాల్ నీల్ జెండాలు కలిసి పనిచేయాలని పెనుగొండ అభిప్రాయపడ్డారు.

5వ తేదీ ఆదివారం ఆచార్య తంగిరాల వెంకట సుబ్బారావు గారికి 2025 ప్రతిభా మూర్తి జీవితకాల సాధన పురస్కారాన్ని అందించారు. ఉదయం జరిగిన సాహితీ సమాలోచన సభకు తెలుగు విశ్వవిద్యాలయం మాజీ ఉప కులపతి ఆచార్య తంగెడ కిషన్‌రావు అధ్యక్షత వహించగా, శాసనసభ్యులు మండలి బుద్ధ ప్రసాద్, అమరావతి బాలోత్సవం రామిశెట్టి కొండలరావు, జాషువా సాంస్కృతిక వేదిక కార్యదర్శి గుండు నారాయణరావు, ఆచార్య బేతవోలు రామబ్రహ్మం, మల్లాప్రగడ శ్రీమన్నారాయణ మూర్తి, రెంటాల శ్రీవెంకటేశ్వరరావు అతిథులుగా పాల్గొని మాట్లాడారు. సన్మానోత్సవ విశేష సంచికకు డాక్టర్ తోట వెంకటస్వామి సంపాదకులుగా వ్యవహరించారు. ఇందులో 60కు పైగా వ్యాసాలు, తంగిరాల వారితో ముకుంద రామారావు జరిపిన ముఖాముఖి, తంగిరాల జీవన రేఖలు మొదలైన వివరాలతో కూడిన వ్యాసాలు ఉన్నాయి. తెలుగు వీరగాధలు కథలకు ఆచార్య బిరుదు రామరాజు రాసిన పీఠిక, నాలుగు సంపుటాల గురించి తంగిరాల వారే రాసిన ఒక సమగ్ర వ్యాసం, మరికొన్ని వీరగాథలకు తంగిరాల రాసిన పీఠికలు ఉన్నాయి.

ఈ మూడు సమ్మానోత్సవ విశేష సంచికలు ఎంతో విలువైన భాషా సాహిత్యాల వ్యాసాలతో ఉన్నాయి. ఆదివారం సాయంత్రం జరిగిన సభలో తంగిరాలకు పురస్కార ప్రదానంతో పాటు ప్రశంసా పత్రం, లక్ష రూపాయల నగదు బహూకరణ, కథానాటికల పోటీల బహుమతి ప్రదానం వరుసగా జరిగాయి. నాలుగు రోజుల అజో విభో కందాళం ఫౌండేషన్ వారి 32వ వార్షిక సభలు సాహిత్య, కళారంగ అభిమానులకు మంచి అనుభూతినిచ్చాయి.

– మల్లేశ్వరరావు ఆకుల
79818 72655

## మాజీ ఎంపి మందా జగన్నాథం మృతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో




మందా జగన్నాథం(ఫైల్)

నాగర్‌కర్నూల్ మాజీ ఎంపి మందా జగన్నాథం కన్నుమూశారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయనను కుటుంబ సభ్యులు హైదరాబాద్ నిమ్స్ ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం సాయంత్రం తుదిశ్వాస విడిచారు. మందా జగన్నాథం మృతి పట్ల తెలంగాణ సిఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు సంతాపం ప్రకటించారు. సామాజిక తెలంగాణ ఉద్యమకారుడు జగన్నాథం తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో క్రియాశీలపాత్ర పోషించారని ఆయన సేవలను సిఎం గుర్తు చేసుకున్నారు. కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. నాగర్‌కర్నూల్ జిల్లా ఇటిక్యాలలో 1951 మే 22న జన్మించిన జగన్నాథం నాలుగు పర్యాయాలు ఎంపిగా గెలుపొందారు. మూడుసార్లు టిడిపి, ఒకసారి కాంగ్రెస్ తరపున విజయం సాధించారు. ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధిగానూ సేవలందించారు. 2023 లోక్‌సభ ఎన్నికలకు ముందు ఆయన బిఎస్‌పిలో చేరారు.

### భారతీయ కంపెనీలే లక్ష్యంగా

# మాస్కోపై అమెరికా తాజా ఆంక్షలు




**వాషింగ్టన్ :** రష్యా ఇంధన రంగానికి వ్యతిరేకంగా ప్రకటించిన తాజా చర్యలో భాగంగా అమెరికా, బ్రిటన్‌లు రెండు భారతీయ కంపెనీలను నిషేధించాయి. తాజా ఆంక్షలతో మరింత ఆజ్యం పోసినట్టయిందని ఆర్థిక నిపుణులు విశ్లేషిస్తున్నారు. అమెరికా ట్రెజరీ డిపార్ట్‌మెంట్, బ్రిటీష్ ప్రభుత్వం చేపట్టిన ఈ భారీ చర్యలు రెండు ప్రధాన రష్యన్ పెట్రోలియం ఉత్పత్తిదారులైన గాజ్‌ప్రోమ్ నెఫ్ట్, సుర్గుట్‌నెఫ్టెగాజ్, వాటి అనుబంధ సంస్థలను లక్ష్యంగా చేసుకున్నాయి. రష్యన్ ముడి చమురును రవాణా చేసే 183 నౌకలపై ఆంక్షలు కూడా ఉన్నాయి.

జాబితాలో ఉన్న రెండు భారతీయ సంస్థలు స్కైహార్ట్ మేనేజ్‌మెంట్ సర్వీసెస్ ప్రయివేట్ లిమిటెడ్, అవిషన్ షిప్పింగ్ సర్వీసెస్ ప్రయివేట్ లిమిటెడ్. యూఎస్ స్టేట్ డిపార్ట్‌మెంట్ ప్రకటన ప్రకారం.. ఈ కంపెనీలు రష్యా ఆర్కిటిక్ ఎల్ఎన్‌జీ 2 ప్రాజెక్టుకు మద్దతునిచ్చాయి. ఇది దేశంలోని అతిపెద్ద ద్రవీకృత సహజ వాయువు ఉత్పత్తిదారు నోవాటెక్ యాజమాన్య అభివృద్ధిలో పాక్షికంగా ఉన్నది. ఈ ప్రాజెక్ట్ 2023 నుంచి అమెరికా ఆంక్షల కింద ఉంది. ఆర్కిటిక్ ఎల్ఎన్‌జీ 2 ప్రాజెక్ట్ కు భౌతికంగా సహాయం చేయడం లేదా మద్దతు అందించడం కోసం రెండు కంపెనీలను ఎగ్జిక్యూటివ్ ఆర్డర్ 14024 కింద నియమించారు. అదనంగా, అవిజన్, ప్రవాసి.. ఒనిక్స్ నిర్వహించే రెండు నౌకలను కంపెనీకి సంబంధించిన ఆస్తిగా గుర్తించారు. ప్రాజెక్ట్ నుంచి సరుకును లోడ్ చేసే ద్రవీకృత సహజ వాయువు వాహకాలను భారత కంపెనీలు నిర్వహించాయి. ఆర్కిటిక్ ఎల్ఎన్‌జీ 2 ప్రాజెక్ట్‌ను "పునరుజ్జీవింపజేసే ప్రయత్నంలో" "థర్డ్ కంట్రీ షిప్ మేనేజ్‌మెంట్ సంస్థల ద్వారా ఎల్ఎన్‌జీ వాహకాల యాజమాన్యాన్ని అస్పష్టం చేసే ప్రయత్నాలలో రష్యా నిమగ్నమైందని" అమెరికా అధికారులు పేర్కొన్నారు. గతేడాది సెప్టెంబర్‌లో, ముంబయిలో నమోదు చేయబడిన రెండు భారతీయ ఆధారిత కంపెనీలు గోటిక్, ఫ్లియో ఎనర్జీపై వాషింగ్టన్ ఆంక్షలను విధించింది. ఇవి ప్రాజెక్ట్ తో అనుసంధానించబడి ఉన్నాయని పేర్కొన్నది. నోవాటెక్ ప్రాజెక్ట్ నుంచి ఎల్ఎన్‌జీని "ఎగుమతి చేసే ప్రయత్నాలకు" సంబంధం ఉందని ఆరోపిస్తూ ఈ కంపెనీల యాజమాన్యంలోని రెండు నౌకల పైన కూడా ఆంక్షలను విధించింది. గతేడాది అమెరికా ఒక ప్రత్యేక చర్యలో, రష్యన్ సంస్థలకు ఎలక్ట్రానిక్స్, విమానయాన భాగాలను సరఫరా చేసినందుకు 19 భారతీయ కంపెనీలు, ఇద్దరు జాతీయులపై ఆంక్షలు విధించింది. దీనికి ప్రతిస్పందనగా, ఆ కంపెనీలు దేశీయ చట్టాలను ఉల్లంఘించలేదనీ, భారతదేశ చట్టాల పరిధిలోనే పనిచేస్తున్నాయని భారత్ పేర్కొన్నది. సమస్యలను "స్పష్టం" చేయడానికి భారత్.. అమెరికాతో సంప్రదింపులు జరుపుతోందని భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ పేర్కొన్నది.గత రెండు సంవత్సరాలలో రష్యా భారత్‌కు కీలక ఇంధన భాగస్వామిగా అవతరించింది. ముడి చమురు సరఫరాలో అగ్రగామిగా అవతరించింది. గతేడాది సెప్టెంబరులో రష్యా నుంచి భారత్ చేసుకున్న ముడి చమురు దిగుమతులు ఆగస్టు నుంచి 11.7 శాతం పెరిగి, దాదాపు 1.9 మిలియన్ బ్యారెళ్లకు చేరుకున్నాయి. ఇది ఆ నెలలో భారత మొత్తం ముడి చమురు దిగుమతుల్లో దాదాపు 40 శాతం కావటం విశేషం. దేశ ఇంధన భద్రతను నిర్ధారించడంలో మాస్కో కీలక పాత్ర పోషిస్తున్నదని భారత్ తెలిపింది.



## ఆకట్టుకున్న జానపద కళా జాతర

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు (శ్రీకాకుళం జిల్లా)

సంక్రాంతి ఉత్సవాల్లో భాగంగా శ్రీకాకుళం జిల్లా వజ్రపుకొత్తూరు మండలం రాజాంలో సిక్కోలు జానపద సాహిత్య కళావేదిక ఆధ్వర్యాన ఆదివారం నిర్వహించిన జానపద కళా జాతర ఆద్యంతం ప్రేక్షకులను ఉర్రూతలూగించింది. రాజాం యువకుల జానపద నృత్యాలు, తప్పెటగుళ్ళు, అమ్మవారి పాటలు, కోలాటం, జముకుల పాటలు, బోనెల పాటలు, గంగిరెద్దులు, అంజాటలు, రేలారే రేలా వెంకటేష్ పాటలు, థింసా నృత్యాలు, బాతుపురం వారి జాలారి వేషం, యడ్లపల్లి చిరంజీవి పిట్టలదొర వేషం ఆకట్టుకున్నాయి. సారంగపాణి వారి గంగిరెద్దుల నృత్యాలు, అసిరయ్య బోనెల పాటలకు మంచి స్పందన లభించింది. సామాజిక గేయాలు, జానపద నృత్యాలు, పల్లె పాటలు ప్రేక్షకులను కట్టి పడేశాయి. తూర్పుగోదావరి జిల్లా నుంచి వచ్చిన కళాకారులు ఘటోత్కచుడు, హరిదాసుడు, పిట్టలదొర, కొమ్మ దాసరి , దేవర పెట్టి, ప్రాచీన కళలను వి.రాజ్ కుమార్, వై.సుబ్బారావు, వై.చిరంజీవి, కామాక్షి ప్రదర్శించారు.అనంతరం పద్మశ్రీ పురస్కార గ్రహీత, రంగస్థల నటులు ఎడ్ల గోపాలరావుతోపాటు పలువురు కళాకారులను సత్కరించారు. సిక్కోలు జానపద సాహిత్య కళావేదిక అధ్యక్ష, కార్యదర్శులు దేవరాజు, రాపాక ధనరాజ్ ఆధ్వర్యాన నిర్వహించిన కార్యక్రమంలో మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు, వైద్యులు మల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# యోగి కమ్యూనిటీకి వివిపి సేవ

- కుంభమేళాలో నాథ్ సమూహానికి 'ప్రత్యేక' ఏర్పాటు
- పలు సౌకర్యాలతో భారీ పండల్ నిర్మాణం
- యుపి సిఎం కనుసన్నల్లోనే అంతా



**లక్నో :** ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో మహాకుంభమేళ సోమవారం ప్రారంభం కానున్నది. లక్షలాది మంది భక్తులు ఈ కార్యక్రమానికి తరలి వస్తారని అంచనా. ఇప్పటికే కావాల్సిన ఏర్పాట్లను ప్రభుత్వ యంత్రాంగం చూసుకుంటున్నది. భక్తుల కోసం లక్షకు పైగా గుడారాలు, పండల్స్‌ను నిర్మించారు. వీటికి సంబంధించిన విషయంలోనే 'ప్రత్యేక ఏర్పాట్లు' జరిగాయి. ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి యోగి ఆధిత్యనాథ్‌కు చెందిన కమ్యూనిటీ నాథ్ సమూహానికి వీఐపీ సేవలు అందుతున్నాయి. ఇందులో భాగంగా నాథ్ శాఖ కోసం ఏర్పాటు చేసిన పెద్ద పండల్ ఈ కుంభమేళలో ప్రత్యేకంగా నిలుస్తున్నది. ఇదంతా సిఎం పర్యవేక్షణలోనే జరగటం గమనార్హం. భారీ, విశాలమైన గుడారాలు, దేశీ నెయ్యితో తయారు చేసిన ప్రత్యేక లాంగర్లు, వాహనాల పార్కింగ్ కోసం ఓపెన్ ఏరియా వంటివి ఇందులో ఉన్నాయి. భారీ పోలీసు మోహరింపు, ఎస్‌యూవీలు తిరుగుతూ అక్కడ హల్‌చల్ చేస్తున్నాయి. సిఎం యోగి స్వయంగా దీనిని పర్యవేక్షిస్తున్నారు. "ఈ పండల్ సిఎం బస చేసే ప్రదేశం. ఆయన కోసం అత్యాధునిక సౌకర్యాలతో కూడిన రెండు ప్రత్యేక కుటీరాలు సిద్ధమవుతున్నాయి" అని ప్రయాగ్‌రాజ్ మేళా అథారిటీ తెలిపింది. వీటితో పాటు, వివిధ మతాల మహంతులు, ప్రధాన పూజారుల కోసం దాదాపు 72 ప్రత్యేకమైన, సహజమైన తెల్లటి కుటీరాల లాంటి పందిరిని ఏర్పాటు చేశారు. ఇవి బెడ్‌లు, హీటర్లు, వాష్‌రూమ్ సౌకర్యాలు, గీజర్లు, వాష్‌బేసిన్‌లతో ఉన్నాయి. గురువారం, సాధువుల కోసం చేసిన ఏర్పాట్లను పర్యవేక్షించడానికి ముఖ్యమంత్రి పండల్‌ను సందర్శించారు. "యోగి బాబా మమ్మల్ని ఇక్కడ చాలా ప్రత్యేకంగా భావించేలా చేశాడని మేము ఆయనపై పూల వర్షం కురిపించాం" అని ఇటీవల నాథ్ కమ్యూనిటీలో సభ్యుడిగా మారిన 18 ఏళ్ల వ్యక్తి అన్నారు.మహంతులు కాని వారి కోసం, దుప్పట్లు, దుప్పట్లతో చక్కగా కప్పబడిన ప్రత్యేక విశాలమైన గుడారం ఏర్పాటు చేశారు. సుమారు 10,000 మందికి వసతి కల్పించగల నాలుగు భారీ పండళ్లు ఉన్నాయని ప్రయాగ్‌రాజ్ మేళా అథారిటీ అధికారి ఒకరు తెలిపారు. గోరఖ్‌పూర్‌లోని గోరఖ్‌నాథ్ మఠం పీఠాధీశ్వర్(అధిపతి) అయినందున నాథ్ పండల్‌ను ప్రభుత్వం చూసుకోలేదనీ, వ్యక్తిగతంగా సిఎం చూసుకుంటున్నారని సీనియర్ అధికారి ఒకరు తెలిపారు.

# సిఐఎకి అందుబాటులో వాట్సాప్ సందేశాలు

- మెటా సిఇఒ జుకర్‌బర్గ్

**వాషింగ్టన్ :** అమెరికా నిఘా సంస్థ సిఐఎ సహా ఇతర విభాగాల అధికారులు, వినియోగదారుల పరికరాల్లోకి రిమోట్‌గా లాగిన్ అవ్వడం ద్వారా వాట్సాప్ సందేశాలను చదవగలరనీ, ప్లాట్‌ఫారమ్ ఎండ్-టు-ఎండ్ ఎన్‌క్రిప్షన్(రక్షణ వ్యవస్థ)ను సమర్థవంతంగా దాటవేస్తారని మెటా సిఇఒ మార్క్ జుకర్‌బర్గ్ అంగీకరించారు. వాట్సాప్ ఎన్‌క్రిప్షన్ మెటా సందేశ కంటెంట్‌ను వీక్షించకుండా నిరోధించినప్పటికీ, అది వినియోగదారు ఫోన్‌కు భౌతిక యాక్సెస్ నుంచి రక్షించదని శుక్రవారం జో రోగన్ ఎక్స్ పీరియన్స్ పాడ్‌కాస్ట్ లో మాట్లాడుతూ జుకర్‌బర్గ్ వివరించారు.

రష్యన్ అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌తో ఇంటర్వ్యూను ఏర్పాటు చేయాలనే టక్కర్ కార్ల్సన్ అన్వేషణ గురించి రోగన్ అడిగినప్పుడు ఆయన ఇలా వ్యాఖ్యానించారు. గతేడాది ఫిబ్రవరిలో, మూడు సంవత్సరాల విఫల ప్రయత్నాల తర్వాత పుతిన్‌తో మాట్లాడటంలో విజయం సాధించడం గురించి మాట్లాడుతూ, కార్ల్సన్ తన ప్రయత్నాలను నిలిపివేసినందుకు అమెరికా అధికారులను, అంటే నేషనల్ సెక్యూరిటీ ఏజెన్సీ(ఎన్ఎస్ఏ), సీఐఏలను నిందించారు. కార్ల్సన్ ప్రకారం.. ఏజెన్సీలు అతని సందేశాలు, ఈమెయిల్‌లను ట్యాప్ చేయడం ద్వారా అతనిపై నిఘా పెట్టాయి. అతని ఉద్దేశాలను మీడియాకు లీక్ చేశాయి. ఇది మాస్కో అతనితో మాట్లాడకుండా "భయపెట్టింది". సందేశాలను రక్షించాల్సిన ఎన్‌క్రిప్షన్ రక్షణ చర్యలను పరిగణనలోకి తీసుకుంటే ఇది ఎలా జరిగిందో వివరించాలని రోగన్ జుకర్‌బర్గ్ ను అడిగారు. "ఎన్‌క్రిప్షన్ చేసే పని నిజంగా మంచిది. ఎందుకంటే సేవను నడుపుతున్న కంపెనీ దానిని చూడకుండా చేస్తుంది. కాబట్టి మీరు వాట్సాప్ ఉపయోగిస్తుంటే, మెటా సర్వర్‌లు ఆ సందేశంలోని విషయాలను చూసే అవకాశం లేదు" అని జుకర్‌బర్గ్ అన్నారు. ఎవరైనా మెటా డేటాబేస్‌లను హ్యాక్ చేసినప్పటికీ, వారు వినియోగదారుల ప్రయివేట్ టెక్స్ట్‌లను యాక్సెస్ చేయలేరని చెప్పారు. కార్ల్సన్ ఉపయోగించిన సిగ్నల్ మెసేజింగ్ యాప్ అదే ఎన్‌క్రిప్షన్‌ను ఉపయోగిస్తుంది. కాబట్టి అదే నియమాలు వర్తిస్తాయి. అయితే, పరికరాల్లో నిల్వ చేయబడిన సందేశాలను వీక్షించకుండా చట్ట అమలు సంస్థలను ఎన్‌క్రిప్షన్ ఆపదని ఆయన గుర్తించారు. "వారు చేసేది ఏమిటంటే మీ ఫోన్‌కు యాక్సెస్ కలిగి ఉండటం. కాబట్టి, ఏదైనా ఎన్‌క్రిప్ట్ చేయబడిందా అనేది పట్టింపు లేదు. వారు దానిని సాధారణ దృష్టిలో చూడగలరు" అని ఆయన స్పష్టం చేశారు. ఇజ్రాయిల్ కంపెనీ ఎన్ఎస్ఓ గ్రూప్ అభివృద్ధి చేసిన స్పైవేర్ పెగాసస్ వంటి సాధనాలను జుకర్‌బర్గ్ ప్రస్తావించారు. వీటిని మొబైల్ ఫోన్‌లలో రహస్యంగా ఇన్‌స్టాల్ చేసి డేటాను యాక్సెస్ చేయవచ్చు. జుకర్‌బర్గ్ ప్రకారం.. వినియోగదారుల ప్రయివేట్ సందేశాలు నేరుగా వారి పరికరాల్లోకి చొరబడటం ద్వారా ప్రమాదంలో పడవచ్చు అనే వాస్తవం.. మెటా అదృశ్యమయ్యే సందేశాలను రూపొందించడానికి కారణం. ఇక్కడ ఒక నిర్దిష్ట కాలం తర్వాత ఒకరి సందేశ థ్రెడ్‌ను తొలగించవచ్చు. డిజిటల్ గోప్యత, ప్రభుత్వ నిఘా గురించి జరుగుతున్న చర్చల మధ్య జుకర్‌బర్గ్ వ్యాఖ్యలు ప్రాధాన్యతను సంతరించుకున్నాయి. వినియోగదారు డేటాను రక్షించినందుకు ఎండ్-టు-ఎండ్ ఎన్‌క్రిప్షన్ ప్రశంసలందుకున్నప్పటికీ.. సీఐఏ, ఎఫ్‌బీఐ వంటి ఏజెన్సీలు నేరాలు, ఉగ్రవాదాన్ని ఎదుర్కోవడానికి చేసే ప్రయత్నాలను ఇది అడ్డుకోగలదని వాదించాయి. అదనంగా, ఎన్‌క్రిప్టెడ్ సందేశాలను ప్రసార సమయంలో అడ్డగించలేనప్పటికీ, క్లౌడ్ సేవల్లో నిల్వ చేయబడిన బ్యాకప్‌లు ఎన్‌క్రిప్షన్ కీని జతచేస్తే చట్ట అమలు సంస్థలు యాక్సెస్ చేయగలవని నివేదికలు సూచిస్తున్నాయి.



## మెక్సికోలో భూకంపం..

- రిక్టర్ స్కేల్‌పై 6.2 నమోదు

**మెక్సికో సిటీ :** నైరుతి మెక్సికో ప్రాంతంలో ఆదివారం తెల్లవారు జామున భూకంపం సంభవించింది. రిక్టర్ స్కేల్‌పై భూకంప తీవ్రత 6.2గా నమోదైందని అమెరికాకు చెందిన జియాలజికల్ సర్వే తెలిపింది. ఈ భూకంపం వల్ల ఎటువంటి ప్రాణ నష్టం, ఆస్తినష్టం సంబవించలేదని పేర్కొంది. కొలిమా సరిహద్దుకు సమీపంలో ఆగ్నేయ అక్విలాకు 21కి.మీ కేంద్రంగా 34 కిమీ లోతుల భూకంప కేంద్రం కేంద్రీకతమై ఉంది. రాజధాని మెక్సికో సిటీకి 600 కి.మీ దూరంలో భూకంప కేంద్రం కేంద్రీకృతమై ఉందని అధికారులు గుర్తించారు. మెక్సికో అధ్యక్షుడు క్లాడియా షైన్‌బాం స్పందిస్తూ బాధితులకు అత్యవసర సేవలు అందించాలని అధికార యంత్రాంగాన్ని ఆదేశించారు. ఆదివారం తెల్లవారుజామున 2.32 గంటలకు మిచోయాకాన్ నగర పరిధిలో భూప్రకంపనలు సంభవించడంతో భవనాలు, కార్లు కదిలిపోయాయి. కదలికలు ఆగిపోయే వరకూ ప్రజలు వీధుల్లోకి దూసుకొచ్చారని మెక్సికో జాతీయ సిస్మటాలజికల్ సర్వీస్ తెలిపింది.

## ఎనిమిది మంది భారత జాలర్ల అరెస్టు

**కొలంబో :** భారత్‌కు చెందిని ఎనిమిది మంది జాలర్లను శ్రీలంక నేవీ ఆదివారం అదుపులోకి తీసుకున్నది. మత్స్యకారులతో పాటు రెండు పడవలను సైతం స్వాధీనం చేసుకున్నది. పట్టుబడిన మత్స్యకారులు తమిళనాడులోని రామనాథపురానికి చెందిన వారు. మత్స్యకారులు మండపం నుంచి సముద్రం వైపు వెళ్లి పాక్ బే ప్రాంతంలో చేపల వేట సాగిస్తున్నట్లు నేవీ అధికారులు ఆరోపించారు. సరిహద్దు దాటి వచ్చారని నేవీ పేర్కొంది. భారతదేశం- శ్రీలంక మధ్య సంబంధాల్లో మత్స్యకారుల సమస్య వివాదాస్పద సమస్యగా కొనసాగుతున్నది.ఇలాంటి ఘటనలు ఎక్కువగా పాక్ జలసంధిలో జరుగుతుంటాయి. తమిళనాడు, ఉత్తర శ్రీలంక మధ్య ఉన్న స్ట్రిప్. ఇక్కడ ఎక్కువగా చేపల వేట సాగుతుంది. పట్టుబడిన జాలర్లను విచారణ అనంతరం జాఫ్నా మత్స్యశాఖ అధికారులకు అప్పగించారు. గతంలో తమిళనాడు సీఎం ఎంకే స్టాలిన్ భారత జాలర్లను లంక నేవీ అరెస్టు చేస్తుండడం తీవ్రమైన సమస్యగా పేర్కొన్నారు. ఈ విషయంలో చర్యలు తీసుకోవాలని ఆయన కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ విషయంలో విదేశాంగ మంత్రి జైశంకర్‌కు లేఖ రాయగా.. ఈ మేరకు చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు.

# దేశవ్యాప్తంగా చలిగాలులు తీవ్రత

- ఉత్తర భారతంలో పాఠశాలలకు సెలవులు



**న్యూఢిల్లీ :** దేశవ్యాప్తంగా చలిగాలులు తీవ్రత భారీగా పెరిగింది. ప్రధానంగా ఉత్తరప్రదేశ్‌లో చలిగాలుల తీవ్రత మరింత ఎక్కువైంది. దీంతో ఢిల్లీకి ఆనుకుని ఉన్న ఘజియాబాద్ జిల్లాలో 8వ తరగతి వరకు ఉన్న అన్ని పాఠశాలలకు జనవరి 18 వరకు సెలవులు ప్రకటించారు. చలి బారి నుంచి విద్యార్థులకు ఉపశమనం కలిగించేందుకు ఈ మేరకు జిల్లా మేజిస్ట్రేట్ ఇంద్ర విక్రమ్ సింగ్ ఉత్తర్వులు జారీ చేశారు. అయితే పాఠశాల సిబ్బంది మాత్రం పాఠశాలలోనే ఉంటారు. ఉద్యోగులందరూ వారి కార్యాలయాలు, విభాగాలకు సంబంధించిన వారి బాధ్యతలను నిర్వర్తిస్తారని ఆదేశాలలో స్పష్టం చేశారు. ఘజియాబాద్ జిల్లాలో చలికాలం కారణంగా 1 నుంచి 8వ తరగతి వరకు ఉన్న అన్ని బోర్డు అనుబంధ పాఠశాలలను జనవరి 18 వరకు మూసివేయాలని జిల్లా ప్రాథమిక విద్యాశాఖ అధికారి ఆదేశించారు.

అన్ని పాఠశాలలు ఈ ఆదేశాలను ఖచ్చితంగా పాటించాలని సూచించారు. ఆదేశాలు పాటించకుంటే పాఠశాలలపై చర్యలు తీసుకుంటామన్నారు. 8వ తరగతి వరకు ఉన్న అన్ని పాఠశాలలను జనవరి 11వ తేదీ వరకు మూసివేయాలని జిల్లా ప్రాథమిక విద్యాశాఖాధికారి గతంలోనే ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పుడు ఆ ఉత్తర్వులను పొడిగించారు.

**రానున్న 2, 3 రోజులు ఇదే పరిస్థితి**

ఢిల్లీ, దేశరాజధాని ప్రాంతం (ఎన్‌సిఆర్) పరిధిలోని వాయువ్య భారతదేశంలో రాబోయే 2-3 రోజుల్లో చాలా దట్టమైన పొగమంచు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరిక జారీ చేసింది. దీంతో పాటు ఒక మోస్తరు పొగమంచు ఉంటుందని ఎల్లో అలర్ట్ కూడా జారీ చేశారు. చలి పెరుగుతుందని డిపార్ట్‌మెంట్ ప్రకటించిన నేపథ్యంలో అధికారులు పాఠశాలలను మూసివేయాలని నిర్ణయం తీసుకున్నారు.

ఈ ఆర్డర్ అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు వర్తిస్తుంది. అలాగే, నోయిడాలో కూడా 8వ తరగతి వరకు ఉన్న పాఠశాలలు తదుపరి ఉత్తర్వులు వెలువడే వరకు మూసివేయబడతాయని అధికారులు ఆదివారం ప్రకటించారు. లక్నో పాఠశాలలు కూడా జనవరి 14, 2025 వరకు మూసివేయబడతాయి. 9 నుంచి 12వ తరగతి విద్యార్థులకు ఆన్‌లైన్‌లో సెషన్లు నిర్వహించనున్నారు. ఆగ్రా, మధురలలో 1 నుండి 8 తరగతుల పాఠశాలలు జనవరి 14, 2025 వరకు మూసివేయబడతాయని అనౌన్స్ చేశారు.

మరోవైపు ఢిల్లీ ప్రభుత్వం అన్ని ప్రభుత్వ పాఠశాలలకు జనవరి 1 నుంచి జనవరి 15, 2025 వరకు శీతాకాల సెలవులను ప్రకటించింది. ఈ ఆర్డర్ ప్రకారం తరగతులు మళ్లీ జనవరి 16, 2025న పున్ణప్రారంభించబడతాయి.



# ఉత్తరాఖండ్‌లో లోయలో పడిన బస్సు

- నలుగురు మృతి
- 17 మందికి గాయాలు



**డెహ్రాడూన్:** ప్రయాణికులతో వెళ్తున్న బస్సు అదుపుతప్పింది. లోయలోకి దూసుకెళ్లి బోల్తాపడింది. ) ఈ ప్రమాదంలో నలుగురు మరణించారు. 17 మంది గాయపడ్డారు. ఉత్తరాఖండ్‌లోని పౌరి గర్వాల్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. ప్రమాదం వార్త తెలిసిన వెంటనే పోలీసులు, అధికారులు అక్కడకు చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ఆదివారం ప్రయాణికులతో వెళ్తున్న బస్సు అదుపుతప్పి లోయలోకి దూసుకెళ్లింది. శ్రీనగర్ ప్రాంతంలోని దహల్చోరి దగ్గర కొండ దిగువన వంద మీటర్ల దూరంలో అది బోల్తాపడింది. ఈ ప్రమాదంలో నలుగురు ప్రయాణికులు మరణించారు. 17 మంది గాయపడ్డారు. కాగా, ఈ ప్రమాదం గురించి తెలిసిన వెంటనే పౌరి గర్వాల్ జిల్లా అధికారులు, పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. స్థానికులతో కలిసి సహాయక చర్యలు చేపట్టారు. గాయపడిన వారిని ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. పోలీసులు ఈ ప్రమాదంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## మోసం గురూ..!

(మొదటిపేజీ తరువాయి)

ప్రారంభించడం, అమలు చేయడం చేయరని విమర్శిస్తున్నారు. ఉదాహరణకు గత ఏడాది బడ్జెట్‌లో మోడీ ప్రభుత్వం ఉపాధి సంబంధిత మూడు ప్రోత్సాహక (ఇఎల్ఐ) పథకాలను ప్రకటించింది. వీటికి ప్రతీఏటా రూ. 10 వేల కోట్లు కేటాయిస్తామని గొప్పగా చెప్పింది. అలాగే రూ. వేయి కోట్ల వ్యయంతో వేయి ఐటిఐలను ఆధునీకరించే ప్రణాళికను అమలు చేసే ప్రాజెక్టును నైపుణ్య మంత్రిత్వ శాఖకు అప్పగించారు. అయితే ఈ పథకాలను ఇంతవరకు ప్రారంభించలేదు. అలాగే మరోవైపు కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ నూతన పథకాలకు ఉద్దేశించిన రూ 62 వేల కోట్లు మంజూరుకు మొండిగా తిరస్కరించింది. ఆ విధంగా ద్రవ్యలోటును 4.9 శాతానికి కట్టడి చేయాలని చూస్తోంది.

# కోర్టు ఆదేశాలు ధిక్కరించినా.. భార్య భరణానికి అర్హురాలే

- సుప్రీంకోర్టు స్పష్టీకరణ

**న్యూఢిల్లీ :** భార్యకు భరణం విషయంలో భారత సర్వోన్నత న్యాయస్థానం మరోక కీలక తీర్పును వెలువర్చింది. భర్తతో కాపురం చేయాలన్న కోర్టు ఆదేశాలను ధిక్కరించినా.. ఆమె భరణానికి అర్హురాలేనని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. కోర్టు ఆదేశాల ఉల్లంఘనకు మాత్రం సహేతుకమైన కారణాలు ఉండాలని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ సంజయ్ కుమార్ లతో కూడిన ద్విసభ్య ధర్మాసనం తెలిపింది.

దాంపత్య హక్కును భర్తకు పునరుద్ధరిస్తూ న్యాయస్థానం ఉత్తర్వు జారీ చేసిన తర్వాత కూడా భార్య దానిని పాటించకపోతే, మనోవర్తిని కోరే హక్కును ఆమె కోల్పోతారని గతంలో పలు హైకోర్టులు తీర్పునిచ్చిన విషయాన్ని ధర్మాసనం ఈ సందర్భంగా ప్రస్తావించింది. అటువంటి తీర్పులు సమంజసమేనని స్పష్టం చేసింది. అలాగే, కలిసి జీవించాలన్న కోర్టు ఆదేశాలను సహేతుకమైన, ప్రత్యేకమైన పరిస్థితుల్లో భార్య తిరస్కరించినప్పటికీ ఆమె మనోవర్తి హక్కుకు నేరశిక్షా స్మృతిలోని సెక్షన్ 125 భద్రత కల్పిస్తుందని సర్వోన్నత న్యాయస్థానం తీర్పునిచ్చింది. జార్ఖండ్‌కు చెందిన దంపతులకు సంబంధించిన ఒక కేసులో న్యాయస్థానం ఈ తీర్పును వెలువర్చింది.

## మినీ గోకులాలతో రైతులకు ఆర్థిక భరోసా

- మంత్రి కొలుసు పార్థసారథి

**ప్రజాశక్తి - ముసునూరు (ఏలూరు జిల్లా)**

పాడి రైతులకు ఎంతో అవసరమయ్యే గోకులాలను గత ఐదేళ్ల వైసిపి పాలనలో కేవలం 268 నిర్మిస్తే కూటమి ప్రభుత్వం కేవలం ఆరు నెలల కాలంలోనే 12,500 నిర్మించిందని, ఇది టిడిపి కూటమి ప్రభుత్వ నిబద్ధతకు నిదర్శనమని రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. ఏలూరు జిల్లా ముసునూరు మండలం సూరేపల్లి గ్రామంలో నిర్మించిన గోకులంను ఆయన ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పశు సంపదను రక్షించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం రైతులకు అండగా నిలుస్తూ 90 శాతం సబ్సిడీ అందిస్తుందన్నారు. జాతీయ ఉపాధి హామీలో భాగంగా ఈ మినీ గోకులం షెడ్లను నిర్మించారని తెలిపారు. మినీ గోకులాలతో రైతులకు ఆర్థిక బాసట, ఉపాధి లభిస్తుందని అన్నారు. కార్యక్రమంలో పలువురు రైతులు, అధికారులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## మృతుల కుటుంబాలకు రూ.కోటి చొప్పన పరిహారమివ్వాలి : రాజన్నదొర

**ప్రజాశక్తి-సాలూరు(పార్వతీపురం మన్యం జిల్లా)**

తిరుమల తొక్కిసలాటలో మృతి చెందిన వారి కుటుంబాలకు కోటి రూపాయల చొప్పున పరిహారం చెల్లించాలని మాజీ డిప్యూటీ సిఎం రాజన్నదొర డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన తన నివాసంలో విలేకరులతో మాట్లాడుతూ తిరుపతి వెంకటేశ్వరస్వామి ఆలయ పవిత్రను టిడిపి కూటమి ప్రభుత్వం మంటగలిపిందని విమర్శించారు. తిరుమల చరిత్రలో ఎన్నడూ జరగని విధంగా టిటిడి బోర్డు నిర్లక్ష్యం, ముందుచూపు లేకపోవడంతో జరిగిన తొక్కిసలాటలో ఆరుగురు దుర్మరణం పాలయ్యారని చెప్పారు. లక్షలాది మంది భక్తుల కానుకలు, చందాలతో నడుస్తోన్న టిటిడిలో కొంతకాలంగా వ్యాపారుల జోక్యం పెరిగిందన్నారు. మృతుల కుటుంబాలను కోటి రూపాయల పరిహారం చెల్లించడంతోపాటు ప్రభుత్వ ఉద్యోగాలు ఇప్పించాలని కోరారు. వైసిపి ప్రభుత్వ హయాంలో ఐదేళ్లలో టిటిడిలో ఎలాంటి అపశృతీ చోటు చేసుకోలేదన్నారు. లడ్డూ కల్తీ జరిగిందని గగ్గోలు పెట్టిన టిడిపి కూటమి నాయకులు ఇప్పుడు ఎందుకు నోరు మెదపడం లేదని ప్రశ్నించారు. కల్తీ వ్యవహారంపై విచారణ బయటపెట్టాలని, దోషులను శిక్షించాలని డిమాండ్ చేశారు. లడ్డూ కల్తీ వ్యవహారంతోనే టిటిడి పవిత్రతని కూటమి ప్రభుత్వం మంటగలిపిందని రాజన్నదొర ఆరోపించారు.

## భారత రాయబారికి బంగ్లాదేశ్ సమన్లు

**న్యూఢిల్లీ:** సరిహద్దు ఉద్రిక్తతలపై భారత హైకమిషనర్ ప్రణయ్ వర్మకు బంగ్లాదేశ్ విదేశాంగ మంత్రిత్వ శాఖ ఆదివారంనాడు సమన్లు పంపింది. దీంతో ఈ విషయంపై విదేశాంగ శాఖ కార్యదర్శి జషిమ్ ఉద్దీన్‌తో ప్రణయ్ వర్మ ఆదివారం చర్చించారు. సుమారు 45 నిమిషాల పాటు ఈ సమావేశం జరిగింది. వర్మకు సమన్లు పంపిన విషయాన్ని అధికారులు ధ్రువీకరించారు. ద్వైపాక్షిక ఒప్పందాన్ని ఉల్లంఘిస్తూ ఇండో-బంగ్లా సరిహద్దుల వెంబడి ఐదు చోట్ల ఫెన్సింగ్ నిర్మాణానికి భారత్ ప్రయత్నిస్తోందని బంగ్లాదేశ్ ఆరోపిస్తున్న నేపథ్యంలో తాజా పరిణామం చోటుచేసుకుంది. బంగ్లా విదేశాంగ కార్యదర్శితో సమావేశానంతరం వర్మ మాట్లాడుతూ, భద్రత పరంగా సరిహద్దుల వెంబడి కంచె వేసే విషయమై ఢాకా-న్యూఢిల్లీ మధ్య అవగాహన ఉందని చెప్పారు. "ఇందుకు సంబంధించి ఇరు దేశాల సరిహద్దు కాపలా సంస్థలు బీఎస్ఎఫ్, బీజీబీ (బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్, బోర్డర్ గార్డ్ బంగ్లాదేశ్) ఎప్పటికప్పుడు మాట్లాడుకుంటున్నాయి. ఆ అవగాహనను అమలు చేస్తారని, సరిహద్దుల వెంబడి నేరాలపై పోరాటానికి పరస్పరసహకార విధానం పాటిస్తారని ఆశిస్తున్నాం" అని తెలిపారు.

## అనారోగ్యంతో బాలింత మృతి

**ప్రజాశక్తి- హుకుంపేట (అల్లూరి సీతారామరాజు జిల్లా)**



మండలంలోని పట్టం పంచాయతీ గంగుడి గ్రామానికి చెందిన బాలింత సిదరి.అప్పలమ్మ మృతి చెందారు. రెండో కాన్పులో ఆమె బాబుకు జన్మనిచ్చారు. రక్తం తక్కువ ఉండడంతో శనివారం రాత్రి మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆమె మృతితో కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. పట్టం పంచాయతీలో వరుసగా గర్భిణులు, బాలింతల మరణాలతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. అధికారులు దృష్టి సారించి మరణాలకు అడ్డుకట్టు వేయాలని కోరుతున్నారు.

## టిటిడి ఇన్‌ఛార్జ్ చీఫ్ విజిలెన్స్ అండ్ సెక్యూరిటీ ఆఫీసర్‌గా మణికంఠ చందోలు

**ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్**

తిరుమల తిరుపతి దేవస్థానం ఇన్‌ఛార్జ్ చీఫ్ విజిలెన్స్ అండ్ సెక్యూరిటీ ఆఫీసర్‌గా చిత్తూరు జిల్లా ఎస్పీ విఎన్. మణికంఠ చందోలు ఆదివారం మధ్యాహ్నం తిరుపతి తిరుమల దేవస్థానం పరిపాలన భవనంలో బాధ్యతలు తీసుకున్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర డిజిపి ద్వారకా తిరుమలరావు చిత్తూరు జిల్లా ఎస్పీ విఎన్. మణికంఠ చందోలు ఇన్‌ఛార్జ్ టిటిడి చీఫ్ విజిలెన్స్ అండ్ సెక్యూరిటీ ఆఫీసర్‌గా నియమించారు.

# ఉక్కులో విఆర్ఎస్‌పై భగ్గు

- భోగి మంటల్లో ప్రతుల దహనం

**వైజాగ్ స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం స్వచ్ఛంద ఉద్యోగ విరమణ పథకాన్ని (విఆర్ఎస్) ముందుకుతెచ్చి కర్మాగారంలోని ఉద్యోగులను తొలగించే చర్యలను ఖండిస్తూ సిపిఎం ఆధ్వర్యాన విశాఖ నగరంలో సంబంధిత ఆర్డర్ ప్రతులను ఆదివారం భోగి మంటల్లో వేసి దహనం చేశారు. తక్షణమే విఆర్ఎస్ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని, లేనిపక్షంలో ఆందోళనను ఉధృతం చేస్తామని హెచ్చరించారు.**



గాజువాకలో విఆర్ఎస్ ప్రకటన ప్రతులను భోగి మంటలో వేస్తున్న లోకనాథం తదితరులు

**ప్రజాశక్తి - గాజువాక**

వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ నిర్ణయాన్ని ఉపసంహరించుకుని, కర్మాగారానికి సొంత గనులు కేటాయించాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం డిమాండ్ చేశారు. స్టీల్‌ప్లాంట్‌లో విఆర్ఎస్‌ను ముందుకు తేవడాన్ని నిరసిస్తూ సిపిఎం ఆధ్వర్యాన ఆదివారం గాజువాక జగ్గు జంక్షన్‌లో భోగి మంటలో విఆర్ఎస్ ప్రకటన ప్రతులను వేసి తగులబెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 8న విశాఖలో జరిగిన సభలో మోడీ, చంద్రబాబు, పవన్‌లు ఉక్కు విషయంపై మాట్లాడకపోవడం దారుణమన్నారు. 32 మంది ప్రాణ త్యాగాలతో ఏర్పడిన స్టీల్‌ప్లాంట్‌ను అదానీ, అంబానీ వంటి కార్పొరేట్లకు కట్టబెట్టేందుకు చూడటం అన్యాయమన్నారు. ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ రంగంలోని వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌కు గనులు కేటాయించకుండా అనకాపల్లి జిల్లా నక్కపల్లిలో ఏర్పాటు చేస్తామంటున్న ఆర్సెలార్ మిట్టల్ ప్లాంట్‌కు సొంత గనులు ఇవ్వాలని సిఎం చంద్రబాబు మోడీని కోరడం శోచనీయమన్నారు. విశాఖ ఎంపీ శ్రీభరత్ ఉక్కుపై స్పందించకపోవడం సరికాదన్నారు. చంద్రబాబు తాను మారానని అంటున్నారు తప్ప వాస్తవానికి ఆయన ఏమీ మారలేదన్నారు. మోడీకి దాసోహమవుతూ గ్రామీణ ప్రాంతాల్లో టోల్‌గేట్లు ఏర్పాటు చేసి ప్రజలకు అన్యాయం చేయాలని చూస్తున్నారన్నారు.

పార్టీ గాజువాక జోన్ కార్యదర్శి ఎం.రాంబాబు మాట్లాడుతూ స్థానిక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావును రాష్ట్రంలోనే అత్యధిక మెజార్టీతో ఇక్కడి ప్రజలు గెలిపిస్తే ఆయన స్టీల్‌ప్లాంట్‌పై అస్సలు నోరు మెదపడం లేదన్నారు. ప్రజల ఆకాంక్షలను గుర్తెరిగి ప్లాంట్ పరిరక్షణ విషయమై కూటమి ప్రభుత్వం కేంద్రంపై ఒత్తిడి తేవాలన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కెఎం.శ్రీనివాస్, స్టీల్ జోన్ కార్యదర్శి శ్రీనివాసరాజు, నాయకులు పివైవి.రమణరావు, అప్పారావు, జి.లక్ష్మి, సరోజిని, వైటి.దాస్, నారాయణ, శ్రీనివాస్, గురప్ప, వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు మరోసారి ప్రధాని మోడీ ద్రోహం చేస్తే రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సహకరించి ముగ్గురు మోసగాళ్ళుగా చరిత్రలో నిలిచిపోయారని సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డాక్టర్ బి.గంగారావు మండిపడ్డారు. ఆ ముగ్గురి వైఖరిని ఖండిస్తూ మద్దిలపాలెం కళాభారతి రోడ్డులో సిపిఎం మద్దిలపాలెం జోన్ కమిటీ ఆధ్వర్యాన నిరసన తెలిపారు. మూడు కోతులతో కూడిన మోడీ, బాబు, పవన్ పోస్టర్లను చేబూని ఉక్కు విఆర్ఎస్ ప్రకటన ప్రతులను భోగి మంటలో వేసి దహనం చేశారు.

విశాఖ స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులను బలవంతంగా తొలగించేందుకు కేంద్ర బిజెపి ప్రభుత్వం తెచ్చిన విఆర్ఎస్‌ను తక్షణమే నిలుపుదల చేయాలని సిఐటియు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్ డిమాండ్ చేశారు. జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద కొనసాగుతున్న ఉక్కు జెఎసి దీక్షా శిబిరంలో ఆదివారం విశాఖ డెయిరీ ఉద్యోగులు కూర్చున్నారు. తొలుత విఆర్ఎస్ ప్రతులను దహనం చేశారు.

## మిషన్‌లైఫ్‌లో ఎపి అగ్రగామి

- నివేదిక విడుదలలో సిఎస్ విజయానంద్

**ప్రజాశక్తి-అమరావతి బ్యూరో**



కేంద్ర విద్యుత్‌శాఖ ఆధ్వర్యాన చేపట్టిన మిషన్‌లైఫ్ అమలులో బ్యూరో ఆఫ్ ఎనర్జీ ఎఫిషియన్సీ (బిఇఇ)తో కలిసి ఆంధ్రప్రదేశ్ అగ్రగామిగా నిలుస్తోందని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె విజయానంద్ తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ఇంధన సంరక్షణ సమితి (ఎపిఎస్ఇసిఎం) సిఇఒ బివివి కుమార్‌రెడ్డితో కలిసి మిషన్‌లైఫ్ నివేదికను విడుదల చేసినట్లు బిఇఇ దక్షిణాది రాష్ట్రాల సలహాదారు ఎ చంద్రశేఖర్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటన ద్వారా తెలిపారు. వాతావరణ మార్పులను ఎదుర్కోవడంతో పాటు ఇంధన సంరక్షణలో రాష్ట్రం ముందుందని విజయానంద్ ఈ సందర్భంగా వెల్లడించారు. ఇంధన సామర్థ్య సాంకేతికతను అమలు చేయడానికి ఎంఎస్ఎంఇలకు ఆర్థిక సాయం అందించాలని బిఇఇని కోరారు. పెట్టుబడి స్థాయి ఆడిట్లు, సమగ్ర ప్రాజెక్టు నివేదికలు, అత్యాధునిక పర్యవేక్షణ వ్యవస్థలు వంటి వాటి విషయంలోనూ సాయం అందించాలని కోరారు. వాతావరణ మార్పులను సమర్థవంతంగా ఎదుర్కోవడం కోసం పర్యావరణ హిత జీవనశైలిని అలవర్చుకోవడం అత్యవసరమని పేర్కొన్నారు. అంతర్జాతీయ ప్రమాణాలతో నిరంతరాయంగా నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేయడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని, తద్వారా భారీగా పెట్టుబడులను ఆకర్షిస్తే పారిశ్రామికాభివృద్ధి అవుతుందన్నారు. ఈ లక్ష్యాలను సాధించడానికి పునరుత్పాదక ఇంధన వనరుల ప్రాజెక్టులు, విద్యుత్ ప్రాజెక్టులను నిర్దేశిత గడువుల్లోగా పూర్తిచేయాల్సిన అవసరం ఉందని ముఖ్యమంత్రి స్పష్టం చేశారని వెల్లడించారు. రవాణా, పరిశ్రమలు, భవనాలు, వ్యవసాయం, మత్స్య, పరిశ్రమ రంగాలను కీలక రంగాలుగా ఎపిఎస్ఇసిఎం గుర్తించామని, తద్వారా ఉపాధి కల్పన, ఆర్థికాభివృద్ధికి అపార అవకాశాలు ఉంటాయని పేర్కొన్నారు. ఎపిఎస్ఇసిఎం గుర్తించిన ఆయా రంగాల్లోని ప్రాజెక్టుల్లో ఇంధన సామర్థ్య కార్యక్రమాల అమలు ద్వారా 2031 నాటికి 2.85 నుంచి 3.88 మిలియన్ టన్స్ ఆఫ్ ఆయిల్ ఈక్వలెంట్ ఇంధన వినియోగాన్ని తగ్గించవచ్చని వివరించారు. కార్బన్‌డయాక్సైడ్ ఉద్గారాలు కూడా 8 నుంచి 12 మిలియన్ టన్నుల వరకు తగ్గుతాయని తెలిపారు.

## హీరో వెంకటేశ్ కుటుంబంపై కేసు నమోదు

**ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో**

సినీ నటుడు వెంకటేశ్ కుటుంబానికి భారీ షాక్ తగిలింది. దక్కన్ కిచెన్ హోటల్ కూల్చివేత వ్యవహారంలో వారిపై ఫిలింనగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాల్లోకెళ్తే.. గతంలో ఎమ్మెల్యేల కొనుగోలు అంశంలో బాధితుడైన నందకుమార్‌కు చెందిన దక్కన్ కిచెన్ హోటల్ అంశంలో దగ్గుబాటి కుటుంబంతో స్థలం వివాదం చెలరేగింది. దీంతో నందకుమార్ సిటీ సివిల్ కోర్టులో కేసు వేశారు. 2022 నవంబరులో జిహెచ్‌ఎంసి సిబ్బంది బౌన్సర్లతో కలిసి హోటల్‌ను పాక్షికంగా కూల్చి వేసింది. అయితే ఈ స్థలంలో ఎలాంటి చర్యలూ చేపట్టొద్దని హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. అయితే, ఆ ఆదేశాలను సైతం లెక్క చేయకుండా 2024 జనవరిలో హోటల్‌ను దగ్గుబాటి ఫ్యామిలీ పూర్తిగా కూల్చి వేసింది. దీంతో మళ్లీ నందకుమార్ వీరిపై కేసు నమోదు చేయాలని కోరుతూ నాంపల్లి కోర్టుకు వెళ్లాడు. ఈ మేరకు దగ్గుబాటి కుటుంబంపై కేసు నమోదు చేసి విచారణ చేయాలంటూ ఫిలిం నగర్ పోలీసులకు కోర్టు శనివారం ఆదేశాలు జారీ చేసింది. హైకోర్టు ఆదేశాలు కూడా బేఖాతరు చేస్తూ దౌర్జన్యంగా వ్యవహరించడం ఏంటని దగ్గుబాటి ఫ్యామిలీపై నాంపల్లి కోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. కోర్టు ఆదేశాల ఉల్లంఘనపై తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేసింది.ఈ మేరకు నిర్మాత సురేశ్ బాబు, నటులు వెంకటేశ్, రానా, అభిరామ్‌లపై ఫిల్మ్ నగర్ పోలీసులు 448, 452, 458, 120 బిఎస్ఎన్,సెక్షన్లపై ఎఫ్ఐఆర్ నమోదు చేసి విచారణ చేపట్టారు.

## ఉన్ని దుస్తులకు గిరాకీ

**చలి తీవ్రతతో స్థానికులు, పర్యాటకుల కొనుగోలు**

**ప్రజాశక్తి- అరకులోయ (అల్లూరి సీతారామరాజు జిల్లా)**



ఉన్ని దుస్తులు కొనుగోలు చేస్తున్న స్థానికులు, పర్యాటకులు


పర్యాటక కేంద్రమైన అరకులోయ ప్రాంతంలో రోజురోజుకూ చలి తీవ్రత పెరుగుతుండడంతో ఉన్ని దుస్తులకు గిరాకి పెరిగింది. గతంలో ఎప్పుడూ లేనంతగా జనవరి మాసంలో ఉష్ణోగ్రత తీవ్రంగా పడిపోయింది. దీంతో, ఈ ప్రాంత గిరిజనులు గజగజ వణికిపోతున్నారు. చలి నుంచి ఉపశమనం పొందేందుకు ఉన్ని దుస్తులను ఆశ్రయిస్తున్నారు. పర్యాటకులు కూడా ఉన్ని దుస్తులు కొనుగోలు చేస్తున్నారు. ఇక్కడి చలి తీవ్రతను తట్టుకోలేక పర్యాటకులు వెనుతిరుగుతున్నారు. ఉదయం 12 గంటలు అయినా చలి తీవ్రత తగ్గకపోవడంతో ఇబ్బందులు పడక తప్పడం లేదు. దీంతోపాటు కొద్దిసేపు ఎండ కాసినప్పటికీ మరల మూడు గంటల సమయం నుంచి చలిగాలులు మొదలు కావడంతో ఈ ప్రాంతంలో గజగజ వణికిపోతున్నారు. గత వారం రోజులుగా చలి తీవ్రత సింగల్ డిజిట్ కి పడి పోయింది. ఉష్ణోగ్రత పడిపోతున్న దృష్ట్యా రగ్గులు, స్వెటర్లు విక్రయదారులు అరకులోయ ప్రాంతంలో ఊరూరా తిరిగి విక్రయిస్తున్నారు. దీంతోపాటు ఒడిశాకు చెందిన వ్యాపారులు అరకులోయలో ఉన్ని దుస్తుల దుకాణాలు రోడ్లకు ఇరువైపులా పెట్టడంతో స్థానికులు, పర్యాటకులు కొనుగోలు చేస్తున్నారు. దీంతో, ఉన్ని దుస్తులకు మరింత గిరాకీ ఏర్పడింది. పర్యాటకులు మాత్రం ఈ చలిని ఆస్వాదిస్తున్నారు. ఫిబ్రవరి నెల వరకు చలి పెరుగుతూనే ఉంటుందని కొంతమంది పెద్దలు చెప్తున్నారు. చలి తీవ్రత అధికంగా ఉండడంతో పాటు, పొగ మంచు కప్పుకొని ఉండడంతో వాహన చోధకులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ద్విచక్ర వాహనదారుల పరిస్థితి వర్ణనాతీతంగా మారింది. అరకు-విశాఖ ఘాట్ రోడ్‌లో మరింతగా ఉష్ణోగ్రత పడిపోవడంతో వాహనాలు నడపడానికి ఇబ్బందులు పడవలసిన పరిస్థితి ఏర్పడుతుంది.

## విమాన టికెట్ల ధరల పెంపు!

**న్యూఢిల్లీ :** రూపాయి విలువ పడిపోవడంతో విదేశీ కరెన్సీలో ఎయిర్ ఇండియా విమాన టికెట్ల ధరలు పెరుగుతాయని కంపెనీ యాజమాన్యం తెలిపింది. ఈ నెల పదో తేదీన ఫారెక్స్ మార్కెట్‌లో అమెరికా డాలర్‌పై రూపాయి మారకం విలువ రూ.86.04లకు పతనమైంది. రూపాయి బలహీనంతో అన్ని విమానయాన సంస్థల నిర్వహణా ఖర్చులు ఎక్కువవుతాయి. రూపాయి మారకం విలువ మరింత పతనం కావడం విమానయాన పరిశ్రమకు, ఎయిర్ ఇండియాకు సవాల్‌గా పరిణమిస్తుందని సంస్థ చీఫ్ కమర్షియల్ ఆఫీసర్ నిపున్ అగర్వాల్ చెప్పారు. భారం తగ్గించుకునేందుకు ఇతర చర్యలు చేపడతామన్నారు. మరింతగా రూపాయి మారకం విలువ పతనమైతే కంపెనీ లాభాలపై ప్రభావం పడుతుందన్నారు. దేశీయంగా ఎయిర్ ఇండియా గ్రూప్ ప్రతి రోజూ 1168 విమాన సర్వీసులు నడుపుతోంది. వాటిల్లో 313 అంతర్జాతీయ విమాన సర్వీసులు ఉన్నాయి. విదేశీ విమాన సర్వీసుల్లో 244 షార్ట్ హౌల్, మిగతా 69 లాంగ్ హాల్ కేంద్రాలని తెలిపారు. ఎయిర్ ఇండియా, ఎయిర్ ఇండియా ఎక్స్ ప్రెస్ ఇటీవల విలీనమయ్యాయి. గతేడాది ఎయిర్ ఇండియాలో విస్తారా ఎయిర్ లైన్స్, ఎఐఎక్స్ కనెక్ట్ విలీనం అయ్యాయి.

## సబలెంక, జంగ్ శుభారంభం

- ఆస్ట్రేలియన్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీ



**మెల్‌బోర్న్:** ఆస్ట్రేలియన్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీ మహిళల సింగిల్స్‌లో టాప్‌సీడ్, బెలారస్‌కు చెందిన అర్యానా సబలెంకా, చైనా సంచలనం, 5వ సీడ్ జెంగ్ శుభారంభం చేశారు. ఆదివారం జరిగిన తొలిరౌండ్ పోటీలో సబలెంక 6-3, 6-2తో వరుస సెట్లలో స్టెఫెన్స్(అమెరికా)ను చిత్తు చేయగా.. జెంగ్ 7-6(7-3), 6-1తో టొడోని(రొమేనియా)పై చెమటోడ్చి నెగ్గింది. ఇతర పోటీల్లో 29వ సీడ్, చెక్ రిపబ్లిక్‌కు చెందిన నొస్కోవా, 11వ సీడ్, స్పెయిన్ సంచలనం బడోసో ప్రత్యర్థులను చిత్తుచేసి రెండోరౌండ్‌కు చేరారు.

**జ్వెరేవ్, రూఢ్ ముందుకు..**

పురుషుల సింగిల్స్‌లో 2వ సీడ్, జర్మనీకి చెందిన అలెగ్జాండర్ జ్వెరేవ్, నార్వేకు చెందిన 6వ సీడ్ కాస్పర్ రూడ్ రెండోరౌండ్‌కు దూసుకెళ్లారు. తొలిరౌండ్‌లో జ్వెరేవ్ 6-4, 6-4, 6-4తో పోలీ (ఫ్రాన్స్), రూడ్ 6-3, 1-6, 7-5, 2-6, 6-1తో స్పెయిన్‌కు చెందిన మునార్‌ను చిత్తు చేశాడు. ఇతర పోటీల్లో 14వ సీడ్ హంబర్ట్ (ఫ్రాన్స్), 20వ సీడ్, ఫ్రాన్స్‌కు చెందిన ఫిల్స్‌ను 3-6, 7-6(7-4), 6-4, 6-4తో విర్టనెన్(ఫిన్లాండ్)ను ఓడించారు.

**తొలిరౌండ్‌లోనే నాగల్ ఇంటికి..**

పురుషుల సింగిల్స్‌లో భారత సంచలనం సుమిత్ నాగల్ తొలిరౌండ్‌లోనే ఓటమిపాలయ్యాడు. ఆదివారం జరిగిన తొలిరౌండ్ పోటీలో నాగల్.. 26వ ర్యాంకర్, చెక్ రిపబ్లిక్‌కు చెందిన మఛాక్ చేతిలో ఓడాడు. ఏకపక్షంగా సాగిన ఈ మ్యాచ్‌లో నాగల్ 3-6, 1-6, 5-7తో పరాజయాన్ని విచూశాడు.

## అనంతపురంపై చిత్తూరు జట్టు విజయం

**ప్రజాశక్తి - కడప**

ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ (ఎసిఎ) అండర్-12 అంతర్ జిల్లాల క్రికెట్ టోర్నమెంట్‌లో భాగంగా చివరి రోజు ఆదివారం వైఎస్ రాజారెడ్డి ఎసిఎ స్టేడియంలో జరిగిన మ్యాచ్‌లో అనంతపురం జట్టుపై ఐదు వికెట్ల తేడాతో చిత్తూరు జట్టు ఘన విజయం సాధించింది. టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన అనంతపురం జట్టు 35 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 126 పరుగులు చేసింది. ఆ జట్టులోని హేమ చంద్ర నాయక్ 47 పరుగులు చేశాడు. చిత్తూరు జట్టులోని మోహిత్ సాయి మూడు వికెట్లు తీసుకున్నాడు. అనంతరం 127 పరుగుల విజయ లక్ష్యంతో బ్యాటింగ్‌కు దిగిన చిత్తూరు జట్టు 23.3 ఓవర్లలో ఐదు వికెట్ల నష్టానికి 130 పరుగులు చేసి ఐదు వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది.

కెఒఆర్‌ఎం క్రికెట్ మైదానంలో జరిగిన మ్యాచ్‌లో కడప పై 9 వికెట్ల తేడాతో నెల్లూరు జట్టు ఘన విజయం సాధించింది. మొదట బ్యాటింగ్ చేసిన కడప జట్టు 35 ఓవర్లలో రెండు వికెట్లు నష్టానికి 209 పరుగులు చేసింది. ఆ జట్టులోని యోగాంజనేయులు 52 పరుగులు చేశాడు. నెల్లూరు జట్టులోని సమీర్ ఒక వికెట్ తీసుకున్నాడు. అనంతరం 210 పరుగుల విజయ లక్ష్యంతో బ్యాటింగ్‌కు దిగిన నెల్లూరు జట్టు 34.1 ఓవర్లలో ఒక వికెట్ నష్టానికి 210 పరుగులు చేసి 9 వికెట్ల తేడాతో విజయం సాధించింది. ఆ జట్టులోని మౌనిష్ 96, సోహన్ లతీక్ 58 పరుగులు చేశారు. కడప జట్టులోని తాహీర్ ఒక వికెట్ తీసుకున్నాడు.

## విద్యార్థుల రాజకీయ ప్రవేశం చారిత్రాత్మక అవసరం

- సిద్ధాంతపర భావజాలం లేని వారే పార్టీలు మారుతున్నారు
- విద్యార్థి ఉద్యమాలతోనే ప్రజాసమస్యలకు పరిష్కారం
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి




ప్రసంగిస్తున్న తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

**ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో**

విద్యార్థులు రాజకీయాల్లోకి రావాల్సిన చారిత్రాత్మక అవసరం ఆసన్నమైందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. విద్యార్థి సంఘాల పోరాటం వల్లే ప్రజాసమస్యలు చాలా వరకూ పరిష్కారమయ్యాయని, తెలంగాణ రాష్ట్ర సాధనకు విద్యార్థి ఉద్యమాలే కీలకమయ్యాయని వివరించారు. విద్యార్థి నాయకులే తెలంగాణ ఉద్యమంలో క్రియాశీలకంగా పనిచేశారన్నారు. మాజీ గవర్నర్ చెన్నమనేని విద్యాసాగర్‌రావు రచించిన 'ఉనిక' పుస్తకాన్ని ఆదివారం హైదరాబాద్‌లో సిఎం రేవంత్ రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. యూనివర్సిటీలకు గత వైభవం తీసుకొచ్చేందుకు క్రియాశీలక అధ్యాపకులను వైస్‌ఛాన్స్‌లర్లగా నియమించామని తెలిపారు. గతంలో రాజకీయాల్లోకి విద్యార్థి ఉద్యమ నేపథ్యం ఉన్న నాయకులు వచ్చేవారని, రానురాను అది తగ్గిపోయిందన్నారు. సిద్ధాంతపరమైన భావజాలం లేనివారు రాజకీయాల్లోకి వచ్చి, ఏదో విధంగా ఏదోఒక పార్టీ నుంచి పదవి వస్తే చాలు అనుకుంటున్నారని పేర్కొన్నారు. అధికారం ఉన్నా, లేకున్నా నమ్మిన సిద్ధాంతం కోసం జీవితాన్ని త్యాగం చేసిన విద్యార్థి ఉద్యమ రాజకీయ నాయకులెందరో ఉన్నారని సిఎం గుర్తు చేశారు. అటువంటి విద్యార్థి రాజకీయాలను తెలంగాణలో పునరుద్ధరించాల్సిన బాధ్యత మనందరిపై ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ, ఒడిశా గవర్నర్ కె హరిబాబు, కేంద్ర మంత్రి బండి సంజయ్, రాష్ట్ర మంత్రులు శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, కేంద్ర మాజీ మంత్రి టి సుబ్బరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## బాలుడి కిడ్నాప్ కథ సుఖాంతం

- గుట్టు రట్టు అవుతుందని తల్లిదండ్రుల ఇంటి వద్దే వదిలి వెళ్లిన దుండగులు
- నిందితుల కోసం గాలింపు

**ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్**

గత నెల 20న కర్నూలు నాలుగో పట్టణ పోలీసుల స్టేషన్ పరిధిలో కిడ్నాప్‌నకు గురైన బాలుడి కథ ఎట్టకేలకు సుఖాంతమైందని, బాలుడు క్షేమంగా లభించాడని కర్నూలు ఎస్పి జి.బిందుమాధవ్ తెలిపారు. కర్నూలు టౌన్ డిఎస్‌పి జె.బాబుప్రసాద్ సమక్షంలో పోలీసుల స్టేషన్‌లో బాలుడిని తల్లిదండ్రులకు అప్పగించారు. బాలుడి కిడ్నాప్ కేసు వివరాలను ఎస్‌పి జి.బిందుమాధవ్ ఆదివారం మీడియాకు వెల్లడించారు. ఎస్‌పి తెలిపిన వివరాల ప్రకారం.. ఢిల్లీ నుండి వచ్చిన అజిత్ రాథోడ్, ఆయన భార్య ఆశా, తన పిల్లలతో కలిసి కర్నూలు-కోడుమూర్ శివార్లలో గుడిసెలు వేసుకొని ఉంటున్నారు. రోడ్డుపై పిల్లల బొమ్మలు అమ్ముకుంటూ జీవనం సాగిస్తున్నారు. గత నెల 20న అర్ధరాత్రి గుడిసెలో నిద్రిస్తుండగా 8 నెలల ఆకాష్ రాథోడ్‌ను గుర్తు తెలియని వ్యక్తులు కిడ్నాప్ చేశారు. దీంతో బాలుడి తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. డిఎస్‌పి జె.బాబుప్రసాద్ ఆధ్వర్యంలో పోలీసులు బృందాలుగా ఏర్పడి విస్తృతంగా గాలింపు చర్యలు చేపట్టారు. అన్ని ప్రాంతాల్లోని సిసి కెమెరాలను పరిశీలించారు. అనుమానిత మొబైల్ నెంబర్లను సేకరించి విచారించారు. అనుమానిత వ్యక్తులను తనిఖీలు చేశారు. కర్నూలు జిల్లాతోపాటు కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల్లో కూడా గాలింపు చర్యలు చేపట్టారు. కిడ్నాప్‌నకు గురైన బాలుడు పోలీసు చర్యల ఫలితంగా శనివారం రాత్రి సుమారు 11 గంటల ప్రాంతంలో తల్లిదండ్రులు ఉండే ఇంటికి దగ్గరలో క్షేమంగా కనిపించాడు. తమ గుట్టు బయటపడుతుందనే భయంతో బాలుడిని వదిలి పారిపోయి ఉంటారని పోలీసులు భావిస్తున్నారు. నిందితుల కోసం తీవ్రంగా గాలింపు చర్యలు చేపట్టినట్లు ఎస్‌పి తెలిపారు. నిందితులను త్వరలోనే పట్టుకుంటామని చెప్పారు. బాలుడి క్షేమంగా అప్పగించడం పట్ల తల్లిదండ్రులు, బంధువులు సంతోషం వ్యక్తం చేస్తూ పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.

## యువకుడి అదృశ్యంపై ముమ్మరంగా దర్యాప్తు

- జాగిలంతో గ్రామంలో పరిశీలన
- దొరకని ఆచూకీ
- కాల్‌డేటాపై దృష్టి సారించనున్న పోలీసులు



యువకుడి దుస్తుల వాసన చూస్తున్న పోలీసు జాగిలం

**ప్రజాశక్తి- భోగాపురం (విజయనగరం జిల్లా)**

విజయనగరం జిల్లా భోగాపురం మండలంలోని తీరప్రాంత గ్రామమైన చినకొండ్రాజుపాలెం గ్రామానికి చెందిన యువకుడి అదృశ్యంపై పోలీసులు ముమ్మరంగా దర్యాప్తు చేస్తున్నారు. ఈ నెల ఒకటో తేదీ రాత్రి నుంచి గ్రామానికి చెందిన గనగళ్ల దానయ్య అదృశ్యమయ్యారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు అందడంతో ముమ్మరంగా దర్యాప్తు చేస్తున్నారు. ఆదివారం పోలీసు జాగిలాన్ని రప్పించి గ్రామానికి తీసుకువెళ్లారు. దానయ్య దుస్తుల వాసన చూసిన జాగిలం.. యువకుడి ఇంటి నుంచి నేరుగా పక్కనే ఉన్న ఆయన అత్తగారి ఊరైన చోడిపిల్లిపేట వెళ్లింది. ఆ గ్రామంలో రెండు మూడు వీధులు తిరిగి అనంతరం తోటలో మద్యం సీసాలు ఉన్నచోట ఆగింది. దీంతో అక్కడ మద్యం సేవించినట్లు పోలీసులు గుర్తించారు. అక్కడ నుంచి మళ్లీ యువకుడి ఇంటికి వెళ్లింది. ఇంట్లో వంటగదికి వెళ్లి అక్కడ నుంచి బీరువా ఉన్న చోటకు వెళ్లడంతో పోలీసులు బీరువాను క్లూస్ కోసం తనిఖీ చేశారు. అనంతరం రోడ్డుపైకి వచ్చి ఆగిపోయింది. కానీ, ఎటువంటి ఆధారాలూ పోలీసులకు చిక్కలేదు. ఎందుకంటే? ఇక్కడ నుంచి ఆ రోజు వచ్చిన బైక్‌లపై వెళ్లి ఉండవచ్చని భావిస్తున్నారు. ఆ యువకుడు గతంలో వాడిన ఫోన్ నెంబర్ల కాల్‌డేటా ద్వారా విశ్లేషించనున్నారు. ఆయన ఎక్కువగా గతంలో ఏయే నెంబర్లకు మాట్లాడరనే దానిపై విచారణ సాగించేందుకు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే కొంతమందిని పోలీసులు విచారణ చేస్తున్నారు. కానీ, ఎటువంటి ఆధారాలూ దొరకడం లేదు. దీనిపై ఎస్ఐ పాపారావు మాట్లాడుతూ యువకుడి అదృశ్యంపై ఇంకా లోతుగా దర్యాప్తు చేస్తామని తెలిపారు.

## బిడ్డలతో తల్లి ఆత్మహత్యాయత్నం

- చిన్నారులు మృతి
- తల్లిని కాపాడిన స్థానికులు

**ప్రజాశక్తి- సదుం**

అత్తతో గొడవపడి చంటి బిడ్డలను ఓ తల్లి ఉరివేసి చంపిన సంఘటన ఆదివారం చిత్తూరు జిల్లా సదుం మండలంలో చోటుచేసుకుంది. స్థానిక ఎస్ఐ షేక్‌షావలి తెలిపిన మేరకు వివరాల మేరకు.. సదుం టౌన్ మసీదు వీధిలో కాపురం ఉంటున్న షేక్ మన్సూర్ భార్య షేక్ కరిష్మా (27) ఆదివారం సాయంత్రం 4 గంటల సమయంలో అత్త గవహర్‌జాన్‌తో గొడవపడింది. అత్తపై కోపంతో తన ఇద్దరు ఆడపిల్లలను తీసుకొని ఇంటి మిద్దెపైన ఉన్న గదిలోకి వెళ్లి గడి పెట్టుకుంది. పిల్లలు షేక్ షిర్ధా(2), షేక్ జర ఫాతిమా(1)లకు వైర్‌తో ఉరివేసింది అనంతరం తన మెడకు ఉరివేసుకుని చనిపోయే ప్రయత్నం చేసింది. కానీ చుట్టుపక్కల వారు గమనించి కరిష్మాను కాపడగా, ఇద్దరు చిన్నారు అప్పటికే మరణించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

# సమాఖ్యవాదానికి దెబ్బ

- డబ్బును ఆదా చేయదు.. జిడిపిని మెరుగుపర్చదు • బిజెపి వాదనలన్నీ వట్టి మాటలే
- ఇదంతా మోడీ నియంతృత్వ పోకడల్లో భాగం • 'ఒకే దేశం-ఒకే ఎన్నిక'పై రాజకీయ విశ్లేషకులు, మేధావులు

**న్యూఢిల్లీ :** దేశంలో వివాదాస్పద జమిలీ ఎన్నికలపై మోడీ సర్కారు ప్రత్యేక దృష్టిని సారించింది. తామనుకున్న 'ఒకే దేశం, ఒకే ఎన్నిక'ను ఎలాగైనా అమలు చేయాలని చూస్తున్నది. ఇందులో భాగంగా గత పార్లమెంటు శీతాకాల సమావేశాల్లో దీనికి సంబంధించిన బిల్లును అనూహ్యంగా సభలోకి తీసుకొచ్చింది. దీనిపై కాంగ్రెస్, సిపిఎం సహా పలు ప్రతిపక్ష పార్టీలు తీవ్రంగా వ్యతిరేకించాయి. చివరకు, జమిలీ ఎన్నికలకు సంబంధించిన బిల్లులు జాయింట్ పార్లమెంటరీ కమిటీ (జెపిసి)కి వెళ్లాయి. ఇటీవలే జెపిసి తొలి సమావేశం కూడా వాడీవేడిగా జరిగింది. ప్రతిపక్ష సభ్యులు 'ఒకేదేశం, ఒకే ఎన్నిక'ను వ్యతిరేకిస్తూ తమ అభిప్రాయాలు చెప్పారు. ఇది సమాఖ్య స్ఫూర్తికి విఘాతం కలిగిస్తుందన్నారు. అధికారిక ఎన్డీఏ పక్షం ఎంపీలు మాత్రం బిల్లులను సమర్థించారు.

జమిలీపై కేంద్రం ప్రధానంగా వినిపిస్తున్న మాట.. నిరంతర ఎన్నికలతో అభివృద్ధికి ఆటంకం, ఎన్నికల ఖర్చు. ఈ ఎన్నికల చక్రాన్ని నిరంతరం కాకుండా.. దేశమంతటా ఒకేసారి నిర్వహిస్తే భారత జిడిపి కూడా మెరుగుపడే అవకాశమున్నదని బిజెపి, దాని అనుబంధ సంఘాల నాయకులు, ఎన్‌డిఎలోని పార్టీలు వాదిస్తున్న మాట. అయితే, ఈ మాటలను మాత్రం రాజకీయ విశ్లేషకులు, నిపుణులు, మేధావులు కొట్టి పారేస్తున్నారు. జమిలీ ఎన్నికలతో అద్భుతాలేవీ జరగవని అంటున్నారు. బిజెపి చెప్తున్నట్టుగా డబ్బును ఆదా చేయటం, జిడిపిని మెరుగుపర్చటం వంటిది జరగదని చెప్తున్నారు. పైగా దేశ సమాఖ్య విధానానికి ఇది విఘాతం కలిగిస్తుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

పలు దేశాల్లో చోటు చేసుకున్న నియంతృత్వ పోకడలను అనుసరించటానికి మోడీ ప్రయత్నిస్తున్నారని అంటున్నారు. ఇందులో భాగంగానే, లోక్‌సభ, రాష్ట్ర అసెంబ్లీలకు ఒకేసారి ఎన్నికలు అనే ఒక వ్యూహాన్ని



ఎంచుకున్నారని చెప్తున్నారు. ఈ ప్రతిపాదనను అమలుకు అవసరమైన రాజ్యాంగ సవరణలను సిఫారసు చేయడానికి భారత మాజీ రాష్ట్రపతి రామ్ నాథ్ కోవింద్ చైర్మెన్‌గా ఒక కమిటీని నియమించారు. లోక్‌సభ ఎన్నికలకు చాలా ముందుగానే గత మార్చిలో ఇది నివేదికను సమర్పించిన విషయం విదితమే.

గత 18వ సార్వత్రిక ఎన్నికల్లో 'చార్‌సౌ పార్' నినాదంతో మోడీ ముందుకెళ్లారు. లోక్‌సభ ఎన్నికల్లో 400 సీట్లు గెలుచుకోవాలని మోడీ ప్రభుత్వం కలలు కంటున్న సమయంలో ఇది జరిగింది. ఏకకాల ఎన్నికలను ప్రవేశపెట్టడానికి కావాల్సిన రాజ్యాంగ సవరణలకు అవసరమైన మూడింట రెండు వంతుల మెజారిటీ కంటే 400 సీట్లు అనేది ఎక్కువ. దాదాపు నాలుగింటా మూడో వంతు అన్నమాట. ఒకవేళ అదేగనక జరిగి ఉంటే, మోడీని దేశంలో తిరుగులేని ప్రధానిగా మార్చి ఉండేదనీ, జమిలీకి మార్గం సుమగమమయ్యేదని రాజకీయ విశ్లేషకులు చెప్తున్నారు. ఇంతటి అఖండమైన మెజారిటీ లభించి ఉంటే, మోడీ-షా ద్వయానికి సంపూర్ణ అధికారాలు పొందేవారని అంటున్నారు. అయితే, మోడీకి చార్ సౌ పార్ నినాదం బెడిసి కొట్టటంతో జమిలీ అనే ప్రయత్నానికి స్పీడ్ బ్రేకులు పడ్డాయని చెప్తున్నారు.

2019లో లోక్‌సభ ఎన్నికల విజయం తర్వాత, బిజెపి నాయకులు జమ్మూ కాశ్మీర్ రాష్ట్ర విభజన, ఆర్టికల్ 370 రద్దు బిల్లు వంటి విషయాల్లో మోడీ సర్కారు ఏకపక్షంగా వ్యవహరించిన విధానాన్ని వారు గుర్తు చేస్తున్నారు. ఆగస్టు 5, 2019న పార్లమెంటులో ప్రవేశపెట్టడానికి 90 నిమిషాల ముందు కేంద్ర మంత్రివర్గానికి బిల్లుల గురించి సమాచారం అందింది. బిల్లుల గురించి నలుగురికి మాత్రమే తెలుసు. సీనియర్ మంత్రి అయిన రాజ్‌నాథ్ సింగ్‌కు కూడా అది తెలియకపోవటం గమనార్హం. ఎన్డీఏ మిత్రపక్షాలలో ఎవరికీ బిల్లుల గురించి తెలియదని జెడియు నాయకుడు కెసి త్యాగి తెలిపారు.

లోక్‌సభలోని 303 మంది ఎంపీల మద్దతుతో మోడీ-షా అత్యంత రహస్యంగా 'ఆపరేషన్ కాశ్మీర్' వంటి రాజకీయ సాహసాలను చేపట్టగలిగితే, '400 పార్'తో ఎన్‌డిఎ నియంతృత్వాన్ని అమలు చేసి ఉండేదని రాజకీయ విశ్లేషకులు చెప్తున్నారు. ఎన్నికలలో ఎదురుదెబ్బ తగిలినప్పటికీ, మోడీ-షా ద్వయం కోవింద్ ప్యానెల్ నివేదికను ముందుకు తీసుకెళ్లడానికి ప్రయత్నించటానికి కారణం.. అధికార దాహమేననీ, అధ్యక్ష తరహా విధానాన్ని తీసుకొచ్చే చర్యలో భాగమేనని అంటున్నారు.

జమిలీ ఎన్నికలపై ఇప్పటికే పలు అనుమానాలు ఉన్నాయి. కేంద్ర మాజీ ఆర్థిక మంత్రి సైతం ఇవే అనుమానాలను వ్యక్తం చేశారు. లోక్‌సభ, అసెంబ్లీలు రద్దయితే.. వాటి కాలాన్ని ఎలా సర్దుబాటు చేస్తారన్నదాని పైనా సందేహాలున్నాయి. ఇది ఒక అసాధారణ పరిస్థితిని సృష్టిస్తుందనీ, ప్రతిపక్ష ముఖ్యమంత్రులు, వారి ఎమ్మెల్యేలపై కేంద్రంలో ప్రస్తుత బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న ఆపరేషన్.. భవిష్యత్తులో కొనసాగే ప్రమాదమున్నదని హెచ్చరిస్తున్నారు. "ఏకకాల ఎన్నికల వల్ల మరొక తీవ్ర హానికరమైన పరిణామం ఉన్నది. రెండు సంవత్సరాల తర్వాత ఒక రాష్ట్ర ప్రభుత్వం పడిపోయినప్పుడు, ఎమ్మెల్యేలు మిగిలిన మూడు సంవత్సరాలు రద్దు, పదవిని కోల్పోకుండా ఉండటానికి తీవ్రంగా ప్రయత్నిస్తారు. ఫలితంగా, ఇది సామూహిక ఫిరాయింపులు, ఎమ్మెల్యేల కొనుగోళ్లకు దారి తీస్తుంది" అని రాజకీయ విశ్లేషకులు చెప్తున్నారు. 'లోక్‌సభ, రాష్ట్ర అసెంబ్లీలు, 250,000 కంటే ఎక్కువ గ్రామ పంచాయతీలను ప్రతి ఐదు సంవత్సరాలకు ఒకసారి కలిపి ప్రచారం చేయడం వల్ల ప్రజాస్వామ్యం ప్రధానమంత్రిపై ప్రజాభిప్రాయ సేకరణగా మారుతుంది. ఇది సమాఖ్యవాదాన్ని బలహీనపరుస్తుంది. వ్యక్తిగత రాష్ట్రాల ప్రయోజనాలను ప్రధానమంత్రి ప్రయోజనాలతో సమానం చేస్తుంది" అని అంటున్నారు. ప్రతిపాదిత వన్ నేషన్ వన్ ఎలక్షన్ అనేది ఎన్నికల హామీల నుంచి దృష్టిని మరల్చే చర్యగా అభివర్ణిస్తున్నారు. నిరంతర ఎన్నికల ప్రక్రియ అనేది అభివృద్ధికి ఆటంకం కలిగిస్తుందన్న వాదన తప్పని అంటున్నారు. కొన్ని రాష్ట్రాలకు అసెంబ్లీ ఎన్నికలు జరిగినప్పుడు, ఎన్నికల సంఘం విధించే మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ (ఎంసిసి) ఆ రాష్ట్రాలకే పరిమితం అవుతుంది. దేశంలోని మిగిలిన ప్రాంతాలు ప్రభుత్వ కార్యక్రమాలతో ముందుకు సాగవచ్చని విశ్లేషకులు చెప్తున్నారు.

ఏకకాల ఎన్నికలను సమర్థించడంలో ఉన్న మరొక వాదన.. ఇది 'ఆర్థికంగా సమర్థవంతమైనది'. 2019 నుంచి ఐదేండ్లలో కేంద్రం చేసిన మొత్తం ఖర్చు రూ. 37.35 లక్షల కోట్లు. ఇందులో 0.09శాతం మాత్రమే ఎన్నికలకు వెచ్చించింది. ఇది 80 కేంద్ర పథకాలపై ఖర్చు చేసే దానికంటే చాలా తక్కువని గణాంకాలు చెప్తున్నాయి. ప్రజాస్వామ్య, సమాఖ్య స్ఫూర్తికి విఘాతం కలిగిస్తూ తీసుకొచ్చే ప్రక్రియే 'ఒకేదేశం-ఒకే ఎన్నిక' అని రాజకీయ విశ్లేషకులు, మేధావులు, నిపుణులు అంటున్నారు.

## దళిత బాలికపై దారుణం

- 28 మంది అరెస్టు

**తిరువనంతపురం :** కేరళలోని పతనం తిట్టలో దారుణం చోటుచేసుకుంది. ఒక దళిత బాలికను దాదాపు 60 మంది పైగా దుండగులు అఘాయిత్యాలకు పాల్పడిన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ దుండగులంతా సమీప బంధువులు, తండ్రి స్నేహితులు, ఆమె సహచరులే కావడంతో ఇన్నేళ్లుగా ఆమె నోరు మెదపలేకపోయింది. ఇలాంటి నిస్సాయక మహిళల కోసం స్వయం సహాయక సంఘాల వేదిక (కుడుంబశ్రీ) నిర్వహించే 'స్నేహిత' కౌన్సిలింగ్ ద్వారా ఈ దారుణం వెలుగులోకి వచ్చింది. రాష్ట్ర మహిళా కమిషన్ ఈ కేసును సుమోటోగా స్వీకరించి విచారణ జరుపుతోంది. ఈ దారుణాన్ని తీవ్రంగా పరిగణించిన రాష్ట్ర ప్రభుత్వం డిఐజి అజితా బేగం నేతృత్వంలో 25 మంది అధికారులతో ప్రత్యేక దర్యాప్తు బందాన్ని ఏర్పాటు చేసింది. పతనంతిట్ట డిఎస్‌పి ఎస్ నందకుమార్ విచారణ అధికారిగా నియమితులయ్యారు. ఈ కేసులో ఆదివారం 8 మంది నిందితులను అరెస్టు చేశామని, దీంతో ఇప్పటి వరకు అరెస్టయినవారి సంఖ్య 28కి చేరిందని పోలీసులు ఆదివారం తెలిపారు. విదేశాల్లో ఉన్న నిందితుల కోసం లుకౌట్ నోటీసులు జారీ చేయనున్నట్లు పేర్కొన్నారు. అరెస్టు అయినవారిలో మైనర్లు కూడా ఉన్నారు. ప్రస్తుతం 18 ఏళ్ల వయస్సున్న బాధిత బాలిక 'స్నేహిత' కౌన్సిలింగ్‌లో తాను ఎదుర్కొన్న లైంగిక వేధింపులను వెల్లడించింది. ఆ వివరాల ప్రకారం..13 సంవత్సరాల వయస్సులో ఉన్నప్పటి నుంచి వేధింపులు ఎదుర్కొంటోంది. సహవిద్యార్థి సుబిన్, అతని మిత్రులు తొలుత నమ్మించి పలుమార్లు అత్యాచారానికి పాల్పడ్డారు. బాలికకు 16 ఏళ్ల వయస్సు ఉన్నప్పుడు బైక్‌పై తీసుకెళ్లి ఇంటికి సమీపంలోని అచ్చంకోటుమల సమీపంలోని రబ్బరు తోటలో అత్యాచారం చేశాడు. ఆ దశ్యాలను ఫోన్‌లో బంధించి స్నేహితులకు పంపాడుతా తర్వాత స్నేహితులతో అతను కలిసి బాలికపై సామూహిక అత్యాచారం చేశారు. ఈ దారుణంగా గురించి తెలుసుకున్న ఆమె తండ్రి స్నేహితులు కూడా బాలికను బెదిరింపులకు గురి చేసి పలు ప్రాంతాలకు తీసుకెళ్లి అఘాయిత్యానికి పాల్పడ్డారు. ఈ నేపథ్యంలో బాలిక, ఆమె తల్లి రక్షణ కోసం ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు డిఐజి అజితాబేగం తెలిపారు. మహిళా ఎస్ఐని లైజన్ ఆఫీసర్‌గా నియమించారు. బాధితకు కౌన్సెలింగ్‌తో సహా నిపుణుల చికిత్స అవసరముందని, ఈ మేరకు ఏర్పాట్లు చేస్తున్నామని అజితా పేర్కొన్నారు.

## పౌర్ణమి రోజుల్లో గర్భధారణ వద్దు..!

- మధ్యప్రదేశ్‌లో విద్యార్థులకు మహిళా డిఐజి మూఢత్వ సలహాలు

**భోపాల్ :** మధ్యప్రదేశ్‌లో మహిళా డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ (డిఐజి) సవితా సోహన్ విద్యార్థులకు ఇచ్చిన మూఢత్వ సలహాలపై తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోంది. గతేడాది అక్టోబరు 4న షాహ్డోల్ జిల్లాలోని ఒక ప్రయివేటు పాఠశాల్లో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. హిందూ మత పెద్దల ప్రసంగాలతో ప్రేరణ పొంది తాను ఈ విలువైన సలహాలనిస్తున్నానని, అందరూ గుర్తుపెట్టుకోవాలని ఆమె చెప్పడం గమనార్హం. ఇందుకు సంబంధించిన వీడియో వెలుగులోకి రావడంతో ఆమెపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఆ వీడియోలో ఇలా ఉంది. 'తెలివైన పిల్లలు' కోసం ఎప్పుడు గర్భదారణ చేయాలో, ఎప్పుడు చేయకూడదో అంటూ ఆమె విపరీత ధోరణితో ఉచిత సలహాలు ఇచ్చారు. నిండు పున్నమి రోజుల్లో గర్భదారణ జరగరాదని ఆమె పేర్కొన్నారు. 'మీరు భూమిపైకి కొత్త తరాన్ని, తెలివైన పిల్లలని తీసుకువస్తారు. ఇందుకోసం మీరేం చేయాలి? ఇందుకు ప్రణాళిక అవసరం. మొదటి విషయం గుర్తుపెట్టుకోండి. పౌర్ణమి రోజుల్లో గర్భధారణ వద్దు. అలాగే తెలివైన పిల్లల కోసం సూర్యని ముందు విల్లులా వంగుతూ నమస్కారం చేయాలి. నీళ్ల సమర్పించాలి' అని ఆమె మూఢత్వంతో కూడిన ప్రేలాపనలు చేశారు. పిల్లలు, గర్భదారణ గురించి ఇలా ఉచిత సలహాలు ఇచ్చిన సదరు డిఐజి అవివాహిత కావడం విశేషం. పైగా ఇవన్నీ 10, 12 తరగతుల పిల్లలకు చెప్పే మాటలేనా అంటూ అక్కడి ఉపాధ్యాయులు విస్మయానికి గురయ్యారు. ఇప్పుడు వీడియో వైరల్ కావడంతో సర్వత్రా డిఐజి తీరుపై విమర్శలు వస్తున్నాయి.

**డిఐజికి మానసిక చికిత్స అవసరం : సిపిఎం**

మహిళా డిఐజి సవితా సోహన్ వ్యాఖ్యలను సిపిఎం మధ్యప్రదేశ్ రాష్ట్ర కార్యదర్శి జస్వీందర్ సింగ్ తీవ్రంగా ఖండించారు. సవితాను వెంటనే పదవి నుంచి తొలగించి, మానసిక చికిత్సకు పంపాలని డిమాండ్ చేశారు. లైంగిక ఆరోగ్యంపై ఈ మహిళా అధికారి చేసిన వ్యాఖ్యలు విశ్వాసం లేనవి, మూఢ నమ్మకాలు, తప్పుడు సమాచారం కలిగినవి అని విమర్శించారు. బిజెపి ప్రభుత్వ పెద్దల మెప్పు పొందడానికి కొందరు అధికారులు ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నారని, డిఐజి వ్యాఖ్యలు కూడా ఇందులో భాగమేనని పేర్కొన్నారు.




## సిపిఎం గుజరాత్ రాష్ట్ర కార్యదర్శిగా హెచ్.ఐ భట్

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

సిపిఎం గుజరాత్ రాష్ట్ర కార్యదర్శిగా హెచ్.ఐ భట్ ఎన్నికయ్యారు. 30 మందితో రాష్ట్ర నూతన కమిటీ ఎన్నికయింది. అందులో 9 మందితో రాష్ట్ర కార్యదర్శి వర్గం ఎన్నికయింది. రాజ్‌కోట్ జిల్లాలోని ఉప్లేటాలో రెండు రోజుల పాటు జరిగిన 24వ సిపిఎం గుజరాత్ రాష్ట్ర మహాసభ ఆదివారం ముగిసింది. ఈ మహాసభకు సిపిఎం పొలిట్ బ్యూరో సభ్యులు అశోక్ దావలే, కేంద్ర కమిటీ సభ్యుడు మురళీధరన్ హాజరయ్యారు. మహాసభకు పది జిల్లాల నుంచి 192 మంది ప్రతినిధులు హాజరయ్యారు. నివేదికను రెండు భాగాలుగా ప్రవేశపెట్టారు. రాష్ట్ర కార్యదర్శి హెచ్.ఐ భట్ రాజకీయ భాగాన్ని, కేంద్ర కమిటీ సభ్యుడు అరుణ్ మెహతా సంస్థాగత భాగాన్ని ప్రవేశపెట్టారు. మొదటి భాగంపై 24 మంది ప్రతినిధులు, రెండో భాగంపై 17 మంది ప్రతినిధులు చర్చల్లో పాల్గొన్నారు. నివేదికను ఏకగ్రీవంగా ఆమోదించారు. అలాగే కీలక అంశాలపై 12 తీర్మానాలు కూడా ఆమోదించారు. రాష్ట్ర మాజీ కార్యదర్శి సుబోధ్ మెహతా "కమ్యూనిస్ట్ భావజాలం" పేరుతో గుజరాతీలో రాసిన బుక్‌లెట్ కొత్త ఎడిషన్ విడుదల చేశారు. సిపిఎం పొలిట్ బ్యూరో సభ్యులు అశోక్ ధావలే మాట్లాడుతూ అంతర్జాతీయంగా సామ్రాజ్యవాదం, జియోనిజం ప్రమాదం గురించి మాట్లాడారు. అలాగే జాతీయ రంగంలో నయా ఫాసిస్ట్ ఆర్ఎస్ఎస్, బిజెపి దాడి గురించి ఆయన నొక్కి చెప్పారు. అన్ని లౌకిక శక్తుల ఐక్యత అవసరాన్ని ప్రస్తావిస్తూనే సిపిఎం స్వతంత్ర బలం, బలోపేతం చేయడం ప్రాముఖ్యతను కూడా ఆయన స్పష్టం చేశారు.

## సిపిఎం జార్ఖండ్ రాష్ట్ర కార్యదర్శిగా ప్రకాష్ విప్లవ్ ఎన్నిక

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో



సిపిఎం జార్ఖండ్ రాష్ట్ర కార్యదర్శిగా ప్రకాష్ విప్లవ్ ఎన్నికయ్యారు. 35 మందితో రాష్ట్ర నూతన కమిటీ ఎన్నికయింది. అందులో 11 మందితో రాష్ట్ర కార్యదర్శి వర్గం ఎన్నికున్నారు. రాంచీ నామ్‌కుమ్‌లో మూడు రోజుల పాటు జరిగిన 8వ సిపిఎం జార్ఖండ్ రాష్ట్ర మహాసభ శనివారం ముగిసింది. ఈ మహాసభకు సిపిఎం పొలిట్ బ్యూరో సభ్యులు బృందా కరత్, రామచంద్రడోమ్ హాజరయ్యారు. రాష్ట్ర కార్యదర్శి ప్రకాష్ విప్లవ్ రాజకీయ, నిర్మాణ నివేదికను ప్రవేశపెట్టారు. ఈ నివేదికపై ప్రతినిధులు చర్చించి ఏకగ్రీవంగా ఆమోదించారు. పార్టీ క్షేత్రస్థాయి బలోపేతం, ప్రజా సమస్యలపై పోరాటాన్ని తీవ్రతరం చేయాలని పిలుపునిస్తూ ముగిసింది. ఈ సందర్భంగా బృందా కరత్ మాట్లాడుతూ కేంద్రంలోని మోడీ సర్కార్ అవలంభిస్తోన్న కార్పొరేట్, హిందూత్వ బంధాన్ని వివరించారు. పోరాడి సాధించుకున్న అటవీ హక్కుల చట్టాన్ని మోడీ సర్కార్ నిర్వీర్యం చేసేందుకు ప్రయత్నిస్తోందని, ఇది గిరిజనులను తమ భూములను నుంచి దూరం చేయడమేనని స్పష్టం చేశారు. ఈ విధానాలపై పోరాటాలకు గిరిజనులను ఏకం చేయాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పారు. అటవీ భూములను కార్పొరేట్ కంపెనీలకు ధారాదత్తం చేస్తున్నారని, సహజ వనరులను అప్పన్నంగా దోచి పెడుతున్నారని ధ్వజమెత్తారు. రామచంద్రడోమ్ మాట్లాడుతూ పార్టీని క్షేత్రస్థాయి నుంచి బలోపేతం చేయాలని సూచించారు. గిరిజనులను ఐక్యం చేయాలని, మోడీ సర్కార్ ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటాలు చేయాలని తెలిపారు.

## ఇజ్రాయిల్ దాడులతో గాజా విద్యావ్యవస్థ నిర్వీర్యం

- నోబెల్ శాంతి బహుమతి గ్రహీత మలాలా



**ఇస్లామాబాద్ :** గాజాలో మొత్తం విద్యావ్యవస్థను ఇజ్రాయిల్ నిర్వీర్యం చేసిందని నోబెల్ శాంతి బహుమతి గ్రహీత మలాలా యూసఫ్‌జా ఆగ్రహం వ్యక్తం చేశారు. 'ముస్లిం దేశాలలో బాలికల విద్య' పేరుతో పాక్‌లో రెండు రోజుల పాటు నిర్వహిస్తున్న అంతర్జాతీయ సదస్సులో ఆదివారం ఆమె ప్రసంగించారు. ఈ సదస్సుకు పలు దేశాల ప్రతినిధులు హాజరయ్యారు. ఈ సదస్సులో ఆమె మాట్లాడుతూ.. గాజాలో అన్ని యూని వర్సిటీలను ఇజ్రాయిల్ బాంబులేసి నాశనం చేసిందని ఆందోళన వ్యక్తం చేశారు. 90 శాతానికి పైగా పాఠశాలలను ధ్వంసం చేసిందని, పాఠశాల భవనాల్లో ఆశ్రయం పొందుతున్న పౌరులపై విచక్షణా రహితంగా దాడికి పాల్పడిందని వివరించారు. ఇజ్రాయిల్ మానవహక్కుల, అంతర్జాతీయ చట్టాల ఉల్లంఘనలను తాను ప్రశ్నిస్తూనే ఉంటానని అన్నారు. పాలస్తీనాలో పిల్లలు తమ జీవితాలను, భవిష్యత్తును కోల్పోయారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ఓ పాలస్తీనా బాలిక చదువుకునే పాఠశాలపైబాంబు దాడిచేసి, ఆమె కుటుంబాన్ని హత్య చేస్తే ఆమెకి భవిష్యత్తు లేకుండా చేసినట్లేనని అన్నారు. ఆఫ్ఘన్‌లో తాలిబన్ ప్రభుత్వానికి చట్టబద్ధత కల్పించవద్దని, మహిళలు, బాలికల విద్యను అడ్డుకుంటున్న వారి చర్యలను వ్యతిరేకించాలని ముస్లిం నేతలను అభ్యర్థించారు. వాస్తవంగా చెప్పాలంటే మహిళలను మీగొంతుకను వినిపించాల్సిన సమయం వచ్చిందని, మీరు నిజమైన నాయకత్వాన్ని చూపాలని సూచించారు. అయితే ఈ కార్యక్రమానికి ఆఫ్ఘనిస్తాన్ ప్రతినిధులెవరూ హాజరుకాలేదు. వారికి అధికారికంగా ఆహ్వానం పంపినప్పటికీ సదస్సుకు రాలేదని పాకిస్తాన్ విద్యాశాఖ మంత్రి ఖలీద్ మక్బూల్ సిద్దిఖీ వెల్లడించిన సంగతి తెలిసిందే.



## అధికారంలోకి వస్తే.. నిరుద్యోగులకు రూ.8,500

- ఢిల్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ హామీ

**న్యూఢిల్లీ:** ఢిల్లీలో తాము అధికారంలోకి వస్తే నిరుద్యోగ యువతకు అండగా ఉంటామని కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చింది. ఢిల్లీ ఎన్నికలు మరికొన్ని వారాల్లో జరగనుండటంతో ప్రచారాన్ని ఉధృతం చేసింది. నిరుద్యోగులకు యువ ఉడాన్ యోజన కింద రూ.8,500 ఇస్తామని ప్రకటించింది. ఇది ఉచితంగా ఇచ్చే మొత్తం కాదని వెల్లడించింది. ఆ పార్టీ నేత సచిన్ పైలట్ మాట్లాడుతూ "ఏదైనా కంపెనీ లేదా ఫ్యాక్టరీలో తమకు ఉన్న నైపుణ్యాలను చూపించిన యువతకు ఆర్థిక సాయం చేస్తాం. వారు ఈ కంపెనీల నుంచి ఆ సొమ్మును పొందుతారు. ఇది ఇండ్లల్లో ఖాళీగా కూర్చొనే వారికి ఉచితంగా సొమ్ములు ఇచ్చే పథకం కాదు. ప్రజలు శిక్షణపొందిన రంగాల్లో స్థిరపడేలా సాయం చేయడానికే ఈ పథకం తెచ్చాం" అని పేర్కొన్నారు.

# పశ్చిమ దేశాల ఆంక్షలకు తిరస్కృతి

- మదురోకు బాసటగా నిలిచిన బొలివేరియన్ సాయుధ బలగాలు



**కారకస్:** వెనిజులా ప్రభుత్వ ఉన్నతాధికారులపై అమెరికా , యూరోపియన్ యూనియన్ (ఇయు), బ్రిటన్ తాజాగా ఆంక్షలు విధించడాన్ని బొలివేరియన్ సాయుధ బలగాలు (ఎఫ్ఎఎన్‌బి) తిరస్కరించాయి. సామ్రాజ్యవాద దేశాల గూడు పుఠాణికి ఇది నిలువెత్తు నిదర్శనమని ఎఫ్ఎఎన్‌బి విడుదలజేసిన ప్రకటన పేర్కొంది. అధ్యక్షుడిగా మూడోసారి బాధ్యతలు చేపట్టిన నికోలస్ మదురో పట్ల సైన్యం తన తిరుగులేని విశ్వాసాన్ని ప్రకటించింది. ఈ ఆంక్షలు అంతర్జాతీయ న్యాయ నియమాలకు పూర్తి విరుద్ధమని పేర్కొంది. ప్రజలిచ్చిన తీర్పు మేరకే 2025-2031 కాలానికి వెనిజులా అధ్యక్షుడిగా మదురో శుక్రవారం ప్రమాణ స్వీకారం చేశారు. వెనిజులా సార్వభౌమత్వంపైన, ప్రజాస్వామ్యంపైన శత్రువులు చేస్తున్న దాడిని వెనిజులా ప్రజలు తిప్పకొడతారని సైన్యం హెచ్చరిక చేసింది. సైన్యంలో నాయకత్వాన్ని అప్రతిష్ట పాల్జేసేందుకే ఈ ఆంక్షలను విధించాయి. గత రెండు దశాబ్దాలుగా వెనిజులాకు వ్యతిరేకంగా సామ్రాజ్యవాదులు చేస్తున్న అన్ని యత్నాలను బొలివేరియన్ సైన్యం దృఢ సంకల్పంతో తిప్పికొడుతూ వస్తోంది. ఇప్పుడీ కుట్రలను అంతకు రెట్టించిన పట్టుదలతో వెనిజులా ఎదుర్కొంటుందని ఆ ప్రకటన పేర్కొంది. యూనిఫామ్‌లో ఉన్న సైనికులను రకరకాల ప్రలోభాలు, ఒత్తిళ్లు తెచ్చారని, అయినా వాటన్నిటిని తిరస్కరించి బొలివేరియన్ సాయుధ బలగాలు తమ నిబద్ధతను మరోసారి చాటిచెప్పాయి.




## విచారణకు ముఖం చాటేస్తున్న యూన్

**సియోల్ :** సైనిక పాలన విధించి అభిశంసనకు గురైన దక్షిణ కొరియా అధ్యక్షుడు యూన్ సుక్-యోల్ తనపై మంగళవారం జరిగే తొలి విచారణకు హాజరుకావడం లేదని చెప్పారు. అభిశంసనపై ఈ నెల 14న జరిగే మొదటి విచారణకు ఆయన సహకరించలేదు. యూన్ విచారణకు హాజరయితే భద్రతాపరమైన సమస్యలు తలెత్తే అవకాశముందని ఆయన తరపు న్యాయవాది యూన్ కబ్ కీన్ ఓ ప్రకటనలో తెలిపారు. అభిశంసనపై విచారణకు జనవరి 14 నుండి ఫిబ్రవరి 4 వరకు మధ్య ఐదు తేదీలను కోర్టు నిర్ణయించింది. అభిశంసనకు గురైనప్పటి నుండి యూన్ అధ్యక్ష భవనంలోనే ఉంటున్నారు. అయినా జాతీయ దర్యాప్తు కార్యాలయం (ఎన్ఒఐ), , అవినీతి దర్యాప్తు కార్యాలయం (సిఐఓ) అధికారులు ఆయనను అరెస్ట్ చేయడంలో విఫలమయ్యారు. మరోవైపు యూన్‌ను అరెస్ట్ చేయాలంటూ సియోల్‌లో నిరసనలు హోరెత్తాయి. ఆయనను అరెస్ట్ చేయాలంటూ శనివారం మధ్యాహ్నం వేలాది మంది కొరియన్లు గడ్డకట్టే చలిని సైతం లెక్క చేయకుండా సియోల్ సెంటర్‌లోని ప్రధాన రహదారులపై నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఆయనను అరెస్ట్ చేయాలంటూ డిమాండ్ చేస్తున్నారు.

## పోలండ్‌లో మంచుతుపాను

- 32 వేల గృహాలకు విద్యుత్ బంద్

**వార్సా :** పోలండ్‌ను మంచు తుఫాను చుట్టుముట్టింది. దీంతో దాదాపు 32 వేల గృహాలకు విద్యుత్ సరఫరాకు అడ్డంకులు ఏర్పడ్డాయి. ప్రధానంగా ఉత్తర ప్రావిన్సుల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయిందని ప్రభుత్వ రేడియో ఆదివారం తెలిపింది. కూలిపోయిన చెట్లు, విరిగిన కొమ్మలు, పడిపోయిన విద్యుత్ లైన్ల కారణంగా సరఫరా నిలిచిపోయిందని ఒక అధికారి తెలిపారు. విద్యుత్‌ను పునరుద్ధరించడానికి అత్యవసర సిబ్బంది చురుకుగా పని చేస్తున్నారని చెప్పారు. మరోవైపు పోలండ్ అంతటా మంచు భారీగా కురిసింది. బలమైన గాలులు కూడా వీస్తుండటంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ప్రభుత్వం హెచ్చరించింది.

## 16కి పెరిగిన లాస్ ఏంజెల్స్ కార్చిచ్చు మృతులు

**వాషింగ్టన్:** అమెరికాలో జనాభా పరంగా అతి పెద్ద రాష్ట్రమైన కాలిఫోర్నియాలోని లాస్ ఏంజెల్స్ కౌంటీలోని అల్టాడెనాలో వందలాది కార్లు ధ్వంసమయ్యాయి. మృతుల సంఖ్య 16కి పెరిగింది. లాస్ ఏంజెల్స్ కౌంటీలోని వివిధ ప్రాంతాలకు ఈ విధ్వంసకర కార్చిచ్చు ఇతర ప్రాంతాలకు విస్తరిస్తూనే ఉంది, దీంతో పాఠశాల మూసివేశారు. వినోదం, క్రీడలు, కమ్యూనిటీ ఈవెంట్లు రద్దయ్యాయి. ఇంతవరకు 12 వేలకు పైగా ఇళ్లు భస్మీపటలమయ్యాయి.

## హెచ్ఎంపివి తగ్గుముఖం : చైనా

**బీజింగ్ :** హ్యూమన్ మెటానిమోవైరస్ (హెచ్ఎంపివి) పాజిటివ్ రేటు తగ్గుముఖం పట్టిందని చైనా తాజాగా ప్రకటించింది. చైనాలో ఇటీవల హెచ్ఎంపివితో సహా పలు శ్వాసకోశ వ్యాధులు ఎక్కువగా నమోదవుతున్నట్లు వార్తలు వచ్చాయి. ముఖ్యంగా ఉత్తర చైనా ప్రాంతంలో హెచ్ఎంపివి ప్రభావం ఎక్కువగా కనిపిస్తోందనే కథనాలు వెలువడ్డాయి. అయితే, ఉత్తర ప్రాంతంలో హెచ్ఎంపివి ఇన్ఫెక్షన్ రేటు ప్రస్తుతం తగ్గుముఖం పడుతోందని చైనా ఆరోగ్యశాఖ అధికారులు తాజాగా వెల్లడించారు.

## స్వల్పదూరంలో స్పేడెక్స్ ఉపగ్రహాలు

- ఇస్రో ప్రకటన

**శ్రీహరికోట :** నింగిలో డాకింగ్ ప్రక్రియను విజయవంతంగా నిర్వహించేందుకు ప్రయోగించిన స్పేడెక్స్ ఉపగ్రహాలు అత్యంత సమీపానికి చేరుకున్నాయని ఇస్రో ప్రకటించింది. ఈ మేరకు ఎక్స్‌లో పోస్టు పెట్టింది. తాజాగా వీటిని 15 మీటర్ల సమీపానికి తీసుకొచ్చి.. ఆపై 3 మీటర్లకు ఈ దూరాన్ని తగ్గించింది. ఈ ప్రక్రియ ముగిసిన అనంతరం తిరిగి రెండు ఉపగ్రహాలను సురక్షితమైన దూరానికి జరిపినట్లు పేర్కొంది. ఈ డేటాను విశ్లేషించిన తర్వాత డాకింగ్ ప్రక్రియ చేపడతామని ఇస్రో ప్రకటించింది. అంతకు ముందు స్పేడెక్స్ ఉపగ్రహాల చిత్రాలను కూడా ఎక్స్‌లో పోస్టు చేసింది.

## పుస్తకాలే నిజమైన సంపద

(మొదటి పేజీ తరువాయి)

అందిపుచ్చుకునేందుకు పుస్తకాలకు మించిన సాధనం లేదన్నారు. పుస్తక మహోత్సవ సంఘం కార్యదర్శి మనోహర్‌నాయుడు, గౌరవాధ్యక్షులు బెల్లపు బాబ్జి, సభ్యులు జెపి పబ్లికేషన్స్ అధినేత ప్రసాద్, నవ సాహితీ సంస్థ అధినేత రవి, ఎమెస్కో ప్రతినిధి లక్ష్మి, బుక్ ఫెస్టివల్ సొసైటీ సభ్యులు జి.శ్రీనివాస్, గోళ్ల నారాయణరావు, బాలాంత్రపు ప్రసూన తదితరులు పాల్గొన్నారు. రతన్ టాటా ప్రతిభా వేదికపై బాలలకు నిర్వహించిన పోటీలలో విజేతలకు అతిథులు సర్టిఫికెట్లు, బహుమతులు ప్రదానం చేశారు.

**జీవితంలో హాస్యమనే వెలుతురుండాలి : కృష్ణకుమారి**

జీవితంలో హాస్యం అనే కాంతి ఉన్నప్పుడు విసుగు, విషాదాలు అనే మబ్బులు ముసురుకునే అవకాశం ఉండదని ఆకాశవాణి విజయవాడ పూర్వ సంచాలకులు, రచయిత్రి ముంజులూరి కృష్ణకుమారి అన్నారు. 35వ విజయవాడ పుస్తక మహోత్సవం ఆఖరిరోజు ఆదివారం రామోజీరావు సాహిత్య వేదికపై మొదటి కార్యక్రమంగా జిఆర్‌కె-పోలవరపు సాంస్కృతిక సమితి వారు హాస్య రచయితల తాజా రచనల పఠనంతో హాస్యరథం సభకు ఆమె ప్రయోక్తగా వ్యవహరించారు. ఈ సభలో ఇంగ్లీషు మాట్లాడాలనే మోజుతో సమాజంలో జరుగుతున్న విచిత్రాలపై హాస్యంగా 'ఇంగ్లీషుతోనే ఎంత పనైనా?' అంటూ సశ్రీ తన కథనంలో వినిపించారు. సన్మానాల పేరుతో జరిగే సంఘటనలను 'సన్మాన వైరాగ్యం'తో రావెళ్ల శ్రీనివాసరావు హాస్యంగా వర్ణించారు. జీవితంలో పైకి రావాలంటే ఎలాంటి నిచ్చెనలు, ఎలా ఎక్కాలో తన 'పైకి ఎక్కాలేగానీ.. అన్నీ నిచ్చెనలే' అంటూ మన్నం సింధు మాధురి హాస్యంగా వివరించారు. అందరి భాషలో తప్పులు పట్టే తెలుగు మాస్టారికి బస్సు ప్రయాణంలో ఎదురైన సంఘటనలను మొలుగు కమలాకాంత్ 'సన్యాసిరావు బస్సు ప్రయాణం'లో పేరుతో వివరించారు. తాజాగా పదవీ విరమణ చేసినవారి మనోభావాలు ఎలా ఉంటాయో గోవిందరాజు మాధురి 'ఉద్యోగం విరమిస్తే అందరికీ లోకువే' అంటూ నవ్వుపుట్టేలా విశదీకరించారు. కొచ్చెర్లకోట వెంకట సుబ్బారావు తన హాస్య కథనంలో హాస్యం చేయడంలో, ఆస్వాదించడంలో ఉన్న ప్రమాదాలను నవ్వు పుట్టేలా వివరించారు.







## పిప్పర్‌మెంట్



పిప్పర్ మెంట్ రా
చూస్తే నోరూరురా
ఎంతో తీయగుండురా
చప్పరించి తిందురా
జలుబు దగ్గువచ్చురా
తర్వాత జ్వరంరా
అమ్మానాన్నతో తిట్లురా
డాక్టర్‌తో సూదులురా
చేతికి గడియారంరా
నోటికేమో మాత్రలురా
ముక్కు నుంచి చీమిడిరా
దోస్తులు చూచి నవ్వురా
బడికి పోవుట బందురా
చదువు వెనుకబడునురా
ఆటపాటలు లేవురా
పిప్పరమెంట్లనురా
ఎక్కువగా తినకురా!




– ఎం. వెంకట సుప్రజ,
8వ తరగతి,
జి.ప.ఉ.పా. నర్సింహుల పల్లి,
పెద్దపల్లి జిల్లా.



### గాలిపటం

పిల్లలూ, చింటూ పట్టుకున్న గాలిపటం ఏదో చెప్పండి చూద్దాం.

### నేను గీసిన బొమ్మ





ఎం అభినవ్
2వ తరగతి
అరవింద స్కూల్
కుంచనపల్లి

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com



**సంక్రాంతి కళను ప్రతిబింబిస్తూ గంగిరెద్దుల కళాకారులు చేస్తున్న సందడి పలు గ్రామాల్లో కనిపిస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా పలు ప్రాంతాల్లో గత కొన్ని రోజులుగా వీధుల్లో, ఊరి కూడళ్లలో గంగిరెద్దుల ప్రదర్శనలు అలరిస్తున్నాయి. రాయలసీమ, కోస్తాంధ్ర, ఉత్తరాంధ్ర ప్రాంతాల్లో చాలాచోట్ల ఈ సందడి కొనసాగుతోంది. కృష్ణా, గోదావరి, ఉత్తరాంధ్ర జిల్లాల్లో గంగిరెద్దు కళాకారుల కదలిక ఎక్కువగా ఉంది. పండగ వేళల్లో కళాకారులుగా తిరిగి, మామూలు సమయాల్లో దినసరి కూలీలుగా మారి వీరు జీవనం సాగిస్తున్నారు.**

# సంక్రాంతికి గంగిరెద్దు సందడి

విజయవాడ సమీపాన గుణదలలో గంగిరెద్దుల కాలనీ ఉంది. ఇక్కడ నివాసం ఉంటున్న పలు కుటుంబాలు ఈ వృత్తిని కొన్ని దశాబ్దాలుగా కొనసాగిస్తున్నాయి. కృష్ణా జిల్లా గన్నవరం మండలం తెంపల్లి, చిక్కవరం, బాపులపాడు మండలం రేపల్లె, ఎన్‌టిఆర్ జిల్లా ఎ.కొండూరు మండలం చీమలపాడు, తిరువూరు ప్రాంతాల్లో గంగిరెడ్ల కుటుంబాలు ఉన్నాయి. జగ్గయ్యపేట, ఎర్రబాలెం, ప్రకాశం జిల్లా ఒంగోలులోనూ, జిల్లా కేంద్రమైన శ్రీకాకుళం, పొందూరు, అనకాపల్లి తదితర ప్రాంతాల్లో ఎక్కువ మంది నివసిస్తున్నారు. అందులో కొన్ని కుటుంబాల వారు పండుగల సమయంలో గంగిరెద్దులను ఆడించటం, మిగతా రోజుల్లో ఉపాధి కూలి, పనులు, వ్యవసాయ పనులు, భవన నిర్మాణ కార్మికులుగా పనులు చేస్తున్నారు. మరికొందరు సొంత వ్యవసాయం, ఇంకొందరు కౌలు వ్యవసాయం చేస్తున్నారు. యువతలో చదువు తక్కువగానే ఉంది. చదువుకున్న వారు, ఉద్యోగాలు చేస్తున్న వారు సైతం పండుగ సమయంలో ఇదే వృత్తిని కొనసాగిస్తున్నారు. తర్వాత తమ ఉపాధిలోకి మళ్లీ వెళ్లిపోతున్నారు.

వీరు ఎక్కువ సంచార జీవితాలు గడుపుతుండటం కారణంగా పిల్లలు చదువులకు దూరమవుతున్నారు. ఓ మాదిరిగా చదువుకున్న తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ బడులకు పంపుతున్నారు. దీంతో, గతంతో పోలిస్తే కొత్తతరంలో చదువుకోవటం పెరుగుతోంది. అయితే, ప్రాథమిక విద్యతోనే ఎక్కువ మంది మానేస్తుండటంతో బాల కార్మికులుగా కూడా ఎక్కువమంది ఉంటున్నారు. తెంపల్లిలో సగం కుటుంబాలు వృత్తిలోనూ, మిగతా సగం రోజువారీ కూలీలుగానూ, ఇతర వ్యవసాయ, భవన నిర్మాణ రంగ పనులు చేసుకుంటూ జీవనోపాధి పొందుతున్నారు. పట్టణీకరణ, అపార్టుమెంట్ల సంస్కృతి పెరగటంతో గంగిరెద్దు కళకు కూడా ఆదరణ తగ్గిపోతోంది. పల్లెటూళ్లలో ధాన్యం వస్తున్న తరుణంలో రైతులు ఎంతోకొంత ధనమో, ధాన్యం రూపంలో అందజేస్తున్నారు. నగరాలు, పట్టణాల్లో భవనాల్లో నుంచి బయటకు రావాల్సివుండటంతో పెద్దగా ఆదరణ ఉండటం లేదు. కానీ, సంక్రాంతి సందడిని ఆవిష్కరిస్తూ గంగిరెద్దుల ప్రదర్శనలు సాగుతూనే ఉన్నాయి. వివిధ సాంస్కృతిక కార్యక్రమాల్లో, వివిధ సంస్థల ఉత్సవాల్లో తెలుగు సంస్కృతికి ప్రతిబింబంగా గంగిరెద్దుల ప్రదర్శనకు అవకాశం దొరుకుతోంది. ఇది పాత కళాకారులకు ప్రోత్సాహాన్ని ఇవ్వటమే కాదు; కొత్త వారు దీన్నొక ప్రదర్శన కళగా చేపట్టటానికీ ముందుకు వస్తున్నారు.

– యడవల్లి శ్రీనివాసరావు

### సినిమాల్లో పాటలు పాడా ...



'సిత్తరా సిరపడు... సిత్తరాల సిరపడు... పట్టుబట్టినాడ ఒగ్గనే ఒగ్గడు.. పెత్తనాలు నడిపేడు... చిత్తరాల సిరపడు.. ఊరారా ఒగ్గేసినా ఉడంపట్టు ఒగ్గడు... బుగతోడి ఆంబోతు రంకేసి కుమ్మబోతే... బుగతోడి ఆంబోతు రంకేసి కుమ్మబోతే.. కొమ్ములూడదీసి మరీ పీపలూదినాడురో...' అంటూ సాగిన పాటను పాడింది నేనే. ఆ సినిమాలో పాట పాడేందుకు త్రివిక్రమ్ శ్రీనివాస్ గారు అవకాశం కల్పించారు. ఆ తర్వాత మరో ఎనిమిది సినిమాల్లో పాడారు. మిషన్ 20, దగ్ధం, వీరగున్నమ్మ, అక్షరం తదితర సినిమాల్లో పాడిన పాటలకు మంచి స్పందనే వచ్చింది.

– బాడ సూరన్న, భైరి సారంగపురం,
మందస మండలం,
శ్రీకాకుళం జిల్లా.

### ఉద్యోగం చేస్తూనే ...



మాది జి.సిగడాం మండలం జగన్నాథవలస. వృత్తి రీత్యా వివిధ ప్రాంతాలకు తిరుగుతూ రాపాకలో స్థిరపడ్డాం. నా వయస్సు 26 సంవత్సరాలు. డిగ్రీ బీకాం కంప్యూటర్స్ చదివా. అపోలో ఫార్మశీలో అకౌంటెంట్‌గా పనిచేస్తున్నా. సంక్రాంతి సమయంలో మా కుటుంబాలతో కలిసి నేను కూడా గంగిరెద్దులను ఆడించటానికి వెళ్తున్నాను. మా బృందంలో పంచిరెడ్డి సింహాచలం, ధనకొండ అప్పన్న, యడ్ల అప్పలస్వామి, ధనకొండ అప్పన్న, ధనకొండ వీరాస్వామి, పంచిరెడ్డి శేషు, పల్లి చిన్నారావు, యడ్ల అప్పలస్వామి తదితరులు ఉన్నారు. ప్రతిరోజూ గ్రామాలకు వెళ్లి గంగిరెద్దులను ఆడించి వస్తున్నాం.

– పంచిరెడ్డి కోటేశ్వరరావు, రాపాక,
పొందూరు మండలం, శ్రీకాకుళం జిల్లా.

### బతుకు దెరువుకోసం...



రాష్ట్రవ్యాప్తంగా సుమారు 11.69 లక్షల మంది మా వృత్తిదారులు ఉన్నారు. పండుగల సమయంలో గంగిరెద్దులను ఆడిస్తూ జీవితాలను సాగిస్తున్నాం. మిగతా రోజుల్లో ఉపాధి కూలి పనులు, వ్యవసాయ కూలి పనులు చేసి, జీవిస్తున్నాం. పిల్లలు చదువుకునే అవకాశం తక్కువగానే ఉంది. సంచార జాతిగా మమ్మల్ని ఎస్‌టి జాబితాలో చేర్చితే ఎంతోకొంత ప్రయోజనం ఉంటుంది. రాష్ట్ర ప్రభుత్వం ఆ దిశగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నాం.

– మాదల శ్రీను (గుర్రాల మేస్త్రీ),
ఆవుల రంగారావు, తెంపల్లి,
గన్నవరం మండలం, కృష్ణా జిల్లా.

### అర్ధరాత్రి వరకూ ప్రదర్శనలు



ఉదయం ఊళ్లకు వెళ్లి ఇంటింటికీ తిరుగుతుంటాం. రాత్రి 7 గంటలకు ఊళ్లల్లోని సెంటర్లలో గంగిరెద్దుల ఆటలు ఆడుతాం. ఒక్కోసారి అర్ధరాత్రి 12 వరకూ కూడా మా ప్రదర్శనలు సాగుతాయి. దాతలు ఎంతోకొంత డబ్బులు ముట్టచెబుతారు. గతంలో మాదిరిగా ఇప్పుడు ధాన్యం ఇవ్వటం లేదు.

– పెద్దిబోయిన సుబ్బారావు,
మాదాసు అంజయ్య

### పండుగ రోజుల్లోనే ...



పండుగ రోజుల్లోనే మాకు ఆదరణ ఉంటోంది. సంక్రాంతి సంబరాల్లో భాగంగా పాఠశాలలు, కళాశాలలు, ఇతరత్రా సంస్థలు నిర్వహించే కార్యక్రమాల్లో ప్రత్యేకంగా మమ్మల్ని ఆహ్వానిస్తున్నారు. కొంత డబ్బులు ఇస్తుండటంతో మేము కూడా సంతోషంగా అక్కడ ప్రదర్శనలు ఇస్తున్నాం. అలాంటి అవకాశాలు వస్తున్నప్పుడు కొత్త తరం యువకులు కూడా పాల్గొంటున్నారు.

– నడ్డి వెంకటేశ్వరరావు,
గన్నవరం మండలం

### రంగవల్లి



15 చుక్కలు 8 వచ్చేవరకు (మధ్య చుక్క)



- స్వీటీ శ్రీ,
రాజమండ్రి.

**మా చిరునామా**
మెయిల్ ఐడి : jeevana-pageps@gmail.com
వాట్సాప్ : 83329 25496



- ఎం.నాగ పావని,
పొద్దుటూరు,
కృష్ణా జిల్లా.

17 చుక్కలు 1 వచ్చేవరకు (సరి చుక్క)









**ఈ సంక్రాంతి సినీ ప్రేక్షకులకు పెద్ద పండగనే తెచ్చిపెట్టింది. పండగ సమయంలో విడుదలైన సినిమాలు ప్రేక్షకులను విశేషంగా అలరించడం ఇండస్ట్రీలో ఎప్పటినుండో ఉంది. అప్పట్లో ఎన్‌టిఆర్, ఎఎన్ఆర్, కృష్ణ, శోభన్‌బాబు వంటి అగ్ర హీరోల సినిమాలు సంక్రాంతికి కచ్చితంగా విడుదల చేయాలన్న నియమం కూడా పెట్టుకునేవారు. అంతలా సినీ జగత్తులో ఈ పండగ పెనవేసుకుంది. ఈ పండక్కి కూడా వరుసగా బాలకృష్ణ, వెంకటేష్, రామ్‌చరణ్ సినిమాలు ముస్తాబయ్యాయి. ఇప్పటికే రామ్‌చరణ్ నటించిన 'గేమ్ చేంజర్', బాలకృష్ణ 'డాకు మహారాజ్' విడుదలై ప్రేక్షకులను అలరిస్తున్నాయి. రేపు వెంకటేష్ నటించిన 'సంక్రాంతికి వస్తున్నాం' సినిమా సిద్ధంగా ఉంది.**

# పండగ బరిలో ...

ఆర్‌ఆర్‌ఆర్ తరువాత రామ్‌చరణ్ నుండి వచ్చిన 'గేమ్ చేంజర్' చిత్రం భారీ అంచనాల మధ్య విడుదలైంది. ప్రముఖ దర్శకుడు శంకర్ తెరకెక్కించారు. దిల్‌రాజు నిర్మాణంలో కోట్ల రూపాయల బడ్జెట్‌లో ఈ చిత్రం రూపొందింది. బాలీవుడ్ నటి కియారా అద్వానీ హీరోయిన్‌గా, మరో కీలక పాత్రలో అంజలి నటించారు. రామ్‌చరణ్ ద్విపాత్రాభినయం చేశాడు. మొదటి సారి తండ్రీకొడుకుల పాత్రల్లో నటించాడు. పొలిటికల్ డ్రామాగా తెరకెక్కిన ఈ సినిమాలో తండ్రి పాత్రలో రామ్‌చరణ్ కనబర్చిన అభినయం విమర్శకుల ప్రశంసలను అందుకుంది.

కథేంటంటే.. ఉత్తరప్రదేశ్ ఐపిఎస్ అధికారిగా పనిచేస్తున్న రామ్‌నందన్ (రామ్ చరణ్), కొన్ని కారణాల వల్ల ఐఎఎస్‌లో శిక్షణ తీసుకుంటాడు. వైజాగ్‌లో పోస్టింగ్ పడుతుంది. అక్కడ రాజకీయ వాతావరణంలో తనదైన మార్కు వేస్తాడు. రౌడీ షీటర్లకు, గుండాలకు వార్నింగ్ ఇస్తాడు. అది నచ్చని మంత్రి బొబ్బిలి మోపిదేవి (ఎస్‌జె సూర్య) రామ్‌నందన్‌పై పగ పెంచుకుంటాడు. మరోపక్క తన తండ్రి ముఖ్యమంత్రి సత్యమూర్తి (శ్రీకాంత్)ని ఎలాగైనా తప్పించి, ఆ స్థానంలో తను కూర్చోవాలని పన్నాగాలు పన్నుతుంటాడు. ఇలా మొదటి భాగం కథ నడుస్తుంది. రెండో భాగంలో శ్రీకాంత్ పాత్ర చనిపోతూ రామ్‌నందన్‌ని ముఖ్యమంత్రిని చేస్తాడు. దానికి గల కారణంతో ఫ్లాష్‌బ్యాక్ మొదలవుతుంది. ఆ భాగంలో (రామ్‌చరణ్) అప్పన్న, (అంజలి) పార్వతి పాత్రలు పరిచయం అవుతాయి. ఆ రెండు పాత్రల్లో వారిద్దరూ పోటీపోటీగా నటించారు. ఇద్దరికీ మంచి మార్కులే పడతాయి. ఫ్లాష్‌బ్యాక్ ఎపిసోడ్ ఆద్యంతం ప్రేక్షకులను కట్టిపడేస్తుంది. ప్రేమ, త్యాగం, పరాక్రమం చూపించిన తీరు బాగుంది. శంకర్ సినిమాల్లో ఫ్లాష్‌బ్యాక్‌కి గొప్ప స్థానం ఉంటుంది. ఈ సినిమాలో కూడా అది బాగా వచ్చింది. సెకండాఫ్‌లో ముఖ్యమంత్రిగా రామ్ చరణ్ యాక్షన్ సన్నివేశాలు ఆయన అభిమానులను ఖుషీ చేస్తాయి. ఎస్‌జె సూర్య నటన కూడా ప్రత్యేకంగా చెప్పుకోవాలి. మంత్రి పాత్రలో ఆయన కనబర్చిన నటన అలరిస్తుంది. ముఖ్యమంత్రిగా శ్రీకాంత్ మేకప్ ఆకట్టుకుంటుంది. సముద్రఖని, రాజీవ్ కనకాల, సునీల్, నరేష్, వెన్నెల కిశోర్ కనిపించేది కొంచెం సేపైనా అలరించారు. తమన్ మ్యూజిక్ సినిమాకి ప్లస్ అయ్యింది. కలెక్టర్‌కు ఉన్న అధికారాలు ఏంటి? వాటితో ఆయన ఏమేం చేయగలడు? వంటి విషయాలను తెరకెక్కించిన తీరు బాగుంది. క్లైమాక్స్‌లో ప్రభుత్వాలు ఎలా పనిచేయాలనేది రామ్ చరణ్‌తో చెప్పించే సీన్‌లో శంకర్ మార్క్ కనిపించింది.

**డాకు మహారాజ్..**

బాలకృష్ణ, శ్రద్ధాశ్రీనాథ్, ప్రగ్యాజైస్వాల్ నటించిన డాకు మహారాజ్ చిత్రం భారీ అంచనాల మధ్య విడుదలై బాలకృష్ణ అభిమానులను తెగ ఖుషీ చేస్తోంది. బాబీ తెరకెక్కించిన ఈ చిత్రం ఎమోషన్స్, యాక్షన్, కామెడీకి పెద్ద పీట వేసింది. బాలకృష్ణ మార్క్ డైలాగులు ఈ చిత్రంలో పుష్కలంగా ఉన్నాయి. 'నేను డాకు మహారాజ్. చరిత్ర సృష్టించాలన్నా నేనే.. దాన్ని తిరగరాయాలన్నా నేనే' డైలాగు వచ్చినప్పుడు అభిమానుల అరుపులు, కేకలతో థియేటర్లు మోగిపోయాయి. విలన్ పాత్రలో బాబీ డియోల్ నటన బాలకృష్ణకి పోటాపోటీగా ఉంది. చైల్డ్ ఆర్టిస్ట్ వేద అగర్వాల్ పాత్ర కథలో కీలక మలుపుకి దారితీస్తుంది. ఆ భాగం మంచి ఎమోషన్ డ్రామాగా నడిచింది. 'వాల్తేరు వీరయ్య' వంటి మాస్ ఎలిమెంట్స్ చిత్రం తరువాత బాబీ తెరకెక్కించిన సినిమా కావడంతో ఈ సినిమాపై బాలయ్య అభిమానులు అంచనాలు పెంచుకున్నారు. ఇందులో బాలయ్య మార్క్ మాస్, విలన్లపై విరుచుకుపడిన తీరు అభిమానులను ఖుషీ చేసింది. తమన్ బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ మ్యూజిక్ కూడా ఈ చిత్రానికి అదనపు బలం తెచ్చిపెట్టింది.

**సంక్రాంతికి వస్తున్నాం..**

వెంకటేష్ ఇద్దరు కొత్త నటీమణులతో నటించిన చిత్రం ఇది. అనిల్ రావిపూడి వంటి బెంచ్‌మార్క్ దర్శకుడు తెరకెక్కించిన ఈ సినిమా ఫ్యామిలీ ఆడియన్స్‌ని బాగా అలరిస్తుందని అంటున్నారు. ఐశ్వర్య రాజేష్, మీనాక్షి చౌదరి హీరోయిన్లుగా చేశారు. ప్రతి సంక్రాంతికి తన చిత్రం వుండేలా వెంకటేష్ వేసుకున్న ప్రణాళికలు ఆయన అభిమానులను సంక్రాంతి సందడిని తెస్తున్నాయి. అనిల్, వెంకటేష్ కాంబోలో వచ్చిన ఎఫ్–2, ఎఫ్–3లు ప్రేక్షకులకు వినోదం అందించాయి. ఈ చిత్రం కూడా ఆ తరహాలో ఉంటుందంటున్నారు. భీమ్స్ ఈ చిత్రానికి సంగీతం అందించారు. సుదీర్ఘకాలం తరువాత రమణ గోగుల వంటి సీనియర్ గాయకుడితో 'గోదారి గట్టు మీద రామచిలకనే...' పాటని పాడించారు. వెంకటేష్ కూడా ఓ పాట పాడేశారు. ఈ సినిమా ప్రమోషన్స్‌ని అనిల్ రావిపూడి ఒక రేంజ్‌లో చేశారు. సెట్స్‌పై కొన్ని సీన్లు, ఇంటర్వ్యూలు, వెంకటేష్‌తో చిట్‌చాట్ ఇలా.. సోషల్‌మీడియాలో విస్తృత ప్రచారం చేశారు. గతంలో వెంకటేష్ ఇద్దరు హీరోయిన్లతో నటించిన సినిమాలన్నీ బ్లాక్‌బస్టర్ హిట్‌లు. ఈ చిత్రం కూడా అదే స్థాయి విజయం అందుకుంటుందని దర్శక నిర్మాతల మాట. మొత్తానికి ఈఏడాది సంక్రాంతి బరిలో నిలిచిన చిత్రాలు ఏది ఎంతగా ఆకట్టుకుందో ఈవారంలోనే కలెక్షన్ల లెక్కలు చెప్పనున్నాయి.

# రోడ్రిగ్స్ సెంచరీ

- రెండో వన్డేలో ఐర్లాండ్ మహిళలపై 116పరుగుల తేడాతో గెలుపు
- సిరీస్ టీమిండియా కైవసం

**రాజ్‌కోట్:** ఐర్లాండ్ మహిళలతో జరిగిన రెండో వన్డేలోనూ భారత మహిళల జట్టు గెలిచి సిరీస్‌ను కైవసం చేసుకుంది. తొలుత టీమిండియా నిర్ణీత 50 ఓవర్లలో ఐదు వికెట్ల నష్టానికి 370 పరుగుల భారీస్కోర్‌ను నమోదు చేయగా.. ఛేదనలో ఐర్లాండ్ జట్టును నిర్ణీత ఓవర్లు పూర్తయ్యేసరికి 7వికెట్ల నష్టానికి 254పరుగులకే పరిమితం చేసింది. దీంతో రెండో వన్డేలో 116పరుగుల తేడాతో నెగ్గిన టీమిండియా.. మరో మ్యాచ్ మిగిలి ఉండగానే వన్డే సిరీస్‌ను 2–0తో చేజిక్కించుకుంది. టాస్ గెలిచిన టీమిండియా కెప్టెన్ మంధాన తొలుత బ్యాటింగ్ ఎంచుకుంది. మంధాన, ప్రతీక జోడి శుభారంభాన్నిచ్చారు. వీరిద్దరూ తొలి వికెట్‌కు 156 పరుగులు జోడించారు. మంధాన 54 బంతుల్లో 10 ఫోర్లు, రెండు సిక్సర్లతో 73 పరుగులు, ప్రతీక 61 బంతుల్లో 8 ఫోర్లు, ఒక సిక్సర్‌తో 67 పరుగులు చేసి గట్టి పునాది వేశారు. ఆ తర్వాత హర్లీన్ డియోల్ కూడా అర్ధ సెంచరీతో మెరిసింది. ఆమె 84 బంతుల్లో 12 ఫోర్లతో 89 పరుగులు చేసింది. జెమీమా రోడ్రిగ్స్ 91 బంతుల్లో 12 ఫోర్లతో 102 పరుగులు చేసింది. అంతర్జాతీయ క్రికెట్ మహిళల వన్డేలో జెమీమాకు ఇది తొలి సెంచరీ. రీచా ఘోష్ ఐదు బంతుల్లో 10 పరుగులు చేసి అవుటయ్యింది. తేజల్ హసబ్నిస్, సయాలి సత్ఘారే చెరో రెండు పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచింది. ఐర్లాండ్ తరఫున ఓర్లా ప్రెండర్‌గాస్ట్, అర్లీన్ కెల్లీ చెరో రెండు వికెట్లు, జార్జినా డెంప్సేకు ఒక వికెట్ దక్కింది. దీంతో ఐర్లాండ్ ముందు భారీ లక్ష్యాన్ని ఉంచిన టీమిండియా.. ఆ తర్వాత బౌలింగ్‌లో సమిష్టిగా రాణించింది. ఆల్‌రౌండర్ దీప్తి శర్మ(3/37), ప్రియా(2/53)కి తోడు టిటాస్ సద్ధు, సయాలి ఒక్కో వికెట్‌తో మెరిసారు. ఇక ఐర్లాండ్ వికెట్ కీపర్ రెలె(80) అర్ధసెంచరీకి తోడు, సరాహ్(38), లారా(37) బ్యాటింగ్‌లో రాణించారు. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ జెమిమా రోడ్రిగ్స్‌కు లభించగా.. మూడో, చివరి వన్డే బుధవారం జరగనుంది.



రోడ్రిగ్స్(102 పరుగులు) 91 బంతుల్లో 12 ఫోర్లు

**వన్డేల్లో టీమిండియా రికార్డు స్కోర్..**

వన్డేల్లో టీమిండియా మహిళలజట్టు రికార్డు స్కోర్‌ను నమోదు చేసింది. ఇంతకు ముందు 2017లో వడోదరలో ఐర్లాండ్‌తో జరిగిన మ్యాచ్‌లో రెండు వికెట్ల నష్టానికి 358 పరుగులు చేసింది. మహిళల వన్డేల్లో 15వ అత్యధిక స్కోరు ఇదే. మహిళల వన్డేల్లో అత్యధిక స్కోరు సాధించిన జట్టుగా న్యూజిలాండ్ నిలిచింది. 2018లో డబ్లిన్‌లో ఐర్లాండ్‌తో జరిగిన మ్యాచ్‌లో నాలుగు వికెట్లు కోల్పోయి 491 పరుగులు చేసింది. వన్డేల్లో ఇప్పటి వరకు న్యూజిలాండ్ ఇప్పటి వరకు నాలుగు సార్లు అత్యధిక స్కోర్ సాధించింది.

**స్కోర్‌బోర్డు..**

**ఇండియా మహిళల ఇన్నింగ్స్:** మంధాన (సి)డెంసే (బి)ప్రెండర్గ్యాస్ట్ 73, రావత్ (ఎల్‌బి)డెంసే 67, హర్లిన్ (సి)డెలానీ (బి)అర్లీనా కెల్లె 90, రోడ్రిగ్స్ (బి)కెల్లె 102, రీచా ఘోష్ (సి)సర్జెంట్ (బి)ప్రెడెంగ్యాస్ట్ 10, తేజల్ (నాటౌట్) 2, సయాలి (నాటౌట్) 2, అదనం 25, (50ఓవర్లలో 5వికెట్ల నష్టానికి 370పరుగులు. **వికెట్ల పతనం:** 1/156, 2/156, 3/339, 4/358, 5/368

**బౌలింగ్:** ప్రెడెంగ్యాస్ట్ 8–0ı72ı2, కానింగ్ 10–0–51–0, కెల్లె 10–0–82–2, సర్జెంట్ 9–0–77–0, డజ్జెల్ 5–0–41–0, డెంసే 8–0–42–1.

**ఐర్లాండ్ మహిళల ఇన్నింగ్స్:** ఫోర్బ్స్ (బి)దీప్తి 38, లెవీస్ (సి)రీచా (బి)సయాలి 12, రెలె (బి)టిటాస్ సద్ధు 80, ప్రెడెంగైస్ట్ (సి)సయాలి (బి)ప్రియా 3, డెలానీ (ఎల్‌బి)దీప్తి 37, లేహ్ పాల్ (నాటౌట్) 27, అరెనే కెల్లె (బి)దీప్తి 10, కానింగ్ (బి)ప్రియా 11, డెంసే (నాటౌట్) 6, అదనం 21. (50 ఓవర్లలో 7వికెట్ల నష్టానికి) 254పరుగులు.

**వికెట్ల పతనం:** 1/12, 2/87, 3/101, 4/184, 5/188, 6/218, 7/234

**బౌలింగ్:** టిటాస్ సద్ధు 10–0–48–1, సయాలి 9–1–40–1, సైమా ఠాకూర్ 9–0–50–0, ప్రియా మిశ్రా 10–0–53–2, దీప్తి శర్మ 10–0–37–3, ప్రతిక రావల్ 2–0–12–0

## 2025 సీజన్ ఐపిఎల్ తేదీలు వచ్చేశాయ్!

- మార్చి 21న ప్రారంభం, మే 25న ఫైనల్
- నూతన కార్యదర్శిగా దేవజిత్
- కోశాధికారిగా ప్రభ్‌తేజ్ సింగ్



దేవజిత్ సైకియా(కార్యదర్శి), ప్రభ్‌తేజ్ సింగ్ భాటియా(ట్రెజరర్)

**ముంబయి:** ఇండియన్ ప్రిమియర్ లీగ్(ఐపిఎల్) 2025 సీజన్ ఐపిఎల్ తేదీలు వచ్చేశాయి. మార్చి 21న జరిగే తొలి మ్యాచ్‌తో 2025 ఐపిఎల్ సీజన్ ప్రారంభం కానుండగా.. మే 25న జరిగే ఫైనల్ మ్యాచ్ ఐపిఎల్ సీజన్ ముగియనుంది. ముంబయిలోని బిసిసిఐ ప్రధాన కార్యాలయంలో జరిగిన జనరల్ సమావేశంలో బిసిసిఐ ఉపాధ్యక్షుడు రాజీవ్ శుక్లా ఈ విషయాన్ని వెల్లడించారు. అలాగే బిసిసిఐ నూతన కార్యదర్శిగా దేవజిత్ సైకియా, కోశాధికారిగా ప్రభ్‌తేజ్ సింగ్ భాటియా ఎన్నికయ్యారు. ఈ సమావేశంలో ఆస్ట్రేలియా పర్యటనలో టీమిండియా ప్రదర్శన, మహిళల ప్రిమియర్ లీగ్(డబ్ల్యుపిఎల్) తదితర అంశాలపైనా సుదీర్ఘ చర్చ జరిగింది. 2024 ఐపిఎల్ మార్చి 22న బెంగళూరు–చెన్నైల మధ్య తొలి మ్యాచ్‌తో ప్రారంభమై.. మే 26న కోల్‌కతా జట్టు ట్రోఫీ ముద్దాడడంతో ముగిసింది. కానీ ఈసారి ఒకరోజు ముందుగానే ఈ ఏడాది ఐపిఎల్ సీజన్ ప్రారంభం కానుంది. ఈ ఏడాది జరిగే ప్లేఆఫ్, ఫైనల్ మ్యాచ్ తేదీలపై శుక్లా ఎలాంటి ప్రకటన చేయలేదు. కొత్త షెడ్యూల్‌కు సంబంధించిన పనులు త్వరలోనే షురూ కానున్నాయని, ఐపిఎల్ 18వ ఎడిషన్ ప్రారంభంపైనే ప్రధానంగా చర్చించినట్లు ఆయన తెలిపారు.

## సెమీస్‌కు విదర్భ, హర్యానా

- కర్ణాటక, మహారాష్ట్ర కూడా...
- విజయ్ హజారే వన్డే టోర్నీ

**ముంబయి:** విజయ్ హజారే వన్డే టోర్నమెంట్ సెమీఫైనల్లోకి విదర్భ, హర్యానా జట్లు దూసుకెళ్లాయి. ఇతర క్వార్టర్స్ పోటీల్లో కర్ణాటక, మహారాష్ట్ర జట్లు కూడా గెలిచి సెమీస్‌కు చేరాయి. వడోధర వేదికగా విదర్భ–రాజస్తాన్ జట్ల మధ్య జరిగిన క్వార్టర్‌ఫైనల్ మ్యాచ్ హోరాహోరీగా సాగింది. తొలుత రాజస్తాన్ జట్టు 50ఓవర్లలో 8వికెట్ల నష్టానికి 291పరుగుల భారీస్కోర్‌ను నమోదు చేయగా.. ఆ లక్ష్యాన్ని విదర్భ జట్టు కేవలం ఒక వికెట్ కోల్పోయి 43.3ఓవర్లలోనే ఛేదించింది. విదర్భ ఓపెనర్ కరణ్ నాయర్(122నాటౌట్), ధృవ్ షోరే(118 నాటౌట్) ధనా ధన్ ఇన్నింగ్స్‌తో చెలరేగారు. ఇక క్వార్టర్స్ పోటీల్లో హర్యానా జట్టు 2వికెట్ల తేడాతో గుజరాత్‌ను, కర్ణాటక జట్టు 5పరుగుల తేడాతో బరోడాను చిత్తు చేశాయి. నాల్గో క్వార్టర్స్‌లో మహారాష్ట్ర జట్టు 70పరుగుల తేడాతో పంజాబ్‌ను చిత్తుచేసి సెమీస్‌కు చేరింది.

**సెమీఫైనల్స్...**

బుధ : హర్యానా × కర్ణాటక
గురు : విదర్భ × మహారాష్ట్ర

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68